సోమవారం
19•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 253
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

చెక్కుల రూపంలో


ఏప్రిల్ 20న పంట పెట్టుబడికి శ్రీకారం.. వానాకాలం పంటకు సాయంతో నాంది

నవంబర్ 18 నుంచి యాసంగి సాయం పంపిణీ

- రెండు విడుతలుగా ఆర్థిక సాయం
- వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ డ్రాఫ్ట్‌ను రూపొందించాలి
- సబ్సిడీపై వరినాట్ల యంత్రాలను అందించేందుకు చర్యలు
- రైతు పెట్టుబడి పథకం, వ్యవసాయ కార్యక్రమాలపై సీఎం కేసీఆర్ సమీక్ష.. అధికారులకు ఆదేశాలు
- 25న హైదరాబాద్‌లో, 26న కరీంనగర్‌లో మండల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సమావేశాలు.. హాజరుకానున్న సీఎం
- 42 మందితో రాష్ట్ర రైతు సమన్వయ సమితి


ఆదివారం ప్రగతిభవన్‌లో వ్యవసాయశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దండుగన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తదేకదీక్షతో ముందుకు సాగుతున్నారు. రైతన్నకు అండదండలను అందించే వ్యవసాయ పెట్టుబడి పథకానికి ఏప్రిల్ 20న వానకాలం పంటకు సాయంతో శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. యాసంగి సాయం పంపిణీ నవంబర్ 18 నుంచి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పంట పెట్టుబడి సాయం మొత్తం చెక్కుల రూపంలో రైతన్నలకు అందించాలని స్పష్టం చేశారు. వ్యవసాయానికే పెద్దపీట వేయాలన్న సర్కారు నిశ్చయానికి అనుగుణంగా ప్రత్యేక బడ్జెట్ ముసాయిదాను తీర్చిదిద్దాలని తీర్మానించారు. వ్యవసాయ యాంత్రీకరణలో ముందంజ వేస్తూ సబ్సిడీపై వరినాట్ల యంత్రాలను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ విధివిధానాల్లో రైతు సమితుల పాత్రపై వెలుగును ప్రసరించేందుకు ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులకు స్వయంగా హాజరై రైతుల మనసులోని మాటను వింటానని హామీ ఇచ్చారు. 42 మంది సభ్యులతో త్వరలోనే రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. ప్రగతిభవన్‌లో ఆదివారం వ్యవసాయశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పంట పెట్టుబడి మిగతా 2వ పేజీలో


విశిష్ట అతిథిగా రోబో సోఫియా

WCIT

నేటి నుంచి వరల్డ్ ఐటీ కాంగ్రెస్

వీడియో కాల్ ద్వారా ప్రసంగించనున్న ప్రధాని మోదీ

టీ ఫైబర్ పనితీరును వివరించనున్న మంత్రి కేటీఆర్

2

అమ్మ ఒడిలో సురక్షితంగా..

గర్భిణులకు సేవలు అందిస్తున్న 102 వాహనాలు

నెల రోజుల్లో 8,819 మందికి లబ్ధి

ఏడాదికి ప్రభుత్వం ఖర్చుచేస్తున్న మొత్తం 23.94 కోట్లు

12

ఇరాన్‌లో విషాదం



ఇరాన్ పర్వత శ్రేణిలో విమానం కూలిన వార్త విని టెహ్రాన్ విమానాశ్రయం వద్ద కన్నీరుమున్నీరవుతున్న ఆ విమానంలోని ప్రయాణికుల బంధువులు

పర్వతాల్లో విమానం కూలి.. 65 మంది దుర్మరణం

- మృతుల్లో చిన్నారిసహా 59 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది
- మంచు తుఫాన్‌లో సాంకేతికలోపంతో ప్రమాదం!

టెహ్రాన్, ఫిబ్రవరి 18: ఇరాన్‌లో ఆదివారం ఉదయం ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 65 మంది దుర్మరణం చెందారు. ఇటీవలే రష్యాలో విమానం కూలి 71 మంది మృతిచెందిన ఘటనను మరువక ముందే ఇరాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. మృతుల్లో ఒక చిన్నారి సహా 59 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. సాంకేతిక లోపం తలెత్తడం.. మంచు తుఫాన్ కారణంగా వాతావరణం అనుకూలించక పర్వతాల్లో విమానం కూలినట్టు విమానయాన సంస్థ అధికారులు మిగతా 5వ పేజీలో



కేటీఆర్‌కు జర్మనీ నుంచి పిలుపు

- ఏషియా పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్ ప్రత్యేక ఆహ్వానం
- తెలంగాణ ప్రభుత్వ విధానాలపై ప్రసంగించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మరొక అంతర్జాతీయ సంస్థ నుంచి రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావుకు ఆహ్వానం వచ్చింది. జర్మన్ ఏషియా పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్ 98వ సమావేశానికి హాజరుకావాలని ఆ సంస్థ నుంచి పిలుపు అందింది. జర్మనీలోని హాంబర్గ్‌లో మార్చి 2వ తేదీన జరుగనున్న ఈ సమావేశంలో పాల్గొని తెలంగాణలో గల అపార వ్యాపార, వాణిజ్య అవకాశాలను వివరించాలని సంస్థ కోరింది. ఆసియా దేశాలతో జర్మనీ నిర్వహించే వ్యాపార, వాణిజ్య అవకాశాలను చర్చించే ఈ సమావేశానికి అంతర్జాతీయంగా పేరున్న 300 మంది వాణిజ్యవేత్తలు, రాజకీయనాయకులు, దౌత్యవేత్తలు హాజరవుతారని అసోసియేషన్ తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం మూడేండ్లుగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, ఆర్థిక విధానాలపై జర్మన్ వ్యాపారవర్గాలకు ఆసక్తి ఉన్నదని, అందుకే తమ దేశంలోని అగ్రస్థాయి వ్యాపారవేత్తలతో ప్రత్యేకంగా ఒక రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించింది. దీనికి ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించాలని మంత్రి కేటీఆర్‌ను అసోసియేషన్ కోరింది. ఈ సమావేశంతో తెలంగాణ, జర్మనీ మధ్య వాణిజ్యబంధం మరింత విస్తృతం అవుతుందని అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. తెలంగాణలో వ్యాపారావకాశాల గురించి జర్మనీకి చెందిన వాణిజ్యసంఘం ఆసక్తి వ్యక్తంచేయడం, తనను ప్రత్యేకించి సమావేశానికి ఆహ్వానించడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

పీఎన్బీ స్కామ్ తరహాలో

800 కోట్లు ఎగ్గొట్టిన రొటోమాక్ కొఠారీ

- బ్యాంకులకు ఎగనామం పెట్టి పెన్నుల కంపెనీ యజమాని మాయం!


విక్రమ్ కొఠారీ

కాన్పూర్, ఫిబ్రవరి 18: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) కుంభకోణం తరహాలోనే ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకులకు శఠగోపం పెట్టిన మరో ఘటన వెలుగులోకి వచ్చింది. 'రొటోమాక్ పెన్స్' ఉత్పత్తిదారు విక్రమ్ కొఠారీ.. ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.800 కోట్ల మేర రుణం గానీ, దానిపై వడ్డీ గానీ ఇప్పటివరకు చెల్లించనే లేదని అధికార వర్గాలు తెలిపాయి. పీఎన్బీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాతే 'రొటోమాక్ పెన్స్' రుణం రికవరీ కాలేదన్న విషయం బయటకు రావడం గమనార్హం. అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి విక్రం కొఠారీ రుణాలు పొందారు. సదరు బ్యాంకుల అధికారులు విక్రమ్ కొఠారీకి రుణాల మంజూరులో నిబంధనలకు తిలోదకాలిచ్చారని తెలుస్తున్నది. తొలుత యూనియన్ మిగతా 5వ పేజీలో

తెలంగాణ ఐటీఐలు భేష్

ఇంజినీరింగ్ విద్యార్థుల కంటే ఐటీఐ అభ్యర్థులకే ఎక్కువ ఉద్యోగాలు

కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి అనంతకుమార్ హెగ్డే

12



మోసగాళ్ల చేతిలో వజ్రాయుధం

కుంభకోణాలకు చిరునామాగా మారిన వజ్రాభరణాల వ్యాపారం

పైపై మెరుగుల్ని చూసి వేల కోట్ల రుణాలిచ్చేస్తున్న బ్యాంకర్లు

లోతైన విచారణకు దిగుతున్న దర్యాప్తు సంస్థలు • వజ్రాలు, ఆభరణాల వాణిజ్యంతో సంబంధాలపై ఆరా


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: వజ్రం.. శ్రీమంతుల సంపద, హోదా, దర్పానికి ప్రతిబింబం. వజ్రాభరణాలకు సంఘంలోనే కాదు.. వ్యాపారంలోనూ ప్రత్యేక స్థానమే ఉన్నది. అయితే సంపన్న వర్గాల ఇండ్లలో మాత్రమే విరబూసే ఈ వజ్రకాంతులను.. ఇప్పుడు అక్రమార్కులు తమ చీకటి సామ్రాజ్యాల రాచబాటలకు దీపపు కాంతులుగా వాడుకుంటున్నారు. అవును.. వజ్రాభరణాల వ్యాపారం ఇప్పుడు మోసాలకు చిరునామాగా మారింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం ఇదే చెబుతున్నది మరి. రూ.11,400 కోట్ల ఈ కేసులో ప్రధాన నిందితులంతా కూడా వజ్రాభరణాల వ్యాపారులే. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలతోపాటు నీరవ్ భార్య అమీ, సోదరుడు నిషాల్ అందరూ అపర కుబేరులే. ఈ హోదా.. బ్యాంకుల్ని నమ్మించి వంచించడానికి చాలా బాగా ఉపయోగపడుతున్నది. కొందరు బ్యాంకర్లు వీరి లగ్జరీ లైఫ్‌ను చూసి బొక్కబోర్లా పడుతుంటే, మరికొన్ని బ్యాంకుల్లో ఉన్నతోద్యోగులు వీరితో చేతులు కలిపి ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. వజ్రాల వ్యాపారం అనగానే భారీ లావాదేవీలు ఉండనే ఉంటాయి. సరిగ్గా దీన్ని అసరాగా తీసుకునే బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలను ఇట్టే పొందుతున్నారు వజ్రాభరణాల వర్తకులు. చివరకు ప్రజల సొమ్ముతో పరాయి దేశానికి పారిపోతున్నారు.

షెల్ కంపెనీలపై కార్పొరేట్ మంత్రిత్వశాఖ దృష్టి

మరోవైపు పీఎన్‌బీ కుంభకోణంపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కూడా దృష్టి సారించింది. నీరవ్, చోక్సీలతో



నీరవ్ భార్య అమీమోదీ



భార్యతో నిషాల్

సంబంధాలేమైనా ఉన్నాయా? అన్న కోణంలో నమోదైన అన్ని సంస్థలు, వాటి డైరెక్టర్ల వివరాలను సేకరిస్తున్నది. దేశవ్యాప్తంగా నీరవ్, చోక్సీలకు పదుల సంఖ్యలో వ్యాపార సంస్థలున్న విషయం తెలిసిందే. నీరవ్ మోదీ డైరెక్టర్‌గా ఉన్న నాలుగు సంస్థలు అధికారికంగా నమోదవగా, మరో నాలుగు పరిమిత బాధ్యతాయుత భాగస్వామ్య (ఎల్‌ఎల్‌పీ) సంస్థలు మనుగడలో ఉన్నాయి. నీరవ్ డైరెక్టర్‌గా ఉన్న సంస్థల్లో ఫైర్‌స్టార్ డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, రాధాషిర్ జువెల్లరీ కంపెనీ, జువెల్లరీ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ ఉన్నాయి. అలాగే ఎల్‌ఎల్‌పీల్లో పంచజన్య డైమండ్స్ ఎల్‌ఎల్‌పీ, నీషల్ ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పీ, పారగాన్ జువెల్లరీ ఎల్‌ఎల్‌పీ, పారగాన్ మర్చెండైజింగ్ ఉన్నాయి. నీరవ్ పేరు బయటకురాని మరెన్నో సంస్థలూ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలోనే 150 షెల్ కంపెనీల (డొల్ల సంస్థలు)ను కనుగొన్న కార్పొరేట్ మంత్రిత్వ శాఖ.. వీటిపై దర్యాప్తు చేయనున్నది. నీరవ్ మోదీ.. ఫోర్బ్స్ భారతీయ ధనవంతుల జాబితాలో 1.7 బిలియన్ డాలర్లతో ఉండగా, హాలీవుడ్ అగ్రతార కేట్ విన్స్‌లెట్‌తోపాటు బాలీవుడ్ కథానాయికలైన ప్రియాంకా చోప్రా, కరీనాకపూర్, అలియాభట్, శిల్పాశెట్టి తదితరులు నీరవ్ వద్ద వజ్రాభరణాలను చేయించుకున్నట్లు ఆయన వెబ్‌సైట్ ద్వారా తెలుస్తున్న సమాచారం. మొత్తానికి లక్షల కోట్ల లావాదేవీలకు వేదికైన వజ్రాల వైభవం.. మోసగాళ్ల చేతిలోపడి మసకబారుతున్నది.

వెతికితే నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలెందరో



నీరవ్‌మోదీ



మెహుల్ చోక్సీ

పైపై మెరుగుల్ని చూసి బ్యాంకర్లు వేల కోట్ల రుణాలిచ్చేస్తుండగా, వెతికితే నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ వంటివారెందరో బయటపడుతారన్నది మాత్రం నిజం. ఇప్పుడు ఆ దిశగానే దర్యాప్తు సంస్థలు అడుగులేస్తున్నాయి. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రిత వ్యవస్థ సెబీ.. డిజైనర్ జువెల్లర్ నీరవ్ మోదీతో సంబంధాలున్న స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సంస్థలపై దృష్టిసారించింది. నీరవ్ మామ మెహుల్ చోక్సీ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్న గీతాంజలి జెమ్స్ కార్యకలాపాలనూ క్షుణ్ణంగా గమనిస్తున్నది. వజ్రాల వ్యాపారులకు, స్టాక్ మార్కెట్ బ్రోకర్లకు మధ్యనున్న సంబంధాలను తెలుసుకునే పనిలో ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి చెప్పారు. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా పీఎన్‌బీ లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నది. ఇక వజ్రాలు, ఆభరణాల వాణిజ్యంతో సంబంధాలున్న ఖాతాదారులందరిపై అన్ని బ్యాంకులూ ప్రత్యేక నిఘా పెట్టాయి. నిజానికి ఇటీవలికాలంలో వెలుగుచూసిన భారీ రుణ ఎగవేతల్లో వజ్రాల వ్యాపారంతో సంబంధాలున్నవారూ ఉన్నారు. దీంతో వజ్రాలు, ఆభరణాల రంగాల రుణాలపై ఓ కన్నేయాలని బ్యాంకర్లకు ఆర్బీఐ సూచిస్తున్నది. తరచూ మనీల్యాండరింగ్ కేసుల్లో వజ్రాభరణాల వర్తకులు ఇరుక్కుంటుండటం కూడా ఈ రంగం ప్రతిష్ఠను దిగజారుస్తున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం ఈ వ్యాపార లావాదేవీలను చాలా దగ్గరగా గమనిస్తుండగా, కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ.. పీఎన్‌బీ కుంభకోణం కేసులో దాదాపు అన్ని రత్నాలు, ఆభరణాల సంస్థల వాణిజ్య లావాదేవీలను జల్లెడ పడుతున్నది.

బయో ఏషియాకు చురుగ్గా ఏర్పాట్లు

22 నుంచి 24 వరకు హెచ్‌ఐసీసీలో సదస్సు

ప్రారంభించనున్న సీఎం కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే బయో ఏషియా సదస్సుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 22న సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సదస్సును ప్రారంభిస్తారు. హెచ్‌ఐసీసీలో ఈనెల 22 నుంచి 24వ తేదీవరకు సదస్సు జరుగుతుంది. 23, 24 తేదీల్లో టెక్నికల్ సెషన్స్ ఉంటాయి. శుక్రవారం సాయంత్రం జరిగే సెషన్‌కు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభుతోపాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు హాజరుకానున్నారు. ఏషియాలో అతిపెద్దదైన ఈ బయో ఏషియా సదస్సు సందర్భంగా ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, బయోసైన్స్‌లో వస్తున్న మార్పులు, కొత్త టెక్నాలజీపై చర్చిస్తారు. ఈ సంవత్సరం సదస్సుకు ఫార్మా, బయోటెక్నాలజీ రంగానికి చెందిన కీలకవ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, రెగ్యులేటరీ సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నట్టు పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. లైఫ్‌సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లైఫ్‌సైన్సెన్స్ పరిశ్రమ క్రమంగా కెమికల్ ఆధారిత డ్రగ్స్ నుంచి బయోలాజిక్స్‌కు మారుతున్నదని ఆయన అన్నారు. ప్రపంచ మార్కెట్లో వస్తున్న మార్పులు, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. ఈ సదస్సు సందర్భంగా ప్రతినిధులు జీనోమ్‌వ్యాలీని సందర్శించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫార్మా అనుబంధ రంగాలపై ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో 50కి పైగా దేశాల నుంచి 700కు పైగా కార్పొరేట్ కంపెనీలు తమ ఉత్పత్తులు, ఫార్మా రంగ అత్యాధునిక యంత్రసామగ్రిని ప్రదర్శించనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం, ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోయేషన్స్ (ఎఫ్‌ఏబీఏ) సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి. ఈవెంట్ పార్ట్‌నర్‌లుగా టీఎస్‌ఐఐసీ, రిచ్, ఫిక్కీ ఉన్నాయి. బయో ఏషియా సదస్సు ప్రారంభ కార్యక్రమంలో స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మిచెల్ ఎన్ హాల్‌కు ప్రతిష్ఠాత్మక జీనోమ్‌వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం చేస్తారు. ప్రభుత్వం 2004 నుంచి ప్రతి సంవత్సరం బయో ఏషియా సదస్సు సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్తను ఎంపిక చేసి అవార్డు అందజేస్తున్నది. దీనిలో భాగంగా ఈసారి మిచెల్‌ను ఎంపిక చేశారు.

చెక్కుల రూపంలో



ఆదివారం ప్రగతిభవన్‌లో వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ , సీఎస్ ఎస్కే జోషి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్క సుమన్, మండలిలో ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులు ఎస్ నర్సింగరావు, రామకృష్ణారావు, పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం జగన్మోహన్ తదితరులు కూడా ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

మద్దతు పథకం ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని చెక్కులరూపంలో ఇవ్వనున్నట్టు సీఎం కేసీఆర్ చెప్పారు. వానకాలం పంట వేసుకోవడానికి ఎకరానికి రూ.4000 చొప్పున అందించే కార్యక్రమాన్ని ఏప్రిల్ 20న ప్రారంభించాలని ఆదేశించారు. యాసంగి పంట కోసం ఇచ్చే పెట్టుబడి పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 18నుంచి నిర్వహించాలని చెప్పారు. దీనికి సంబంధించిన నిధులను బడ్జెట్‌లోనే కేటాయించనున్నట్టు సీఎం ప్రకటించారు. భవిష్యత్‌లో రైతులు కూలీల కొరతను ఎదుర్కొంటారని, దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించనున్నట్టు చెప్పారు. వరినాట్లు వేసే యంత్రాలను సబ్సిడీపై అందించాలని సీఎం నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. దేశంలో మరేరాష్ట్రంలో అమలు చేయనన్ని కార్యక్రమాలు వ్యవసాయరంగంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిందని కేసీఆర్ చెప్పారు. ఈ ఏడాది నుంచి మరిన్ని కార్యక్రమాలు కూడా రూపొందిస్తున్నందున.. ఎక్కడా నిధుల సమస్య రాకుండా ఉండేందుకు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు వివరించారు. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి అనుగుణంగా ముసాయిదా తయారుచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

రైతు సదస్సుల తేదీలు ఖరారు

ఈ నెల 25, 26 తేదీల్లో మండల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయడం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రైతులకు చేరవేసే విషయంలో రైతు సమన్వయ సమితులు నిర్వహించాల్సిన పాత్రను సదస్సుల్లో సభ్యులకు వివరించనున్నట్టు వెల్లడించారు. 25న హైదరాబాద్‌లోని వ్యవసాయవర్సిటీలో, 26న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. పంట పెట్టుబడి మద్దతు పథకానికి సంబంధించిన ఆర్థికసాయాన్ని చెక్కులరూపంలో రెండు విడుతలుగా అందించనున్నట్టు చెప్పారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, వ్యవసాయరంగ అభివృద్ధి కోసం కృషిచేస్తున్న నిపుణులు, శాస్త్రవేత్తలతో కూడిన రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితిని త్వరలోనే నియమిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు.

రైతులతో సీఎం కేసీఆర్ ముచ్చట

ఈనెల 25న హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే ప్రాంతీయ సదస్సుకు జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూలు, జోగుళాంబ-గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి-షాద్‌నగర్ జిల్లాలకు చెందిన మండల రైతు సమన్వయ సమితి సభ్యులను ఆహ్వానించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. అదేవిధంగా ఈనెల 26న కరీంనగర్‌లో జరిగే ప్రాంతీయ సదస్సుకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీమ్-ఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాలకు చెందిన సభ్యులను ఆహ్వానించాలని చెప్పారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సులో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖమంత్రి సందేశాలతోపాటు రైతులతో ముఖ్యమంత్రి నేరుగా సంభాషించే కార్యక్రమాలుంటాయి. రైతు సంక్షేమం కోసం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని, ఈ కార్యక్రమాల్లో రైతు సమన్వయసమితుల సభ్యులు ఎలాంటి పాత్ర పోషించాలనే విషయమై సదస్సుల్లో కూలంకషంగా చర్చిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్‌శాఖల అధికారులు కూడా ఈ సదస్సుల్లో పాల్గొంటారని సీఎం కేసీఆర్ వెల్లడించారు. సదస్సులకు హాజరయ్యే మండల రైతు సమన్వయ సమితుల సభ్యుల ప్రయాణ, భోజన సదుపాయాలన్నీ వ్యవసాయశాఖ సమకూర్చాలని సీఎం చెప్పారు. రైతులను సంఘటితం చేయడం, రైతు వేదికల నిర్మాణం-నిర్వహణ, రైతులకు నిరంతర శిక్షణ, పంట పెట్టుబడి మద్దతు పథకం, పంటలకు కనీస మద్దతుధర అందేలా చూడడం, మార్కెట్లకు ఉత్పత్తులు తీసుకువచ్చే విషయంలో నియంత్రణలు పాటించడం, మేలైన సాగుపద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయ విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజ్ చైన్, క్రాప్‌కాలనీలు తదితర అంశాల్లో రైతు సమన్వయ సమితులు నిర్వహించాల్సిన పాత్రపై కరదీపిక అందించడంతో పాటు, సదస్సుల్లో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించాలని సీఎం కే చంద్రశేఖర్‌రావు చెప్పారు.

త్వరలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి

42 మంది సభ్యులతో త్వరలోనే రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. 30 జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు వ్యవసాయ శాఖాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయరంగ నిపుణులను కూడా కమిటీలో సభ్యులుగా నియమించనున్నట్టు సీఎం చెప్పారు. వ్యవసాయ రంగాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నవారిని సభ్యులుగా నియమించాలని, దీనికోసం పేర్లు సూచించాలని సీఎం అధికారులను కోరారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ , ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, ఎంపీలు గుత్తా సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులు ఎస్ నర్సింగరావు, రామకృష్ణారావు, పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం జగన్మోహన్, వ్యవసాయ యూనివర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, సీఎంవో కార్యదర్శులు స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.44 గంటలకు



సూర్యాస్తమయం: 6.16 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తదియ తె. 5.19 వరకు, తదుపరి చతుర్థి. నక్షత్రం: ఉత్తరాభాద్ర మధ్యాహ్నం 1.39 వరకు, తదుపరి రేవతి. అమృత ఘడియలు: ఉదయం 8.40 నుంచి 10.16 వరకు, రాహుకాలం: ఉదయం 8.11 నుంచి 9.37 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.53 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.11 నుంచి 3.57 వరకు, వర్జ్యం: తె. 1.13 నుంచి 2.49 వరకు.

నేటి నుంచే వరల్డ్ ఐటీ కాంగ్రెస్

- వీడియో కాల్ ద్వారా ప్రధాని ప్రసంగం
- టీ ఫైబర్ పనితీరును ప్రదర్శించనున్న మంత్రి కేటీఆర్
- విశిష్ట అతిథిగా హ్యూమనాయిడ్ రోబో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక విశ్వసదస్సుకు వేదిక కానున్నది. ఐటీ ఒలింపిక్స్‌గా పేరొందిన వరల్డ్‌కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసీఐటీ) సదస్సు 19 నుంచి 21వ తేదీవరకు హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జరుగనున్నది. 'ఆంప్లిఫై డిజిటల్-డిస్‌రప్ట్ ద కోర్' అనే థీమ్‌తో ఈ సదస్సు సాగనున్నది. ఈ కార్యక్రమానికి సమాంతరంగానే నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ఫోరం జరుగుతుంది. ఈ రెండు కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా వ్యవహరిస్తున్నది. డబ్ల్యూసీఐటీ ప్రారంభోత్సవం సందర్భంగా సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. హ్యూమనాయిడ్ రోబో సోఫియా విశిష్ట అతిథిగా హాజరవుతుంది. రీథింకింగ్ గవర్నెన్స్ అనే అంశంపై మంత్రుల సమావేశానికి కేంద్రమంత్రి సారథ్యం వహించనున్నారు. 30 దేశాల నుంచి 500కు పైగా అతిథులు హాజరుకానున్నారు. మూడు రోజులపాటు 22 పవర్‌ప్యాక్డ్ సెషన్లు కొనసాగనున్నాయి. డబ్ల్యూసీఐటీతో పాటుగా భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ఫోరం సదస్సుకు హైదరాబాద్ వేదిక అవుతోంది. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ భారతదేశానికి చెందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల వేదిక అయిన నాస్కాం సమన్వయంతో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నది. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ ఆధ్వర్యంలో 1978లో మొట్టమొదటిసారిగా వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసీఐటీ) జరిగింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ విభాగంలో ప్రాధాన్యం గల వేదికగా నిలుస్తున్నది. 2016లో బ్రెజిల్‌లో జరుగగా, 2017లో తైవాన్‌లో జరిగింది.

నేడే టీ-ఫైబర్‌గ్రిడ్ ప్రదర్శన

ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌ను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దిన టీ-ఫైబర్‌గ్రిడ్ పథకం టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్ (టీడీఎన్) సోమవారం ప్రారంభం కానున్నది. ప్రధానమంత్రి ప్రసంగం తర్వాత ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు హాజరయ్యే ప్రతినిధులకు మంత్రి కేటీఆర్ ఈ పథకం గురించి వివరిస్తారు. పౌరసేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి సాంకేతిక విప్లవాన్ని ఇంటింటికీ చేరవేసేందుకు ఉద్దేశించిన తెలంగాణ ఫైబర్‌గ్రిడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నది. టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్(టీడీఎన్) పేరుతో మహేశ్వరం,తుమ్మలూరు, మన్సాన్‌పల్లి,సింగూర్‌పూర్ గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టును అమలుచేస్తున్నారు.

కృష్ణాబోర్డు దూకుడుకు కళ్లెం!

- చిన్ననీటి పారుదల వినియోగంపై వివక్ష వైఖరికి చెక్
- తెలంగాణ నీటి వినియోగంపైనే పట్టుబట్టిన బోర్డు
- రెండురాష్ట్రాల్లోనూ శాస్త్రీయ లెక్కలు తేలాలన్న కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చిన్ననీటి పారుదల కింద నీటి వినియోగంపై పదేపదే ఆంధ్రప్రదేశ్ తెలంగాణ వైపు వేలెత్తి చూపడం, కృష్ణానది యాజమాన్య బోర్డు కూడా దీనికి వంతపాడటానికి తెరపడింది. ఏపీని వదిలేసి తెలంగాణలోని చిన్ననీటి పారుదల వినియోగంపైనే పట్టుబడుతూ వస్తున్న కృష్ణాబోర్డు ఏకపక్ష వైఖరికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఎండగట్టినట్టు తెలుస్తున్నది. తెలంగాణ పరిధిలోనే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ)తో సర్వే చేయించేందుకు కృష్ణాబోర్డు తీవ్ర ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా ఇటీవల చైర్మన్‌గా రిటైర్ అయిన శ్రీవాత్సవ ఎన్‌ఆర్‌ఎస్సీతో సర్వే ఒప్పందం ఫైలుపై సంతకం చేసేందుకు కూడా పావులు కదిపారు. దీనికి వెనుక ఆంధ్రప్రదేశ్ అధికారుల హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. తెలంగాణ నీటిపారుదల శాఖ సరైన సమయంలో ఈ ప్రయత్నాన్ని విఫలం చేసింది. వాస్తవంగా తెలంగాణ తమ పరిధిలో చిన్ననీటి పారుదల కింద నీటి వినియోగం ఉన్నదని అంగీకరిస్తున్నది. కాకపోతే.. బచావత్ అవార్డులో ఉమ్మడి ఏపీకి ఈ అంశం కింద కేటాయించిన 116 టీఎంసీల్లో తెలంగాణకు 89 టీఎంసీల వాటాను కేటాయించి, ఇప్పుడు కూడా అంతే వినియోగాన్ని ప్రతి ఏటా నమోదు చేస్తామనే వాదనను వ్యతిరేకిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి 89 టీఎంసీల సామర్థ్యంతో చెరువులు ఉండొచ్చు. కానీ, 60 ఏండ్లలో వేల చెరువులు ధ్వంసమవడంతోపాటు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 46 వేల చెరువుల్లోనూ దశాబ్దాల కిందటి నిల్వ సామర్థ్యం లేదు. అందుకే మిషన్ కాకతీయ ద్వారా వాటికి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలో చెరువుల కింద ప్రతిఏటా 89 టీఎంసీలను వాడుకున్నట్టుగా లెక్కల్లో నమోదు చేస్తామనడం అశాస్త్రీయమనేది తెలంగాణ వాదన. పైగా ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టుల ద్వారా చెరువులను నింపి, రైతులకు సాగునీరు అందిస్తున్నది. ఒకవైపు ప్రాజెక్టుల కింద, మరోవైపు చెరువుల కింద నీటి వినియోగాన్ని లెక్కించడమనేది కూడా అశాస్త్రీయం. అందుకే వాస్తవంగా వర్షాల ద్వారా చెరువులు నిండి, తద్వారా రైతులు వినియోగించుకున్న నీటిని లెక్కించేందుకు శాస్త్రీయ అంచనా కావాల్సి ఉన్నది. దీనిపై కృష్ణాబోర్డు తీసుకున్న చర్యలేవీ లేవు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోనూ చెరువుల సంఖ్య తక్కువేమీ లేదు. బచావత్ కేటాయించిన 116 టీఎంసీల్లో సుమారు 27 టీఎంసీలు ఆ రాష్ట్ర చిన్ననీటి పారుదల వినియోగం కింద ఉన్నది. కానీ, ఇంత పరిమాణంలో తాము వాడుకోలేదంటూ తక్కువ పరిమాణాన్ని ఏపీ చెప్తున్నది. ఇలా రెండురాష్ట్రాల పరిధిలోనూ చిన్ననీటి పారుదల వినియోగంపై అయోమయం నెలకొని ఉన్నది. ఈ క్రమంలో కృష్ణాబోర్డు ఏకపక్షంగా తెలంగాణపైనే దృష్టి సారించి దూకుడుగా ముందుకువెళ్లేందుకు ప్రయత్నించింది. కానీ, ఈ నెల 15న ఢిల్లీలో కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బోర్డు దూకుడుకు కళ్లెం పడినట్టు స్పష్టమవుతుంది. సమావేశం సందర్భంగా ఏపీలో చిన్ననీటి పారుదల కింద వినియోగం ఎంతో చెప్పండి అనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ప్రశ్నకు ఏపీ జల వనరులశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ సరైన సమాధానం చెప్పలేకపోయారు. అంటే ఏపీలోనూ చిన్ననీటి పారుదల వినియోగంపై స్పష్టతలేదు. ఈ నేపథ్యంలోనే రెండు వైపులా శాస్త్రీయ అంచనా జరుగాలని కేంద్ర జల వనరులశాఖ కార్యదర్శి యూపీ సింగ్ స్పష్టంచేయడంతో కృష్ణాబోర్డు ఏకపక్ష వైఖరికి తెరపడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

లోకం పోకడ



ఇంకా ఎన్నిరోజులు ఈ గునపాలు, బ్యాంకుకు కన్నాలు.. దొరికితే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగడాలు.. నేనూ అప్‌డేట్ అయ్యి ఫారిన్‌లో సెటిల్ అయిపోతా!

వర్మ చెప్పిందాంట్లో నిజమెంత!

- ల్యాప్‌టాప్‌లో కీలక సమాచారం
- ఫోరెన్సిక్ పరీక్షలకు పంపిన సైబర్‌క్రైం పోలీసులు
- పాస్‌పోర్ట్, స్కైప్ ఐడీ సేకరించే పనిలో నిమగ్నం
- ఆర్థికపరమైన లావాదేవీలతోపాటు అన్ని కోణాల్లో విచారణ!
- అశ్లీల చిత్రం జీఎస్‌టీ వివరాలపై ఆరా



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 'గాడ్ సెక్స్ అండ్ ట్రూత్' (జీఎస్‌టీ) పేరుతో అశ్లీల చిత్రం తీసిన దర్శకుడు రాంగోపాల్‌వర్మ చెప్తున్న మాటల్లో ఏది నిజం, ఏది అబద్ధం అనే విషయాలు తేల్చేపనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. వర్మ ల్యాప్‌టాప్‌లో కీలక సమాచారం ఉంటుందని భావిస్తున్నారు. జీఎస్‌టీ సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ మాత్రమే తనదని, స్కైప్ ద్వారా దర్శకత్వం చేశానని, సినిమాతో సంబంధంలేదని శనివారం పోలీసుల విచారణలో వర్మ వెల్లడించిన విషయం తెలిసిందే. విచారణ సమయంలో సాంకేతికపరమైన విషయాల్లో రాంగోపాల్‌వర్మ తడబడుతూ, స్పష్టత ఇవ్వకపోవడంతో వచ్చే శుక్రవారం మరోసారి విచారణకు హాజరుకావాలని పోలీసులు ఇప్పటికే సూచించారు. విచారణలో వెల్లడించిన అంశాల్లో ఏదీ నిజం.. ఏదీ అబద్ధమనేది నిర్ధారించేందుకు ల్యాప్‌టాప్‌లోని సమాచారం సైబర్‌క్రైమ్ పోలీసులకు కీలకంగా మారనుంది. అమెరికాలో శృంగారపరమైన సినిమాల్లో నటించే మియా మల్కోవా.. జీఎస్‌టీలో నటించడంతో ఆమెతో వర్మ జరిపిన సంభాషణల సమాచారాన్ని సేకరించనున్నారు. ఆమెతో మొదటిసారి ఎప్పుడు మాట్లాడారు.. చాటింగ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ పోస్టులు, ఈ మెయిల్ సందేశాలు వంటివి కీలక ఆధారాలుగా మారనున్నాయి. ఎవరు ఆమెతో కాంట్రాక్టు కుదుర్చుకొన్నారు? ఆమెకు డబ్బు ఎవరిచ్చారు, సినిమా నిర్మాణ సంస్థ ఎవరెవరికి రెమ్యునరేషన్లు ఇచ్చింది, సినిమాను ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్‌చేసి, దాని హక్కులను ఎవరు విక్రయించారు? అనేది పోలీసులు పరిశీలిస్తున్నారు. అందులోభాగంగా వర్మ బ్యాంకు ఖాతాల వివరాలు, ఆర్థికపరమైన లావాదేవీల చిట్టా వెలికితీస్తే వర్మ జీఎస్‌టీ బండారం బయటపడే అవకాశాలున్నాయి. స్కైప్ ఐడీతో పోలాండ్, యూకే, లాస్‌ఏంజిల్స్‌లో సినిమా షూటింగ్‌లకు దర్శకత్వం వహించినట్టు విచారణలో వర్మ వెల్లడించాడు. ఈనేపథ్యంలో స్కైప్ సంస్థకు కూడా పోలీసులు లేఖ రాయనున్నారు. వర్మ ల్యాప్‌టాప్‌ను పోలీసులు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు.





యాదాద్రి నృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడ ముద్దలను ఎగురవేస్తూ గరుత్మంతున్ని ఆహ్వానిస్తున్న ప్రధానార్చకుల బృందం.. ఉత్సవాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీనరసింహుడు

వైభవం.. దేవతాహ్వానం

నేడు పెండ్లికొడుకు కానున్న యాదాద్రి నర్సన్న

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి నృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం, దేవతాహ్వానం వైభవంగా నిర్వహించారు. సోమవారం నర్సన్న పెళ్లికొడుకు కానుండగా, శ్రీవారి వాహనమైన గరుత్మంతునితోపాటు 33 కోట్ల దేవతలు తరలిరావాలనే ఆహ్వాన తంతును అట్టహాసంగా జరిపారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారలను ఉదయం పంచామృతాలతో అభిషేకం చేశారు. పట్టు పీతాంబరాలతో ముస్తాబు చేసి పలురకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.

దేవాదుల-తుపాకులగూడెంకు

త్వరలో కార్పొరేషన్!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల సత్వర పూర్తికి ఉన్న అవకాశాలన్నింటినీ ప్రభుత్వం వినియోగించుకుంటున్నది. ప్రభుత్వం భారీఎత్తున సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న దరిమిలా ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటుచేసి నిధుల సమీకరణ కోసం బ్యాంకులు, ఆర్థికసంస్థల నుంచి రుణాలు తీసుకుంటున్నది. ఇప్పటికే మిషన్ భగీరథ, కాళేశ్వరం ఎత్తిపో తల పథకానికి కూడా కార్పొరేషన్లు ఏర్పాటుచేసింది. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్‌రూరల్, అర్బన్, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల పరిధిలో 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నది. దేవాదుల ఇన్‌టేక్ పాయింట్ వద్ద నీటి లభ్యత ఉండేందుకుగాను రీడిజైనింగ్‌లో భాగంగా గోదావరి నదిపై తుపాకులగూడెం బరాజ్‌ను కూడా చేపట్టింది. వీటి పనులు కొనసాగుతుండగా మిగిలిన పనులకు కావాల్సిన నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ మేరకు ఇటీవల ఆర్థికశాఖ, నీటిపారుదలశాఖ అధికారుల సమీక్షలో వీటికి ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటుచేయడం ద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు వస్తుందని నిర్ణయించారు. కంపెనీ చట్టం-2013లోని సెక్షన్ 149-1-ఏ ప్రకారం చొక్కారావు దేవాదుల లిఫ్టు ఇరిగేషన్ స్కీం అండ్ తుపాకులగూడెం బరాజ్ ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ ఏర్పాటుచేయనున్నారు.

పసివాడి వైద్యానికి మంత్రి హరీశ్ చేయూత

- కృతజ్ఞతలు తెలిపిన బాలుని తల్లిదండ్రులు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: గుండె సంబంధ వ్యాధితో జన్మించిన బాలుడి వైద్యానికి రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు చేయూతనిచ్చి ప్రాణప్రదాతగా మారారు. మంత్రి తమ బిడ్డకు పునర్జన్మ ఇచ్చారని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన పుట్ట ఉమారాణి సతీశ్ దంపతులకు గత నెలలో బాబు జన్మించాడు. ఆ చిన్నారి అనారోగ్యంతో ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని స్టార్ దవాఖానకు తరలించారు. వైద్యపరీక్షలు చేయించగా గుండె సంబంధమైన వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనలో పడింది. ఒకవైపు బాబు జన్మించాడనే ఆనందం, మరోవైపు ఆపరేషన్ చేస్తే తప్ప చిన్నారి బతుకని పరిస్థితి. ఆపరేషన్ చేయిస్తే రూ.6 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబానికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో చిరుఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న బాలుడి తండ్రి సతీశ్.. ఆపరేషన్ చేయించే ఆర్థిక స్థోమత లేక తల్లడిల్లిపోయారు. ఈ విషయం మంత్రి హరీశ్‌రావు దృష్టికి రావడంతో స్పందించి వెంటనే వారిని పిలిపించుకొని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్టార్ దవాఖాన యజమాన్యం డాక్టర్ గోపిచంద్‌తో మాట్లాడి పసివాడికి మెరుగైన వైద్యం చేయాలని, అందుకు అవసరమైన ఆర్థికసహాయం చేస్తామని, ప్రభుత్వం ద్వారా చేయూతనందిస్తామని తెలిపారు. జనవరి 23న హృదయ ఫౌండేషన్ సహకారంతో పసివాడికి వైద్యం అందించి ప్రాణం పోశారు. ఆదివారం ఆ పసివాడి తల్లిదండ్రులు సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావును కలిశారు. బాబును మంత్రి హరీశ్‌రావు ఆనందంగా ఎత్తుకున్నారు.




వైద్యం పొందిన చిన్నారిని ఎత్తుకున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బాలుడి తండ్రి సతీశ్



అంగారకుడిపై నుంచి నాసాకు చెందిన ఆపర్చునిటీ రోవర్ పంపిన చిత్రం

అంగారకుడిపై రాతి చారలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 18: అంగారకుడిపై తిరుగుతున్న నాసాకు చెందిన ఆపర్చునిటీ రోవర్ నీటి జాడకు సంబంధించిన మరో కీలక సమాచారం అందించింది. తాను పరిశోధనలు జరుపుతున్న ఎండీవర్ అగ్నిపర్వత ఉపరితలంపై రాతి చారలను గుర్తించింది. ఇవి భూమిపై ఉన్న కొన్ని పర్వతాల ఏటవాలులోని చారలను పోలి ఉన్నట్టు పరిశోధకులు చెప్తున్నారు. పర్వతాలు లేదా ఇతర ఏటవాలు తలంపై ఉండే తడి మట్టి తరుచూ గడ్డకట్టడం, కరుగడం వల్ల ఇలాంటి పొరలు ఏర్పడుతాయన్నారు. అయితే ఇలాంటి రాతి చారలు గాలి ప్రభావంతో లేదా ఏటవాలు తలంలోని మట్టిలో ఉన్న పెద్దసైజు మట్టి కణాలు గురుత్వాకర్షణ ప్రభావంతో కిందివైపునకు కదులడం లేదా ఇతర కారణాల వల్ల కూడా ఏర్పడొచ్చన్నారు. ఈ చారలు ఎన్నేండ్ల కిందట ఏర్పడ్డాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. నాసా ప్రయోగించిన ఆపర్చునిటీ రోవర్ 2004 జనవరిలో అంగారకుడిపై ఉన్న ఎండీవర్ అగ్నిపర్వతంపై దిగింది. పర్వతంపై ఉన్న 'పెర్సెవెరన్స్ వ్యాలీ' అనే కాలువపై పరిశోధనలు జరుపుతున్నది. ఇప్పటివరకు మార్స్‌పై 5000 రోజులు గడిపిన ఆపర్చునిటీ రోవర్.. గతంలోనూ నీటి జాడకు సంబంధించిన పలు కీలక సమాచారం అందించింది. 'పెర్సెవెరన్స్ వ్యాలీపై 14 ఏండ్లుగా పరిశోధనలు జరుపుతున్నా రోజూ కొత్తగానే అనిపిస్తున్నది. గతంలో ఎండీవర్ అగ్నిపర్వత శిఖరంపై మంచు ఉండి, సీజన్ల వారీగా అది కరుగడం, గడ్డకట్టడం వల్ల ఇలాంటి రాతి చారలు ఏర్పడి ఉండొచ్చు' అని వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన రే అర్విండ్సన్ తెలిపారు. గురుత్వాకర్షణ వల్ల కొండ ఏటవాలు ప్రాంతంలోని మట్టి కిందివైపునకు జారుతూ ఇలాంటి చారలు ఏర్పరిచే అవకాశం ఉన్నదన్నారు. రోవర్ గతంలో పంపిన సమాచారంతో, తాజా సమాచారాన్ని జోడించి విశ్లేషిస్తున్నామన్నారు.



రచయిత తన ఆలోచనలను లోతుగా పాతిపెట్టి, నవలలోని తన పాత్రల ద్వారా పలికించాలె.

మో యాన్

వాట్సప్‌పై ఓ యుద్ధగీతం

'పోకేమాన్'ను పట్టుకోవడం సరే
నీ సమస్త ఆశలను మార్కెట్లో సరుకుగా చేసి
దోచుకుంటున్న 'ప్యాకెట్ మ్యాన్' సంగతేంచేద్దాం

నిన్నునిన్నుగా జీవించనివ్వలేని
నిన్ను నిన్నుగా ఆవిష్కరించుకోనివ్వని మార్కెట్ లోకం
వైఫైలా నిన్ను వెంటాడుతుంటే
యాంటీవైరస్‌లా మారాల్సిన విషయాన్ని గూర్చి ఏం ఆలోచిద్దాం?

నీ సాంస్కృతిక విలువలన్నింటినీ ఎవడో మూటగట్టుకొనిపోయి
మళ్ళీ వాటికే వాడి రంగు, ఆలోచనలు తొడిగి
ఫ్లిప్‌కాట్‌లోనో అమెజాన్‌లోనో పార్సిల్ చేస్తుంటే
మురిసిపోతున్న మనం
పన్నెండు మెట్ల కిన్నెర రాగాలను ఎలా విందాం?

నీ కంటికి తారుపూసి, నీ ఆలోచనలకు ఇనుప కంచె నిర్మించి



నిన్ను నిష్క్రియా పరున్ని చేసి
నీకు తెలియకుండానే
నీ చేతి వేళ్ళకు గూగుల్ కళ్ళజోడును తొడిగించిన
'గూగుల్ గుండు'కు గుండెను ఇంకెన్నడు ఎదురొడ్డుదాం!

నీ చుట్టూ వాట్సప్ ఉచ్చుబిగిస్తూ
నీ లోకంలో నువ్వు ఉండేలా వలయాలను నిర్మించే యూట్యూబ్‌లను
సృష్టిస్తూ
నీకు తెలియకుండానే,
నీ ప్రమేయం లేకుండానే
నీ వ్యక్తిగత జీవితంలోకి ప్రవేశించి
నీపై అప్రకటిత నిఘాను అమలుచేస్తూ
నేడు సిల్వర్ చిప్'లను తమ ఇనుప పాదాలకు
నాడాలుగా తొడుక్కుంటున్నవాణ్ణి
నిలువరించాల్సింది ఇంకెప్పుడు!

ఫేస్‌బుక్‌లో ఫేషియల్ చేసిన ముఖాలను
ఆరబోసుకునేవారు చాలామందే ఉంటారు
ఎన్నడూ ఫేషియల్ జోలికెళ్ళని
నీ అరవై ఏళ్ళ ముసలమ్మ ముఖమ్మీద
మడతలకు కారకులను ఎప్పుడు లెక్కకడుదాం!
వారి లెక్కలను ఎప్పుడు సరిచేద్దాం!!
వాడి గుండెనే వాడి ఊపిరితిత్తులకు
ఎప్పుడు వేళాడదీద్దాం!!!

– డాక్టర్ ఎస్.చంద్రయ్య, 9963709032

మెత్తబడిన సంస్కృత శిలలు

తెలుగులో వ్యాకరణరీత్యా చూసినప్పుడు ఐదు భాషా భాగాలున్నవి. ఇంద్రియ గోచరాలైన వస్తువులకు పెట్టిన పేర్లను స్థూలంగా నామవాచకాలు అని పేర్కొన్నారు వైయాకరణులు. వాటికి బదులుగా వాడుకనే మాటల్ని సర్వనామాలని వ్యవహరించారు. పనుల్ని సూచించడానికి క్రియలనీ, లింగవచన విభక్తి రహితమైన వాటినిఅవ్యయాలనీ, నామవాచక ధర్మాన్ని తెలిపితే విశేషణాలనీ పిలిచారు. ఈ ఐదు భాషా భాగాల ద్వారా వ్యక్తమయ్యే పదాలు అన్నీ తెలుగులో తెలుగు భాషకు సంబంధించినవే అయివుంటాయని చెప్పడం సత్యదూరం. ఉదాహరణకు తెలంగాణలో నిజామాబాదు ప్రాంతాల్లో విరివిగా చెరుకు పండుతుంది. అక్కడ మొన్నమొన్నటి వరకూ రైతులందరూ బెల్లం వండేవాళ్ళు. చెరుకును గిరకల్లో వేసి పాలు తీసి దాదాపు ఏడు కుండల పాలను పెద్ద 'కడాయి'లో పోసి కింద మంట పెట్టేవాళ్ళు. ఆ పాలు మరిగి చివరికి బెల్లం తయారయ్యేది. పై వాక్యాల్లోని 'కడాయి'ని పరిశీలిద్దాం. అది పెద్ద వృత్తాకారంలో వున్న మూకుడు. ఈ 'కడాయి' తెలుగు పదం కాదు. అది నామవాచకమే! 'కటాహము' అనే సంస్కృత శబ్దంలోంచి వచ్చిందే 'కడాయి'. ఇట్లా నామవాచకాల్లో, సర్వనామాది యితర భాషా భాగాలను సూచించే మాటల్లో.. ఇతర భాషా పదాలు తప్పకుండా వుంటాయి. ఒక భాషలో ఈ ప్రపంచంలోని సమస్త వస్తు సముదాయాన్ని వ్యక్తీకరించేందుకు పదసంపదలేని సందర్భంలో ఇంకొక భాషలోంచి పదాల్ని స్వీకరిస్తారు ప్రజలు. ప్రజలే కాదు, పండిత జనం కూడా ఇట్లాగే చేస్తారు. ఇది అనివార్య పరిస్థితి. అవసరాల మేరకైనా అరువు తెచ్చుకుంటాం. లేదూ, అధికార భాషగా ఏదేని ఒక భాష చెలామణిలో వున్నప్పుడు కూడా ఆ భాషా పదాలు పాలిత భాషలపై ఆధిపత్యం నెరపుతాయి. అట్లా తెలుగులోనికి సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ పదాలు అసంఖ్యాకంగా వచ్చి చేరినై.

సంస్కృతంలో 'కార్యము' అని ఒక మాట వుంది. దీనికి పని, హేతువు అని నైఘంటిక అర్థాలు. తెలంగాణలో మాత్రం కార్యం అంటే కాలేయం అని అర్థం.'కాలేయం'అనే మాట సైతం సంస్కృత నామవాచకమే! అయినా జనం కాలేయాన్ని, కార్యం, కార్జం అంటారు. కలేజా అనేది హిందీ పదం. నిఘంటువుల్లో యిచ్చిన అర్థాలకు భిన్నంగా జన వ్యవహారంలో కొన్ని పదాలు వినియోగంలో వున్నప్పుడు వాటిని అర్థవిపరిణామం అంటాం. తెలంగాణలో కార్యం అంటే కేవలం కాలేయార్థమే కాకుండా 'శోభనం' అనే అర్థఛాయ సైతం వుంది.

'కాలం' అనేది సంస్కృత పదం. అది అకారాంత స్త్రీ లింగశబ్దం. దీనికి ప్రధానమైన అర్థం 'సమయం' అని. అయితే తెలంగాణలో ఈ అర్థంతో పాటు అన్యార్థాలూ వున్నై. 'కాలం అవుడు' అంటే వానలు కురియటం. వర్షాలు బొత్తిగా లేకుంటే 'కాలం బోయింది' 'కాలం ముంచింది' అంటారు. వర్షాలు చక్కగా తొలకరితో మొదలైతే 'మంచిగ కాలం పూనింది' అని వ్యవహరిస్తారు. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు 'కాలం జేసిండు' అనే వ్యక్తీకరణ వుంది తెలంగాణలో. దుర్మార్గుణ్ణి, అసాధ్యుణ్ణి 'వాడు కాలాంతకుడు' అని సైతం పేర్కొంటారు. ప్రామాణిక భాషలోని 'కాలధర్మం చేశాడు' అనే వాక్యానికి సమాన వాక్యం తెలంగాణ 'కాలం జేసిండు'.

తెలంగాణలో 'కాష్టం' అంటే చితి, కాడు. నిజానికి ఈ కాష్టం సంస్కృతంలో 'కాష్ఠ' అని వుంటుంది. అది చివర వున్న ఆకారం వదిలించుకుని ఆకారాంతమై 'ము' ప్రత్యయంతో 'కాష్టము'గా ముస్తాబవుతుంది. కాష్టం అంటే కర్ర అని అర్థం. కర్రలూ, కట్టెలూ పేర్చి పెట్టి తయారుచేసిందే కాష్ఠం. అయితే సంస్కృత కాష్ఠానికి 'కాడు' అనే అర్థం లేదు. తెలంగాణవాసులే చితిని 'కాష్ఠం' అంటున్నారు.

'కన్నీరు మున్నీరుగా విలపించారు' అనే ఆధునిక ప్రమాణ భాషాశోక సూచక వ్యాక్యం తెలంగాణలో 'గుడ్డుకు కుంచెడు నీల్లు వడిపింద్రు' అవుతుంది. ఆంధ్రలో కోస్తావారికి 'మున్నీరు' (సముద్రం) వుంది కనుక అది వారి పలుకుబడికి చేరి శోకాధిక్యాన్ని సూచిస్తున్నది. తెలంగాణకు సముద్రంలేదు కనుక ఇక్కడ 'కుంచెడు' వచ్చింది. గుడ్డు అంటే కనుగుడ్డు. మన దృష్టి అంతా 'కుంచెడు' మీద అవసరం. ఆ వాక్యాల (రెండు ప్రాంతాల) సారం తెలుసు మనకు. ఈ 'కుంచెడు' మానార్థకం. అంటే కొలత. అది కుంచము+ఎడు నుంచి ఏర్పడింది. 'కుంచము' అచ్చంగా సంస్కృత పదమే!

తెలంగాణలో 'పీరీలగుండం', 'గుడి ముందరి గుండం' అనే మాటల వ్యవహారం వున్నది. ఈ 'గుండం' అనే శబ్దానికి సంస్కృతంలోని 'కుండం' మాతృక. కుండం అంటే గుడిలోని గుంట అనీ, నిప్పుల గుండం అనీ, వంటకుండ అనీ, తూనిక గుండు అనీ, కొండ అనీ శబ్దరత్నాకరం అర్థవివరణ చేసింది. ఈ అర్థాల్లోని గుడిలోని గుంట 'గుడి ముందర గుండాని'కీ, 'నిప్పుల గుండం', 'పీరీల గుండం' మొదలైన వాటికి సరిపోలుతున్నాయి. పైగా ఆ 'గుండము' వుండటం చేత కూడా ఆ పేరుతో వ్యవహృతం అయ్యే వీలు కూడా వుంది.

> **తెలంగాణలో 'పీరీలగుండం', 'గుడి ముందరి గుండం' అనే మాటల వ్యవహారం వున్నది. ఈ 'గుండం' అనే శబ్దానికి సంస్కృతంలోని 'కుండం' మాతృక. కుండం అంటే గుడిలోని గుంట అనీ, నిప్పల గుండం అనీ, వంటకుండ అనీ, తూనిక గుండు అనీ, కొండ అనీ శబ్దరత్నాకరం అర్థవివరణ చేసింది. ఈ అర్థాల్లోని గుడిలోని గుంట 'గుడి ముందర గుండాని'కీ, 'నిప్పల గుండం', 'పీరీల గుండం' మొదలైన వాటికి సరిపోలుతున్నాయి. పైగా ఆ 'గుండము' వుండటం చేత కూడా ఆ పేరుతో వ్యవహృతం అయ్యే వీలు కూడా వుంది.**

'కుటలం' అనే సంస్కృతం మాట తెలంగాణలో 'కుటిలం' అవుతుంది, కఠినం కటీనం అయినట్లు. ఇక 'కుతుకము' చూద్దాం. దీనికి 'అనుభవింపని కోరిక యందలి ఆశ, తమి అని అర్థాలు. ఇది తెలంగాణలో 'కుతి' అయ్యింది. పోతన సైతం 'దాన కుతక సాంద్ర దానవేంద్ర' అన్నాడు. సుట్ట కుతి, ఛాయకుతి, బీడి కుతి మొదలైనవి బహుళ ప్రచారంలో వున్నాయి. సంస్కృత భాషలోని ఒక నక్షత్రానికి 'కృత్తిక' అని పేరు. ఇది ప్రజల పలుకులో 'కత్తెర' అవుతుంది. కత్తెర కార్తె అంటారు. ఋత్వంతో కూడిన సంస్కృత పదాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారు. కృష్ణుడు, కృష్ణయ్యలు తెలుగులోనూ, హిందీలోనూ వరుసగా కన్నయ్య, కన్హయ్యలుగా మారలేదూ! ఈ మార్పులు చిత్రంగా వుంటాయి. కొన్ని సందర్భాల్లో కిష్టయ్య, కిట్టయ్యలు అవుతాయి. ప్రజలు తాము పలుకడానికి అనుకూలంగా పదాల్ని మార్చుకుంటారు. ఉచ్చారణ విధేయ పదాలూ వేసుకుంటారు.

'కైలాసం' సంస్కృత శబ్దం. శివుని నివాసం అక్కడే! అదే వెండి కొండ. కైలాస పర్వతం. తెలంగాణలో కైలాసం అంటే ఒక ఆట కూడాను. పరమపద సోపాన పటము. వైకుంఠపాళి అనే వాటిని తెలంగాణలో కైలాసం అంటారు. పాములు, నిచ్చెనలతో వున్న ఒక ఆట ఇది. శైవమత ప్రాబల్యం వున్న ప్రాంతం కనుక 'కైలాసం'అని వుంటారు. వైష్ణవులేమో వైకుంఠపాళి అని పిలిచి వుండాలి. 'వైకుంఠం' విష్ణునివాసం, ఇదీ సంస్కృతపదమే! తెలంగాణలో ఇది వైకుంటం అవుతుంది. 'కోపము' సంస్కృత పదం. ఈ కోపం కలిగిన వాణ్ణి 'కోపి' అంటారు. అదీ సంస్కృతమే! వ్యవహారంలో 'కోపిష్ఠి మనిషి' అని కూడా వుంది. 'ముక్కోపి' అనే వాడుకా వుంది. అయితే తెలంగాణలో 'కోపగొండి', 'కోపగొండోడు' 'కోపగొండి మనిషి' మొదలైన మాటలు బాగా ప్రచారంలో వున్నాయి. 'కోపగొండి'లోని 'కోప' సంస్కృతం. ఈ 'గొండి' తెలుగు. ఇది రేషగొండి (పౌరుషం కలవాడు) వంటిమాట! తెలంగాణ 'కోపగొండి'కీ, సంస్కృతం మాటలైన 'కోపానికీ', 'కోపి'కీ చుట్టరికం వుంది.

'ఏ పని చేసినా యాల్ల కమాన చెయ్యాలే'... వంటి వాక్యం తెలంగాణమే! కొందరు 'కమాన'కు బదులు 'కామన' అని కూడా అంటారు. 'ఆ.. ఇగ కామన పనిచేస్తే ముందర పడ్డట్లే' అంటారు. ఇక 'కమాన' ఏమిటి? అది 'క్రమాన' అనే పదం. దానికన్నా మునుపు 'క్రమమున'. ఈ 'క్రమము' సంస్కృతం. దీనికి వరుసగా, ఒక పద్ధతి ప్రకారం, వేళానుగుణ్యంగా అని అర్థచ్ఛాయలు.

'వానికి వీనికి శిడెం పడది. పొయ్యిల ఉప్పు పోసుకున్నట్లే చిట్కురం పట్కురం' అంటే వాడికీ వీడికీ క్షణం పడదు అని అర్థం. సంస్కృత 'క్షణం' తక్షణం తెలంగాణలో 'శిడెం' అవుతుంది. వ్రణం 'రడం' అవుతుంది. (ఉదా: ఈ రడం అంతా సీము పోసింది). ఋణం 'రుడం'గా మారుతుంది. పర్యంతం 'పడెం త్రం' అవుతుంది. రామాయణం రామండెం (ఏమో పెద్ద రామాండెం పెట్టినవేందిరా) సామాన్యం సామాండెం (వాని అండెం సామాండెంగా వుందా)గానూ మారిపోతాయి. కణం, వ్రణం, ఋణాదుల్లోని 'ణ' తెలంగాణలో 'డె', 'డ'లుగా మారుతున్నది. రామాయణం, సామాన్యాది పదాల్లోని 'ణ', 'న్య'లు సైతం 'డె'గా మారుతున్నాయి. పర్యంతంలోని 'ర్య' కూడా 'డె'గా పరిణమించింది. రామాండెం, సామాండెంలలోని 'డె'కు ముందరి నిండుసున్నా తెలంగాణ భాషా లక్షణానికి సంబంధించింది. అట్లా పూర్ణ అనుస్వరాలు రావడం ఈ భాషలో సహజ లక్షణంగా అమరింది.

'అబ్బో! వాడు బండమనిషి. శెమదర్మం లేని మనిషి' వంటి వాక్యాల్లోని శెమదర్మం సంస్కృతంలోని 'క్షమాధర్మం' నుంచి వచ్చింది. క్షమాభిక్ష, క్షమాపణల్లాంటిదే క్షమాధర్మం. కాకుంటే క్షమాపణ క్షమ ప్లస్ యాపన కావచ్చు. ఆ లెక్కన పైవన్నీ సమాసాలు. ఇంతకీ క్షమ అంటే ఏమిటి? ఓర్పు, ఓపిక, సహనము, ఓరిమి, తితిక్ష, క్షాంతి అని. క్షమాధర్మం అంటే క్షమించే గుణం. తెలంగాణ సన్నివేశానికి క్షమించే లక్షణంతో పాటు దయా స్వభావం సైతం అని అర్థం చేసుకోవాల్సి వుంటుంది. ఇక బండ (మనిషి) అంటే పాషండుడు, పాషాణ హృదయుడు అని.

'క్షయ' ఒక వ్యాధి. ఈ 'క్షయ' సంస్కృత 'క్షయం'లోంచి వచ్చింది. చంద్రుడూ క్షయించి క్షయించి అమావాస్యనాడు అదృశ్యమవుతాడు. 'క్షయం' అంటే నాశం కావడం, తగ్గిపోవడం క్రమంగా. ఈ 'క్షయ'ను తెలంగాణవాసులు చేరోగం అంటారు. రెండక్షరాల క్షయ 'చే' అనే లేదా 'శే' అనే ఒక అక్షరంగా క్షయించింది. ఆ రోగ లక్షణమే అంత! 'చే దగ్గు' అనే మాటా వుంది తెలంగాణలో.

'సౌరం చేయించుకొని రాపో' అనే వాక్యంలోని 'సౌరం' సంస్కృత 'క్షౌరం' నుంచి వచ్చింది. ఇట్లా పలుకరాని సంస్కృతంలోని శిలల్లాంటి గట్టి పదాలన్నీ తెలంగాణ ప్రజాబాహుళ్యంలో వాళ్ళ నాలుకల వులిదెబ్బలకు వుత్త పలుగురాళ్ళు అవుతాయి.


– డాక్టర్ నలిమెల భాస్కర్, 9704374081

స్వీకారం



జీవన సౌరంభం
(వ్యక్తిత్వ వికాస పర్యాలోచన)

రచన: డాక్టర్ డి.దుర్గయ్య, వెల: రూ.150
ప్రతులకు: నీల్‌కమల్ పబ్లికేషన్స్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్–95.



అస్పృశ్య కోయిల

రచన: డాక్టర్ కాలువ మల్లయ్య, వెల: రూ.190
ప్రతులకు: వి.రమేష్‌బాబు, 1–3–183/40/70/501, చంద్ర అపార్ట్‌మెంట్స్, స్ట్రీట్‌నెం–9, ఎస్‌బీఐ కాలనీ గాంధీనగర్, బాకారం, హైదరాబాద్–80



రెక్కసాచిన ఊహలు
(గేయసంపుటి)

రచన: డాక్టర్ వోలేటి పార్వతీశం, వెల: రూ.150, ప్రతులకు: వోలేటి లక్ష్మీప్రసూన, ఫ్లాట్ నెం: 502, బృందావన్ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం–16, గగన్‌మహల్, దోమలగూడ, హైదరాబాద్–29.



పైడి జైరాజ్

రచన: వారాల ఆనంద్, వెల: రూ.10, ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు, తెలుగు అకాడమీ.




సూర్యుడిని నెత్తికెత్తుకొని...

రచన: రావి రంగారావు, వెల: 100, ప్రతులకు: డాక్టర్ రావి రంగారావు, 101 శంఖచక్రనివాస్, అన్నపూర్ణనగర్, ఐదవ వీధి తూర్పు, గోరంట్ల, గుంటూరు–522034




చీకటిలో మలి వెలుగు
(మనో వైజ్ఞానిక నవల)

రచన: డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి, వెల: రూ.300, ప్రతులకు: డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి, 9/285, పొట్టిశ్రీరాములు స్ట్రీట్, సూళ్లూరుపేట–524121.



వదరుబోతు
(వందేళ్ల కానుక-1917)

సంపాదకత్వం: డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వెల:రూ.50, ప్రతులకు: వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం, తాల్లకాల్వ గ్రామం, గండ్లపెంట మండలం, అనంతపురం జిల్లా.



అగ్నిధార

రచన: డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య, వెల: రూ.60, ప్రతులకు: పున్న అంజయ్య, ఇంటి నెం–6–2–954/2, మీర్‌బాగ్ కాలనీ, హైదరాబాద్ రోడ్, నల్లగొండ–01.




నవ్వవా...
(ప్రణయోద్వైత భావకవిత)

రచన: డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి, వెల: రూ.150, ప్రతులకు: డాక్టర్ కనుపూరు శ్రీనివాసులురెడ్డి, 9/285, పొట్టిశ్రీరాములు స్ట్రీట్, సూళ్లూరుపేట–524121.




ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెప్పర్డ్
సామాజిక నేరస్తుడా?

రచన: రాధాకృష్ణ ఉప్పల, వెల: రూ.10, ప్రతులకు–రాధాకృష్ణ ఉప్పల, శ్రీహరివాసము, మోతీనగర్, హైదరాబాద్–18.



రాగమోహనం

రచన: కె.హరనాథ్, వెల: రూ.110, ప్రతులకు: అన్ని పుస్తక విక్రయకేంద్రాలు.



స్వీయ కథా మాలిక

రచన: మంజుశ్రీ
వెల:రూ. 125, ప్రతులకు: అన్ని పుస్తక విక్రయకేంద్రాలు.



మేఘం

ఎదురైనప్పుడల్లా
ఒంటరి సమూహంగానో
సమూహంలో సముద్రంగానో కనబడుతవు.
పాటలను వెంటేసుకొని
విత్తనాలవలె చల్లుకుంటూ సాగిపోతవు.
నీవెనక చాళ్ళల్ల మొలుకలు మొలుకలుగా
గొలుకెత్తుకుంటయి వరినార్లు.

కలిసి నాలుగడుగులేసినందుకే
పాటై గొంతువిప్పింది గాలి
కురిసిన చోటల్లా
దిరిసెనపూల వనమైంది నేల
అంటిపెట్టుకొని కదిలిన మాటలన్నీ
అంటుకట్టిన కొమ్మలే
రాళ్ళమీద రాలినా మోళ్ళమీద రాలినా
పచ్చగా నవ్వుడు నేర్చుకుంటయి
తాకిపోయిన చోటల్లా
మట్టి స్వరం సవరిచ్చుకుంటది.

నీది ఊటతడి మనసుతనం.
భళ్ళున కుమ్మరిచ్చి
కూనారిల్లిన వాగులకు
పారకాల పరువాన్నిచ్చే ప్రవాహగుణం
గ్రీష్మ తాపాలకోర్చి
పుక్కిట్ల సముద్రాలు నింపుకొని
తిరిగే నీ రాకడ

ఎదురుచూపులకు ఓ వానకార్తి.
అలుకు పూతల సంబరాల కోసం
మల్ల మల్ల పుట్టే మట్టిపాట.
బీటలువడ్డ నిస్పృహలను
చల్లగ తాకే జలస్పర్శ

– వఝుల శివకుమార్
94418 83210

అవనిపై హరితాక్షరాలు


ప్రకృతే కవిత్వానికి ప్రేరణ-2

పర్యావరణ అంశాలతో కూడిన కవిత్వం ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల సాహిత్యంలో వస్తున్నప్పటికీ, నిర్దిష్టంగా ఆ పేరుతో రాయడం మాత్రం 1980 దశకం నుంచే మొదలైందని చెప్పాలి. ఈ దశకంలో ప్రపంచంలో జరిగిన పర్యావరణ పరిణామాలు (చెర్నోబిల్ అణుప్రమాదం, ఓజోన్ పొర క్షీణత, గ్లోబల్‌వార్మింగ్ వంటివి) కవిత్వంలో, అందులోనూ ప్రకృతి కవిత్వంలో కొత్త 'genre' కు కారణమైంది. క్రమంగా ఇపుడు ప్రత్యేక కవితాప్రవాహంగా ఎదిగింది. అందుకే దీన్ని "Ecopoetry doesnot supplement nature poetry. But enla -rges it" అని సాహితీ విమర్శకులంటారు. ఈ మాటలకు Jay Ramsay & Carole Bruce రాసిన The white poem (1988), Heavy water: a poem for chernobyl వంటివి ఉదాహరణగా నిలుస్తాయి. తెలుగులో కూడా చెర్నోబిల్ ప్రమాద ఉదంతంపై ఎన్నో కవితలు వచ్చాయి. అయితే 'Ecopoetry' అనే పదం, దాని తాలూకు భావజాలం 2000 మిలీనియం సంవత్సరం తర్వాతే బాగా వాడుకలోకి వచ్చింది. దీనికి కారణమైన పుస్తకం Scott Brysom సంపాదకత్వంలో వచ్చిన Ecopoetry: A critical Introduction" (2002) కావడం గమనార్హం.

అప్పట్నించీ ఇంగ్లీష్‌లో విస్తృతంగా కవితాసంకలనాలు రావడం మొదలైంది. వాటిలో "The Thunder Mutters" (2005–Alica Oswald), Redstart: An Ecological Poetics, "Earth Shattering: Ecopoems" (2007–Neil Stley), The Ecopoetry: Anthology (Anne Fisher – Wirth 2013) వంటివి చెప్పుకోదగినవి.

పర్యావరణ కవిత్వం లక్షణాలు: ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషలలో రెండున్నర దశాబ్దాల కాలం నుంచి విస్తృతంగా వస్తున్న పర్యావరణ కవిత్వాన్ని పరిశీలించినప్పుడు, దానికి ఈ కింది లక్షణాలుంటాయని స్పష్టమవుతుంది.

పర్యావరణకు మేలుచేసే/కీడుచేసే అంశాలు ఈ కవితా వస్తువులు కవిత్వం ద్వారా పర్యావరణంపై అవగాహన కలిగించడం, దాని ఆవశ్యకతని ఎరుకపరచడం, పరిరక్షణకు జాగృత పరచడం, ప్రకృతి అనుగుణ్యమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం,అభివృద్ధి విధానాలు, నగరీకరణ, పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ వంటి అంశాలకు ప్రకృతికి మధ్య సమన్వయ ధోరణిని పెంపొందించడం. సుస్థిర సంతులనాభివృద్ధి దిశగా ప్రజలను చైతన్యపరుచడం, మనిషికి ప్రకృతికి మధ్య సంఘర్షణ స్థానంలో సహకార భావనని పాదుకొల్పడం.



> **పర్యావరణ కవిత్వం ఆవశ్యకతను కవులందరూ సృజనకారులందరూ గుర్తించిన పరిస్థితిని కల్పించింది. ప్రజలు, పాఠకులందరూ ఈ పర్యావరణ కవితల పొలంలోకి రావాలి. పద్యాల పూవులను, వాక్యాల పండ్లను తనివితీరా ఆస్వాదించాలి.**

తెలుగులో పర్యావరణ కవిత్వం: భారతీయ భాషలలోనూ, తెలుగులోనూ పర్యావరణ కవిత్వం ప్రచురితమైంది. కొన్ని సంకలనాలు కూడా వచ్చాయి. అవి Ec-opoetry లక్షణాలను ప్రతిబింబించి ఆలోచింపచేశాయి, అనుభూతి చెందేలా చేశాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో పర్యావరణ విపత్తులను, అందులోనూ కరువు, నీటికొరతవంటి దీర్ఘకాల సమస్యలను విశ్లేషించి, వాటికి విరుగుడుగా ప్రకృతిహితమైన నిర్మాణాత్మక కార్యాచరణను చేపట్టారు. అందుకోసం 'హరితహారం', వాన నీటి నిల్వల కోసం 'మిషన్ కాకతీయ' కార్యక్రమాలు వచ్చాయి.

చరిత్రలోనే మూడవ మహాప్రయత్నంగా భారీగా జరుగుతున్న 'హరితహారం' కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఒకవైపు జరుగుతుండగా, భాషా సాంస్కృతిక శాఖ 'హరితహారం' అంశంగా పర్యావరణ కవితా పోటీలను నిర్వహించింది. జనబాహుళ్యంలో చైతన్యాన్ని బాధ్యతను కలిగించింది. ఈ పోటీలకు రాష్ట్రం నలు మూలల నుంచి దాదాపు 728 పైగా కవితలు వచ్చాయి. వాటిలోంచి 171 మేలైన కవితలను ఎంపికచేసి 'ఆకుపచ్చని పొద్దు పొడుపు' పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించింది.

ఈ 171 కవితల సంకలనం తెలుగులోనేకాక భారతీయ భాషలలో కూడా 'పర్యావరణ కవిత్వం'లో అతిపెద్ద సంకలనంగా ప్రత్యేకతను సాధించింది. హరితహారం
'నేల అనే పేపర్‌పై
మొక్కలనే అక్షరాలతో
తెలంగాణ మనిషి రాస్తున్న కవిత్వం' గా కనిపించగా..

ఇక **'ఆకుపచ్చని పొద్దుపొడుపు'** పేజీల నేలపై అక్షరాల మొక్కలతో తెలంగాణ కవులు చేస్తున్న వ్యవసాయంగా నిలిచింది. పర్యావరణ కవిత్వం ఆవశ్యకతను కవులందరూ సృజనకారులందరూ గుర్తించిన పరిస్థితిని కల్పించింది. ప్రజలు, పాఠకులందరూ ఈ పర్యావరణ కవితల పొలంలోకి రావాలి. పద్యాల పూవులను, వాక్యాల పండ్లను తనివితీరా ఆస్వాదించాలి. ఆకుపచ్చని కవితను మనసులోకి ఒంపుకోవాలి! పర్యావరణ పరిరక్షణ కోసం కలాలకు పదునుపెట్టాలి. అందుకే పర్యావరణ కవిత్వం నేటి అవసరం! రేపటి తరానికి భరోసానిచ్చే ఓ వరం!!

– మామిడి హరికృష్ణ, 8008005231

ప్రకటనలు

రాష్ట్రస్థాయి కవితల పోటీలు

ఉగాది పర్వదినం సందర్భంగా వసుంధర విజ్ఞాన వికాస మండలి సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రస్థాయిలో కవితల పోటీలు నిర్వహిస్తున్నాం. తెలంగాణ పల్లె అంశంపై 20 లైన్లకు మించని వచన కవితలను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ ఐదు కవితలను ఎంపిక చేసి సమాన బహుమతులు అందజేస్తాం. కవిత తమ స్వంతమనే హామీ పత్రంతో పాటు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో జతచేసి ఏ4 పేపరుకు ఒకవైపు మాత్రమే రాసికానీ, డిటిపి చేసి కానీ పంపవచ్చు. విజేతలకు సంస్థ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో బహుమతులు అందజే స్తాం. కవితలు మార్చి 10 తేదీ లోపు మాకు అందేట్లు పంపాలి. **చిరునామా: కట్కూరి శంకర్, 11-2-495, హనుమాన్‌నగర్, 8 ఇంక్లయిన్‌కాలనీ, గోదావరిఖని- 505211, ఫోన్: 9182777409, 9989078568, 9849950188**

– మధుకర్ వైద్యుల, వ్యవస్థాపకులు,
సీహెచ్. వెంకటరెడ్డి,అధ్యక్షులు, కట్కూరి శంకర్,ఉపాధ్యక్షులు.

'దేవుడు తప్పిపోయాడు' ఆవిష్కరణ సభ

విల్సన్‌రావు కొమ్మవరపు కవితా సంకలనం 'దేవుడు తప్పిపోయాడు' ఆవిష్కరణ సభ 2018 ఫిబ్రవరి 22న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞానకేంద్రం,దొడ్డికొమురయ్య హాల్‌లో జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన జరుగు సభలో కొలకలూరి ఇనాక్, జి. లక్ష్మీనరసయ్య, ఎం. నారాయణశర్మ, కవి యాకూబ్, గుడిపాటి, వాహెద్ అతిథులుగా హాజరవుతారు. పుస్తకావిష్కరణ కె. శివారెడ్డి చేస్తారు.

– కవి సంగమం

శతకవి సమ్మేళనం

'సంకల్ప' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో మార్చి 6న శతకవి సమ్మేళనం నిర్వహించాలని తలపెట్టాం. తెలంగాణవ్యాప్తంగా ఉన్న కవులు తమ పేర్లు నమోదు చేసుకొని శతకవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాల్సిందిగా మనవి. వివరాలకు:9440988001

– వలస సుభాష్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పికాసో 'అదృశ్య చిత్రం' గుట్టు వీడింది



వాషింగ్టన్: ప్రముఖ చిత్రకారుడు పికాసో గీసిన ఓ పెయింటింగ్‌లో దాగి ఉన్న అదృశ్య చిత్రం గుట్టును శాస్త్రవేత్తలు విప్పారు. పికాసో 1902లో చెట్టుపక్కన ముడుచుకొని కూర్చున్న ఓ మహిళ చిత్రాన్ని గీశారు. ఈ పెయింటింగ్‌లో బయటికి కనిపించే చిత్రం వెనుక ఒక ప్రకృతి దృశ్యం దాగున్నదని శాస్త్రవేత్తలు గతంలోనే గుర్తించారు. పలు పరిశోధనలు చేసినా పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. తాజాగా అమెరికాకు చెందిన నార్త్‌వెస్టన్ యూనివర్సిటీ, నేషనల్ ఆర్ట్ గ్యాలరీ పరిశోధకుల బృందం ఎక్స్‌రే-రేడియోగ్రఫీ విధానంలో పరిశోధనలు జరిపి గుట్టువిప్పారు. వేరే చిత్రకారుడు వేసిన పెయింటింగ్‌ను పికాసో 90 డిగ్రీలు కుడిపక్కకు జరిపి తన చిత్రాన్ని గీశారని గుర్తించారు. మహిళ బొమ్మ ఉన్న రంగుల పొరకు, కింద ఉన్న దృశ్యానికి సంబంధించిన రంగుల పొరకు మధ్య స్పష్టమైన తేడాలు ఉన్నాయని పరిశోధక బృంద సభ్యుడు మార్క్ వాట్లన్ తెలిపారు. అంతేకాక పికాసో ఈ చిత్రాన్ని గీసేటప్పుడు పలు మార్పులు చేశాడని, దీంతో పెయింటింగ్‌పై పలు రంగు పొరలు కనిపిస్తున్నాయన్నారు. ఉదాహరణకు ముందుగా ఒక మహిళ కూర్చొని తన కుడి చేతిని ముడుచుకున్నట్టుగా గీశారని, ఆ తర్వాత ఆమెపై ముసుగు కప్పారని చెప్పారు. వెనుక ఉన్న చిత్రాన్ని ఎవరు గీశారో ఇప్పటికీ తేలలేదన్నారు. ఈ చిత్రపటం ప్రస్తుతం కెనడాలోని ఆర్ట్ గ్యాలరీ ఆఫ్ ఒంటారియోలో ఉన్నది.

మా ఓపికను పరీక్షించవద్దు

ఇరాన్‌కు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరిక



మునిచ్: ఇరాన్ దురాక్రమణలను సహించేది లేదని, వాటిని తిప్పికొడుతామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహు హెచ్చరించారు. మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ గగనతనంలో చక్కర్లు కొడుతున్న ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేశామని చెప్పారు. దానికి సంబంధించిన శకలాలను సమావేశంలో ప్రదర్శించారు. తమ ఓపికను పరీక్షించవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. 'ఈ నెల 10న ఇరాన్ డ్రోన్‌ను పేల్చేశాం. ఇంతటితో ఆగకుండా సిరియాలోని ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేపట్టాం' అని నెతన్యాహు తెలిపారు. ఈ దాడుల్లో ఇజ్రాయెల్‌కు చెందిన యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేసిందని, 1982 తర్వాత తమ దేశానికి చెందిన యుద్ధ విమానం పేల్చివేతకు గురికావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సిరియాలో తాము దాడులు చేపట్టామని ఇజ్రాయెల్ ప్రకటించడం ఇదే తొలిసారి.

టాయిలెట్‌ను చేతులతో శుభ్రం చేసిన ఎంపీ

- మధ్యప్రదేశ్ స్కూళ్లో సమస్యను స్వయంగా పరిష్కరించిన జనార్దన్ మిశ్రా



స్కూల్‌లో టాయిలెట్‌ను శుభ్రం చేస్తున్న ఎంపీ జనార్దన్ మిశ్రా

రెవా (మధ్యప్రదేశ్): చిన్న మొక్క నాటినా పెద్దఎత్తున ప్రచారం చేసుకునే నేతలున్న ప్రస్తుత సమాజంలో... మనల్ని ఎన్నుకుంది మాటలు చెప్పడానికి కాదు అని చేతల్లో చూపించాడో ఎంపీ. ప్రభుత్వ స్కూల్‌లో టాయిలెట్ సమస్యను తెల్సుకున్న సదరు ఎంపీ.. కింది ఉద్యోగులను పురమాయించకుండా తన చేతులకే పని చెప్పి ఔరా అనిపించుకున్నారు. ఆయనే మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపీ ఎంపీ జనార్దన్ మిశ్రా. రెవా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేయడానికి వెళ్లగా చెత్తతో నిండిపోయిన టాయిలెట్ విషయాన్ని విద్యార్థులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. చేతులకు గ్లౌజ్ వాడకుండానే టాయిలెట్‌లోని మట్టి, ఇతర వ్యర్థాలను చకచకా తీసేశారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడటం కన్నా మన స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యకు మనమే దారి చూపొచ్చని ఆచరణలో చేసి చూపారు ఎంపీ జనార్దన్ మిశ్రా. మరో పాఠశాలలో చిన్నారుల వేళ్ల గోళ్లు కత్తిరించి పరిశుభ్రత గురించి విద్యార్థులకు బోధించారు. నయీ గరీలోని ఓ స్కూల్‌లో విద్యార్థులు స్నానం చేసి స్కూల్‌కు రావడం లేదని గ్రహించిన ఈ ఎంపీ... వారికి తలస్నానం చేయించారు. తర్వాత అదే ప్రాంతంలోని రెవానగర్‌లో రోడ్లపై చెత్తను ఊడుస్తూ కనిపించారు. ఇప్పుడీ వీడియోలన్నీ ఇంటెర్నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత ఇష్టమైన స్వచ్ఛభారత్ అభియాన్‌ను సాకారం చేసే దిశగా తనవంతు కృషి చేస్తున్నానని ఎంపీ జనార్ధన్ మిశ్రా చెప్పారు.

రజినీకాంత్‌తో కమల్‌హాసన్ భేటీ

- ఇద్దరు స్టార్లు చేతులు కలుపబోతున్నారంటూ ప్రచారం
- తన రాష్ట్ర పర్యటన గురించి వివరించేందుకు వచ్చానన్న కమల్
- పొత్తు కష్టమేనని పరోక్ష సంకేతాలిచ్చిన రజినీకాంత్



చెన్నై, ఫిబ్రవరి 18: తమిళనాడు రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకున్నది. మరికొన్ని రోజుల్లో సొంత పార్టీని ప్రకటించబోతున్న విశ్వనటుడు కమల్‌హాసన్ ఆదివారం సూపర్‌స్టార్ రజినీకాంత్‌ను, డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని కలిశారు. చెన్నై పోయెస్‌గార్డెన్‌లోని రజినీ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. తాను రాజకీయాల్లోకి వస్తానని, సొంతపార్టీ పెడుతానని రజినీకాంత్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరిద్దరి కలయిక ఆసక్తిని రేపుతున్నది. వచ్చే ఎన్నికల్లో ఇద్దరు స్టార్లు కలిసి పనిచేయబోతున్నారని జోరుగా ప్రచారం జరిగింది. అయితే పొత్తు వార్తలను ఇద్దరూ తోసిపుచ్చారు. భేటీ అనంతరం కమల్ మీడియాతో మాట్లాడారు. త్వరలో తాను స్థాపించబోయే పార్టీ గురించి, ఈ నెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న యాత్ర గురించి రజినీకాంత్‌కు వివరించానన్నారు. యాత్రలో భాగస్వామి కావాలని ఆహ్వానించానన్నారు. అయితే తాను రాలేనని రజినీ చెప్పారని, యాత్ర నేపథ్యంలో శుభాభినందనలు తెలిపారన్నారు. ఇద్దరి పార్టీల మధ్య పొత్తు కుదురబోతున్నదా అన్న ప్రశ్నకు కాలమే సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు. రజినీకాంత్ సైతం కమల్ ఆహ్వానాన్ని ధ్రువీకరించారు. 'కమల్ డబ్బు కోసం రాజకీయాల్లోకి రావడం లేదు. రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకే వస్తున్నారు. ఆయన విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. పొత్తు గురించి ప్రస్తావించగా తన స్టైల్‌కు, కమల్‌కు మధ్య సినిమాల్లో కూడా వ్యత్యాసం ఉన్నదని పరోక్షంగా పొత్తు కష్టమేనన్న సంకేతాలు ఇచ్చారు. అనంతరం కమల్ డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని కలుసుకున్నారు. ఆయన ఆశీర్వాదం పొందేందుకే వెళ్లానని తెలిపారు.



మావోయిస్టుల కాల్పుల్లో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న జవాన్లు

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల విధ్వంసం

రోడ్డు నిర్మాణ సంస్థ సూపర్‌వైజర్ దారుణహత్య ■ పోలీసులతో హోరాహోరీ ఎన్‌కౌంటర్

ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లతోపాటు ఐదుగురి మృతి ■ పది మంది జవాన్లకు గాయాలు ■ ఐదు గంటలకు పైగా ఎదురు కాల్పులు

హైదరాబాద్/ కొత్తగూడెం క్రైం, నమస్తే తెలంగాణ:

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పరిధిలో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకోవడంతోపాటు అడ్డువచ్చిన సూపర్‌వైజర్‌ను అతి కిరాతకంగా చంపేశారు. అక్కడ ఉన్న ఒక జేసీబీ, మరొక ట్రాక్టర్ తోపాటు 12 వాహనాలకు నిప్పు పెట్టారు. నక్సల్స్‌ను అడ్డుకునేందుకు అక్కడకు పోలీసులు రావడంతో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు, ఇద్దరు పౌరులు, ఒక మావోయిస్టు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుక్మా జిల్లా బెజ్జి - చింతగుఫా మార్గంలో సీఆర్పీఎఫ్ కోబ్రా బలగాల భద్రత మధ్య రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను అడ్డుకునేందుకు బెజ్జి వద్దకు మధ్యాహ్నం 11 గంటల సమయంలో చేరుకున్న మావోయిస్టులు, సూపర్‌వైజర్‌ను చంపేసి విధ్వంసానికి పాల్పడి అడవిలోకి వెళుతుండగా సీఆర్పీఎఫ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం ఎదురైంది. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇరు పక్షాల మధ్య హోరాహోరీ ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో పది మంది జవాన్లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ఎయిర్ అంబులెన్స్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించినట్లు నక్సల్స్ వ్యతిరేక విభాగం స్పెషల్ డీజీ డీఎం అవస్థి తెలిపారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. గాయపడిన వారిలో సోరి భూషా రెండు కాళ్లకు.. రాకేశ్ రెండు చేతులకు, ఎస్. రాజా కాలుకు, చేతికి, పాదం సక్‌కు భూజాల్లో, శివరాంకు కడుపులో, ఆర్ పాయంకు వెన్నులో బుల్లెట్ గాయాలయ్యాయి. మృతి చెందిన జవాన్లు మడకం హంద, ముఖేశ్ కడ్తిగా గుర్తించారు. 20 మందికి పైగా మావోయిస్టులు గాయపడ్డారని తెలుస్తున్నది. ఎన్‌కౌంటర్‌లో సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించడం పట్ల ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా మావోయిస్టులు చింతగుఫా రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకునేందుకు భారీగా వచ్చి జరిపిన కాల్పుల్లో సుమారు 25మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు అలర్ట్ ప్రకటించారు. సరిహద్దుల్లోని ఆరు సీఆర్పీఎఫ్, ఇతర పోలీసు బలగాల క్యాంపులను అప్రమత్తం చేశారు. భద్రాద్రి - కొత్తగూడెం జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించకుండా అన్ని చర్యలు తీసుకున్నామని భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

భూటాన్‌లో ఉన్నతాధికారుల పర్యటన

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ముగ్గురు ప్రముఖ వ్యక్తులు ఈనెలారంభంలో భూటాన్‌లో పర్యటించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్, విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌లు భూటాన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి డోక్లాం సహా పలు అంశాలపై అక్కడి అధికారులు, నాయకులతో చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య రక్షణ భద్రత వ్యవహారాల్లో సహకారంపై వీరు చర్చించినట్లు సమాచారం. డోక్లాం ఘటన అనంతరం భారత్‌కు చెందిన ముగ్గురు ప్రముఖులు భూటాన్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పౌరుడిని చితకబాదిన ఎమ్మెల్యే కుమారుడు

ఆరేండ్లు సస్పెండ్ చేసిన కర్ణాటక కాంగ్రెస్

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార కాంగ్రెస్‌ను విమర్శించడానికి ప్రతిపక్షాలకు మరో అస్త్రం దొరికింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే హరి కుమారుడు నలపాడ్, అతడి స్నేహితులు కలిసి ఓ వ్యక్తిని చితకబాదారు. ఈ సంఘటన శనివారం రాత్రి బెంగళూరులోని ఓ రెస్టారెంట్‌లో జరిగింది. రెస్టారెంట్‌లో భోజనం చేయడానికి వచ్చిన విద్వత్ అనే వ్యక్తిని నలపాడ్, అతడి స్నేహితులు చితకబాదారు. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో అధికార కాంగ్రెస్ వెంటనే స్పందించింది. కాంగ్రెస్ నాయకుడు కూడా అయిన నలపాడును ఆరేండ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడంపై సీఎం సిద్ధరామయ్య స్పందించారు. చట్టం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చెప్పారు.



తాజ్‌మహల్ వద్ద భార్యాబిడ్డలతో కెనడా ప్రధాని ట్రూడో

తాజ్ సందర్శించిన కెనడా ప్రధాని

న్యూఢిల్లీ: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన భార్యా పిల్లలతో కలిసి ఆదివారం ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించారు. భారత పర్యటన తనకెంతో ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. తాజ్‌మహల్‌ను సందర్శించిన తర్వాత ఆయన మాట్లాడుతూ 'ఒక తండ్రిగా నేను నా పిల్లలతో కలిసి పర్యటనను ఎంజాయ్ చేసే అవకాశం రావడం నిజంగా చాలా బాగుంది' అని అన్నారు. సోమవారం ఆయన ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని, అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శిస్తారు. అహ్మదాబాద్‌లోని ఐఐఎం లో 'విద్య, పెట్టుబడి అవకాశాలు' అనే అంశంపై విద్యార్థులతో జరిగే ఇష్టాగోష్టి చర్చలో పాల్గొంటారు.

మేఘాలయలో తీవ్రవాదుల దాడి ఎన్సీపీ అభ్యర్థి మృతి

షిల్లాంగ్: మేఘాలయలోని ఈస్ట్ గారో హిల్స్ జిల్లా పరిధిలో ఆదివారం తీవ్రవాదులు జరిపిన దాడిలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అభ్యర్థి జొనాథాన్ ఎన్ సంగ్మా సహా ముగ్గురు మరణించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని రాత్రి ఎనిమిది గంటల సమయంలో వెళుతుండగా తీవ్రవాదులు మందుపాతర పేల్చారు. జొనాథాన్ ఎన్ సంగ్మా మృతి పట్ల మేఘాలయ సీఎం ముకుల్ సంగ్మా తీవ్ర సంతాపం తెలిపారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనున్నది.

యజమాని భార్యతో పారిపోయాడని.. డ్రైవర్ కండ్లలో యాసిడ్ పోశారు

బెగుసరాయ్: బీహార్‌లోని బెగుసరాయ్ జిల్లాలో శనివారం యజమాని భార్యతో పారిపోయిన ట్రాక్టర్ డ్రైవర్‌ను కొందరు చితకబాదారు. అతడి కండ్లలో యాసిడ్ పోయడంతో చూపు కోల్పోయాడు. సమస్తిపూర్ జిల్లా వాసి (30) బరౌని గ్రామ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు, యజమాని భార్య ఈ నెల ఆరో తేదీన పారిపోయారు. తన భార్య కిడ్నాపైందని తెఘ్రా పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ యజమాని ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న ఆమె స్థానిక కోర్టులో హాజరై తనను తీసుకెళ్లాలని భర్తను కోరింది. తర్వాత ఆమె మరిది డ్రైవర్‌కు ఫోన్‌చేసి ఆ మహిళ మీ తోనే ఉండాలనుకుంటున్నదని, తెఘ్రా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలన్నాడు. డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌కు వస్తుండగా మధ్యలో సుమారు 20 మంది అతడిని కొట్టి కండ్లలో ఇంజెక్షన్ తో యాసిడ్ పోసి హనుమాన్ చౌక్ వద్ద వదిలేసి వెళ్లారు. అటువైపుగా వెళ్తున్న కొందరు చూసి బాధితుడిని దవాఖానలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు అతడు కంటి చూపు కోల్పోయాడని చెప్పారు.

డబ్బు కంటే నూతన ఆవిష్కరణలే గొప్ప

- పీజీడీఏవీ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్రపతి
- భారతీయ విలువలు, విజ్ఞానం, సాంకేతికతలతోనే అభివృద్ధి
- 21వ శతాబ్దాన్ని 'విజ్ఞాన ఆర్థికవ్యవస్థ'గా పేర్కొన్న రామ్‌నాథ్



యూనివర్సిటీ అధికారుల నుంచి మెమెంటో అందుకుంటున్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ: ప్రస్తుత 21వ శతాబ్ద కాలాన్ని 'విజ్ఞాన ఆర్థికవ్యవస్థ'గా భారత రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ పేర్కొన్నారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు డబ్బు కంటే గొప్పవని అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఢిల్లీ విశ్వవిద్యాలయ పీజీడీఏవీ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. భారతీయ విలువలు, ఆధునిక విజ్ఞానం, సాంకేతికతల సంగమం వల్లే మానవ సమాజపు సుస్థిరమైన అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ-కామర్స్, రవాణా, పర్యాటకంలో యువత విజయం సాధిస్తున్నదని అన్నారు. మూలధన పెట్టుబడుల కంటే ప్రతిభ, చతురతలే వారి విజయానికి కారణమని పేర్కొన్నారు. ఉపాధి అనే పదానికి నిర్వచనం రోజురోజుకీ మారుతూవస్తున్నదన్నారు. ఎవరికివారు తమకు సౌఖ్యమైన స్వయం ఉపాధిని కల్పించుకునే అవకాశాలు వచ్చాయని చెప్పారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త స్వామీ దయానంద సరస్వతిని రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. దయానంద సరస్వతి బోధనలను వ్యాపింపజేయాలన్న ఉద్దేశ్యంతో విద్యావేత్త లాలా హన్స్‌రాజ్ 'దయానంద్ ఆంగ్లో వేదిక్ (డీఏవీ) స్కూల్'ను 130 ఏండ్ల క్రితం స్థాపించారని చెప్పారు. డీఏవీ విద్యాసంస్థల్లో అందిస్తున్న బోధనల తీరును ఆయన కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజపేయి తన ఎంఏను కాన్పూర్‌లోని డీఏవీ పాఠశాలలోనే పూర్తి చేశారని చెప్పారు. తాను కూడా బీకామ్, ఎల్‌ఎల్‌బీని అక్కడే పూర్తి చేసినట్లు రాష్ట్రపతి తెలిపారు. 19వ శతాబ్దంలో స్థాపించిన డీఏవీ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించిన తాము.. ప్రస్తుతం 21వ శతాబ్దంలో ఉన్నత స్థాయిలో ఉన్నామని ఆయన అన్నారు.

ఆధునిక హంగులతో బీజేపీ కొత్త కార్యాలయం

- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- హాజరైన అద్వానీ, పండిట్ రవిశంకర్ ప్రసాద్



ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో కొత్తగా నిర్మించిన బీజేపీ కార్యాలయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: భారతీయ జనతా పార్టీ కొత్త కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకుంది. అత్యాధునిక హంగులతో నిర్మించిన పలు అంతస్థుల పార్టీ జాతీయ కార్యాలయ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో నిర్మించిన బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా, అద్వానీ సహ పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. పండిట్ రవిశంకర్ ప్రసాద్ ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చారు.

ప్రజాస్వామ్యమే బీజేపీకి బలం: నరేంద్ర మోదీ

బీజేపీ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన తర్వాత పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. బీజేపీ కణకణంలో ప్రజాస్వామ్యం ఉందని, ప్రతీ విషయంలో ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడమే బీజేపీ శైలి అని చెప్పారు. పార్టీలో ఉన్న ప్రజాస్వామ్యం తనను ఆ దిశగా పనిచేసేందుకు, ఆలోచించేందుకు కార్యోన్ముఖుడి చేశాయని మోదీ తెలిపారు.

మాదే అతిపెద్ద కార్యాలయం: అమిత్‌షా

ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీ కార్యాలయం బీజేపీదేనని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తెలిపారు. జనసంఘ్ స్థాపన నాటి నుంచే కేంద్ర కార్యాలయం ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉందని, 14నెలల్లోనే దీనిని నిర్మించామని చెప్పారు.

జేఎన్‌పీటీ నాల్గో టెర్మినల్‌ను ప్రారంభించిన మోదీ

నవీ ముంబై: ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ(జేఎన్‌పీటీ) పోర్టులో నాల్గో టెర్మినల్‌ను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. దీంతో పోర్టు సామర్థ్యం ప్రస్తుతం ఉన్నదాని కన్నా 50శాతం పెరుగనుంది. అంతేగాక ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద పోర్టుల్లో 33వ స్థానంలో నిలిచింది. నాల్గో టెర్మినల్ మొదటి విడుత నిర్మాణానికి ప్రభుత్వం రూ.7,900 కోట్లు ఖర్చు చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో సింగపూర్ పోర్టు అథారిటీ కూడా పాలుపంచుకున్నది. రెండో విడుతను 2022నాటికి పూర్తి చేయనున్నారు. అనంతరం సబర్బన్ బాంద్రాలో మోదీ మాగ్నెటిక్ మహారాష్ట్ర గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్‌ను ప్రారంభించారు.

త్రిపుర ఎన్నికల్లో 76 శాతం పోలింగ్

మార్చి మూడోతేదీన కౌంటింగ్, ఫలితాల వెల్లడి



రాంనగర్‌లో ఓటు వేస్తున్న సీఎం మాణిక్ సర్కార్

న్యూఢిల్లీ/ అగర్తల, ఫిబ్రవరి 18: త్రిపుర అసెంబ్లీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో 76 శాతం పోలింగ్ నమోదైంది. 25.73 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే 2013 ఎన్నికలతో పోలిస్తే ఇది 15 శాతం తక్కువ. గత అసెంబ్లీ ఎన్నికల్లో 91.82 శాతం ఓటింగ్ నమోదైంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 84.32 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆదివారం 59 స్థానాల్లో పోలింగ్ జరిగింది. చారిలాంలో సీపీఎం అభ్యర్థి గత వారం మృతి చెందడంతో ఈ నియోజకవర్గంలో మార్చి 12న పోలింగ్ జరుగుతుంది. రాంనగర్‌లో సీఎం మాణిక్ సర్కార్, ఆర్కేపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లాబ్ దేవ్, కైలాషహర్‌లో త్రిపుర పీసీసీ అధ్యక్షుడు బిరాజిత్ సిన్హా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో రెండు నాటు బాంబులు బయటపడ్డాయని, వాటిని భద్రతా సిబ్బంది నిర్వీర్యం చేశారని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ సుదీప్ జైన్ మీడియాకు చెప్పారు. ఈవీఎంలు సరిగ్గా అమర్చక కొన్నిచోట్ల పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి శ్రీరాం తరణికాంతి తెలిపారు. రాష్ట్ర శాంతిభద్రతల విభాగం ఐజీ కేవీ శ్రీజేష్ మాట్లాడుతూ ఒక్క హింసాత్మక ఘటన కూడా లేకుండా శాంతియుతంగా పోలింగ్ నిర్వహించామన్నారు. కాగా, 25 ఏండ్లుగా అధికారంలో ఉన్న లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఓడిస్తామంటున్న బీజేపీ 51 స్థానాల్లో పోటీ చేసింది. ఈ దఫా ఒంటరిగా బరిలో నిలిచిన కాంగ్రెస్ 59 స్థానాల్లో పోటీ చేస్తున్నది. గత ఎన్నికల్లో సీపీఎం 50 స్థానాల్లో కాంగ్రెస్ 10 చోట్ల విజయం సాధించాయి. బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.

పెండ్లింట పేలిన సిలిండర్

19 మంది దుర్మరణం, మరో 10మందికి గాయాలు ■ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఘటన



శిథిలాలనుంచి మృతదేహాలను తీసుకొస్తున్న సహాయ సిబ్బంది

జైపూర్: రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ జిల్లా బీవర్‌లోని ఒక పెండ్లి ఇంట్లో పెనువిషాదం జరిగింది. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో 19 మంది దుర్మరణం చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. బీవర్‌లోని కుమావత్ సమాజ్ భవన్‌లో శుక్రవారం రాత్రి సురేంద్రకుమార్ అనే వ్యక్తి కుమారుడి పెండ్లి వేడుక ఏర్పాట్ల సమయంలో ఈ ఘటన జరిగింది. పేలుడుతో రెండస్థుల భవనం పేకమేడలా కూలిపోయింది. ఒక సిలిండర్ నుంచి మరో సిలిండర్‌లోకి గ్యాస్ నింపుతుండగా పేలుడు జరిగిందని స్థానికులు తెలిపారు. భవన శిథిలాలను సహాయ సిబ్బంది తొలిగిస్తున్నారు. శిథిలాల కింద నుంచి 19 మృతదేహాలను వెలికితీశారు. మృతుల కుటుంబాలకు సీఎం వసుంధర రాజే సంతాపం తెలిపారు. వారికి రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పు న నష్ట పరిహారం ప్రకటించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

800 కోట్లు ఎగ్గొట్టిన రొటోమాక్ కొఠారీ

› మొదటిపేజీ తరువాయి...

బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.485 కోట్లు, తదుపరి అలహాబాద్ బ్యాంక్ నుంచి రూ.352 కోట్ల మేరకు విక్రం కొఠారీ రుణాలు తీసుకున్నారని ఆ వర్గాల కథనం. ఆ తర్వాత తాను తీసుకున్న రుణంపై వాయిదాలు గానీ, వడ్డీగానీ కొఠారీ చెల్లించడం లేదని ఆయా బ్యాంకుల అధికారులు చెబుతున్నారు. కాన్పూర్ సిటీ సెంటర్ రోడ్డులోని కొఠారీ ఆఫీసుకు వారం రోజులుగా తాళం వేసి ఉన్నది. అప్పటి నుంచి కొఠారీ ఆచూకీ కూడా తెలియడం లేదు. దీనిపై అలహబాద్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్ గుప్తా స్పందిస్తూ.. కొఠారీ ఆస్తులను విక్రయించడం ద్వారా తమ రుణాలు రికవరీ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇరాన్‌లో విషాదం

› మొదటిపేజీ తరువాయి...



విమానాశ్రయం వద్ద రోదిస్తున్న ప్రయాణికుల బంధువులు

అనుమానిస్తున్నారు. ఏస్మ్యాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏటీఆర్-72 రెండు ఇంజిన్ల విమానం ఆదివారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుంచి ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లోని యాసుజ్ పట్టణానికి బయలుదేరింది. టేక్ ఆఫ్ అయిన 45 నిమిషాల తర్వాత, రాడార్‌తో సంబంధాలు తెగిపోయి అదృశ్యమైందని ఎయిర్‌లైన్స్ ప్రజా సంబంధాల అధికారి మహమ్మద్ తబతబాయి తెలిపారు. ఈ సమయంలో విమానంలో 59 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో ఓ చిన్నారి కూడా ఉన్నది. మరో ఆరుగురు విమాన సిబ్బంది ఉన్నారని ఆయన చెప్పారు. 'తనిఖీలు చేపట్టగా.. జార్గోస్ పర్వతశ్రేణిలోని దేనా పర్వత సమీపంలో (సెమిరోమ్ నగరానికి 22 కిలోమీటర్ల దూరంలో) విమానం కూలిపోయిందని గుర్తించాం. దురదృష్టవశాత్తు విమానంలో ప్రయాణిస్తున్న అందరు మృతి చెందారు' అని తెలిపారు. కానీ, కొద్దిసేపటి తర్వాత ఆయన మళ్లీ మీడియాతో మాట్లాడుతూ.. 'విమానం కూలిన ప్రాంతానికి సహాయక బృందాలు ఇప్పటికీ చేరుకోలేకపోయాయి. ప్రయాణికులు ఎంతమంది చనిపోయారనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేము' అన్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో అత్యవసర బృందాలు సైతం అక్కడకు చేరుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. 'విమానం కూలిన ప్రదేశానికి ఐదు రక్షక, సహాయక బృందాలను పంపించాం. కానీ, మంచు, మంచు తుఫాన్ కారణంగా వారు ముందుకు సాగలేకపోతున్నారు' అని ఇరాన్ అత్యవసర సేవల విభాగం అధికారి జలాల్ తెలిపారు. మరికొన్ని బృందాలను రోడ్డు మార్గంలో పంపామని పేర్కొన్నారు. విమానం కూలిన ఘటనపై విచారణ చేపట్టి, సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ఆదేశించారు. ప్రమాదంలో మొత్తం 66 మంది మృతిచెందారని ఎయిర్‌లైన్స్ ముందుగా పేర్కొన్నా.. టికెట్ తీసుకున్న ఓ ప్రయాణికుడికి విమానం మిస్ కావడంతో ప్రాణాలను దక్కించుకున్నాడు. ఏస్మ్యాన్ ఎయిర్‌లైన్స్‌లో ప్రస్తుతం 36 విమానాలు నడుస్తుండగా, ఇందులో 1990లో వచ్చిన ఏటీఆర్-72 విమానాలు మూడు ఉన్నాయి. ప్రమాదానికి గురయిన విమానం 1993 నుంచి సేవలు అందిస్తున్నది. కొంతకాలంగా ఈ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక మీడియా పేర్కొన్నది.



ఆదివారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో సీఎం కే చంద్రశేఖర్‌రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి సర్పంచ్ భర్త బాలరాజు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ తుమ్మ కృష్ణ, గ్రామ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు భిక్షపతి, బాబు తదితరులు. చిత్రంలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ కూడా ఉన్నారు.

కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు

చేర్యాల, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి క్షేత్రం ఐదో ఆదివారం భక్తులతో నిండిపోయింది. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు మల్లన్నక్షేత్రానికి భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశ ఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లన్న సన్నిధిలో మంత్రి తలసాని

పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పాలనలో రాష్ట్రంలోని దేవాలయాలకు మహర్దశ పట్టిందన్నారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కృషితో మల్లన్న ఆలయంలో వసతులు మెరుగైనట్టు చెప్పారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మల్లన్న దర్శనానికి తరలివచ్చిన భక్తులు, (ఇన్‌సెట్) మల్లన్నను దర్శించుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యంతో నిందితులు, (ఇన్‌సెట్‌లో) ప్రధాన నిందితుడు సుదర్శన్

రేషన్ బియ్యం రీసైక్లింగ్

పౌరసరఫరాలశాఖ తిరస్కరించిన బియ్యానికి పాలిష్

మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయం, ఇతర రాష్ట్రాలకు తరలింపు

ఐదుగురు అరెస్ట్.. రూ.29.22 లక్షల సరుకు స్వాధీనం

గతంలో పీడీ యాక్ట్ విధించినా మారని ప్రధాన నిందితుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పౌరసరఫరాలశాఖ తిరస్కరించిన బియ్యాన్ని, రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ అధిక ధరకు విక్రయిస్తున్న ఓ రైస్‌మిల్లర్ భాగోతాన్ని రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు, పౌరసరఫరాలశాఖ అధికారులు ఆదివారం బయటపెట్టారు. పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ తెలిపిన వివరాల మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడికి చెందిన యెన్నిశెట్టి సుదర్శన్ హైదరాబాద్ ముషీరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మద్‌గూడ ప్రాంతంలో దత్తసాయి రైస్‌మిల్లును నిర్వహిస్తున్నాడు. అతడు ఏజెంట్లు, బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని శివారు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నాడు. వాటిని తన రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ప్రజలను మభ్య పెట్టేందుకు ఆకర్షణీయంగా ఉండే బ్యాగులను రూపొందించి వాటిలో రీసైక్లింగ్ బియ్యాన్ని ప్యాకింగ్ చేస్తున్నాడు. వాటినే నాణ్యమైన బియ్యంగా నమ్మిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నాడు. మిల్లులో జరుగుతున్న అక్రమ వ్యాపారంపై ఆదివారం రాచకొండ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌వోటీ బృందం మేడ్చల్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి దత్తసాయి రైస్‌మిల్లుపై దాడి చేశారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 676 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాలకు పంపేందుకు సిద్ధంగా ఉన్న లారీ, బొలెరో, ఆటోతోపాటు అందులో ఉన్న బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని రీసైకిల్ చేయడమే కాకుండా 2014-2015 సంవత్సరంలో పౌరసరఫరాల శాఖ అధికారులు తిరస్కరించిన నాణ్యత లేని బియ్యాన్ని కూడా సుదర్శన్ సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. అర్ధరాత్రి సమయాల్లో ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు నిందితులు ఒప్పుకున్నారు. మొత్తం రూ.29.22 లక్షలు విలువ చేసే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సుదర్శన్‌తోపాటు సయ్యద్ హనీఫ్ సైఫాన్, గంట కోటి, చోలా శివకృష్ణ, వార్ సు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం కీసర పోలీసులకు అప్పగించారు. ప్రధాన సూత్రధారి యెన్నిశెట్టి సుదర్శన్ గతంలోనూ బియ్యం అక్రమ దందా చేస్తూ దొరుకడంతో కీసర, బొమ్మలరామారం, ఘట్‌కేసర్, కుషాయిగూడ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అతడి దందాను అరికట్టేందుకు పోలీసులు గతంలో ఓసారి పీడీ యాక్ట్‌ను కూడా విధించారు. ఆ శిక్షను అనుభవించి వచ్చిన సుదర్శన్ తిరిగి తన బియ్యం స్మగ్లింగ్‌ను ప్రారంభించినట్టు ఎస్‌వోటీ పోలీసుల దర్యాప్తులో తేలింది.

విమానాశ్రయానికి రైళ్లు

విమానయానశాఖతో మెట్రో, ఎంఎంటీఎస్ సంప్రదింపులు • రెండో దశలో విస్తరించేందుకు సంస్థల కసరత్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం వరకు రైళ్లు నడిపేందుకు మెట్రోరైలు, ఎంఎంటీఎస్ సంస్థలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ రెండు సంస్థలు వేర్వేరుగా విమానయానశాఖతో చర్చలు ప్రారంభించాయి. మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టులో భాగంగా ఐటీ కారిడార్‌ను కలుపుతూ శంషాబాద్‌కు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమవుతున్నది. డీపీఆర్ సిద్ధమయ్యేలోగా అనుమతులు సంపాదించుకోవాలని భావిస్తున్నారు. ఈ విషయంపై ప్రాజెక్టును గత నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించినప్పుడు చర్చకు వచ్చినట్టు సమాచారం. దీనికి ఇప్పటికే సూత్రప్రాయంగా సానుకూల వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో హైదరాబాద్ మెట్రోరైలు అధికారులు ఇదే ప్రయత్నంలో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా కేంద్రాన్ని రెండో దశలో భాగంగా సంప్రదించాలని ఆదేశించారు. అదేవిధంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం వరకు విస్తరించాలని చూస్తున్నారు. దీనికోసం విమానయానశాఖతో చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని స్వయంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ ఇటీవల బడ్జెట్ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. మెట్రోరైలు విస్తరించినా తమ ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. విమానాశ్రయం వరకు లేన్ వేస్తే వచ్చే రక్షణ ఇబ్బందులపైనే కొలిక్కి రాలేదని, త్వరలో స్పష్టత వస్తుందన్నారు. అండర్‌గ్రౌండ్‌లో ఎంఎంటీఎస్‌ను తీసుకెళ్లేందుకే తాము ప్రయత్నిస్తున్నట్టు వివరించారు. దీనికి సంబంధించిన పనుల కోసం రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్)కు అప్పగించినట్టు కూడా వెల్లడించారు. ఇప్పటికే సర్వే పూర్తిచేసిన అధికారులు దీనిపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్టు తెలిసింది.



ప్రభుత్వ పథకాల ప్రచారానికి ప్రత్యేక రథం

సొంతగా తయారుచేయించిన టీఆర్‌ఎస్ నేత

సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆవిష్కరణ



ప్రచార రథంతో రామప్రతాప్ రాయ్ శ్రీవాత్సవ, తేజావత్ రమేశ్‌నాయక్

అంబర్‌పేట, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయి కాంప్లెక్స్ సమీపంలో నివాసముండే టీఆర్‌ఎస్ నాయకుడు, సీఎం కేసీఆర్ వీరాభిమాని అయిన రామప్రతాప్ రాయ్ శ్రీవాత్సవ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రచారానికి ప్రత్యేకంగా రథాన్ని తయారు చేయించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఇంటికీ ఆ పథకాలు చేరాలని, వాటి గురించి తెలియజెప్పాలనే ఉద్దేశంతో ఓ అంబాసిడర్ కారును కొనుగోలు చేసి దానికి గులాబీ రంగు వేయించి సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయించారు. వెనుక వైపున డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆ స్క్రీన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు వస్తుంటాయి. వాటి గురించి తెలియజేస్తుంటాయి. ఈ రథాన్ని సీఎం కేసీఆర్ జన్మదినం ఈ నెల 17వ తేదీన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం టీఆర్‌ఎస్ ఎస్టీసెల్ విభాగం నాయకుడు తేజావత్ రమేశ్‌నాయక్‌తో కలిసి రామప్రతాప్ రాయ్ శ్రీవాత్సవ తన మనసులోని మాటలను వెల్లడించారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనతోపాటు, అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారని కొనియాడారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, అర్హులందరికీ పింఛన్లు వంటి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు ఈ ప్రచార రథాన్ని తయారు చేయించానన్నారు. టీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇంచార్జి నేతృత్వంలో గడప గడపకు ఈ ప్రచార రథం ద్వారా ప్రచారం చేస్తానని చెప్పారు. హైదరాబాద్ మొత్తం తిరుగుతానని, వచ్చే ఎన్నికల వరకు తన ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా టీఆర్‌ఎస్ గెలుపుకోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. తేజావత్ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ రామప్రతాప్ రాయ్ శ్రీవాత్సవ తయారు చేయించిన ఈ రథం ద్వారా గ్రేటర్ మొత్తం ప్రచారం చేస్తామన్నారు.



వనస్థలిపురం వైదేహీనగర్‌లో రోడ్డు పక్కన ఉన్న మల్లయ్య

10 మంది బిడ్డలున్నా.. ఈ తండ్రి అనాథే!

24 గంటలపాటు దీనంగా రోడ్డుపక్కన 96 ఏండ్ల వృద్ధుడు • నమస్తే తెలంగాణ చొరవతో కొడుకుల చెంతకు

వనస్థలిపురం: పది మంది సంతానాన్ని పెంచి పోషించాడు.. ఐదుగురు బిడ్డలకు పెండ్లి చేశాడు. అందరికీ మంచీచెడుల్లో అండగా నిలిచాడు. జీవితాన్ని కాచి వడబోశాడు.. కానీ 96 ఏండ్ల వయసులో నిస్సహాయ స్థితిలో రోడ్డున పడ్డాడు. కొడుకుల మధ్య జరిగిన చిన్న పొరపాటు ఆయనను వీధిపాలు చేసింది. అందరూ అయ్యో అన్నవాళ్లేకానీ ఇంటికి చేర్చే ప్రయత్నం చేయలేదు. దీంతో నమస్తే తెలంగాణ దినపత్రిక బృందం రంగంలోకి దిగి కాలనీవాసుల సహకారంతో ఆ వృద్ధుడిని కొడుకుల చెంతకు చేర్చింది. ఈ ఘటన హైదరాబాద్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహీనగర్‌లో ఆదివారం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్‌కు చెందిన ఆర్తం మల్లయ్యకు ఐదుగురు కొడుకులు, ఐదుగురు కుమార్తెలు. ఒక కొడుకు చిన్నప్పుడే వదిలి వెళ్లిపోగా, మిగతా నలుగురు కొడుకులు హైదరాబాద్‌లోనే నివసిస్తున్నారు. పెద్ద కొడుకు గణేశ్ వనస్థలిపురంలో, రెండో కొడుకు శ్రీను చంపాపేట్ గ్రీన్‌పార్క్ కాలనీలో, మూడో కొడుకు చంద్రశేఖర్ నాగోల్‌లో ఉంటున్నారు. చిన్నకొడుకు విశ్వనాథంకు మతిస్థితిమితం లేకపోవడంతో మల్లయ్యతోనే ఉంటున్నాడు. మల్లయ్య బాధ్యత తీసుకునేవారే విశ్వనాథంను పోషించాల్సిన పరిస్థితి. మల్లయ్య భార్య పదేండ్ల కిందట కన్నుమూసింది. మల్లయ్య ఏడాది కాలంగా మూడో కొడుకు చంద్రశేఖర్ వద్ద ఉంటున్నాడు. అతడి పోషణకు కావాల్సిన డబ్బును గణేశ్, శ్రీను ఇస్తుండేవారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లయ్యకు మల, మూత్ర విసర్జన సమస్య తీవ్రంగా ఉన్నది. దీంతో చంద్రశేఖర్ నివాసం ఉండే ఇంటి యజమాని మల్లయ్యను తమ ఇంట్లో ఉంచొద్దని తేల్చిచెప్పింది. దీంతో చంద్రశేఖర్ శనివారం మధ్యాహ్నం తండ్రిని ఆటోలో ఎక్కించుకొని అక్క దగ్గరికి వెళ్లాడు. వారు మల్లయ్యను ఉంచుకునేందుకు అంగీకరించకపోవడంతో వనస్థలిపురం వైదేహీనగర్‌లో ఉంటున్న పెద్ద కొడుకు గణేశ్ ఇంటికి వెళ్లాడు. గణేశ్ గుండెపోటుతో బాధపడుతూ దవాఖానలో చేరడంతో అందరూ గేటుకు తాళం వేసి వెళ్లారు. చంద్రశేఖర్‌కు ఏం చేయాలో పాలుపోక తన తండ్రిని గణేశ్ ఇంటి సమీపంలోని చెట్టుకింద పడుకోబెట్టి వెళ్లిపోయాడు. దీంతో మల్లయ్య రాత్రంతా రోడ్డుపై నానా అవస్థలు పడ్డాడు. ఆదివారం ఉదయం చుట్టుపక్కల వాళ్లు గమనించి ఆహారం, నీళ్లు అందించారు. కానీ కుమారులకు విషయాన్ని తెలియజేయలేదు.

నమస్తే తెలంగాణ బృందం చొరవతో..

ఆదివారం మధ్యాహ్నం రంగంలోకి దిగిన నమస్తే తెలంగాణ ప్రతినిధులు ముగ్గురు కొడుకులకు సమాచారం అందించారు. అందరినీ వనస్థలిపురం రప్పించారు. అనంతరం వారితో మాట్లాడి మల్లయ్యను గణేశ్ ఇంట్లోకి చేర్చారు. గతంలో ఇలా ఎప్పుడూ జరుగలేదని, ఇకపై కంటికి రెప్పలా కాపాడుకుంటామని వారు చెప్పారు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని, ఇకపై ఇబ్బంది కలుగనీయమన్నారు. రోజంతా రోడ్డుపై ఉండి అవస్థలు పడి.. కొడుకు ఇంట్లోకి వచ్చిన తర్వాత మల్లయ్య ముఖంలో ఆనందం కనిపించింది. ఆయన నమస్తే తెలంగాణ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. కాలనీవాసులు సైతం అభినందించారు.



ఇంట్లోకి చేరిన తర్వాత నలుగురు కొడుకులతో మల్లయ్య

నిజాం వారసుడు మృతి

- అనారోగ్యంతో ప్రిన్స్ ఫాజల్ ఝా బహదూర్ కన్నుమూత



హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఏడో నిజాం వారసుడు ప్రిన్స్ ఫాజల్ ఝా బహదూర్ (72) ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బహదూర్ 1946 ఫిబ్రవరి 29న జన్మించారు. ఏడో నిజాం స్థాపించిన మతపరమైన అనేక ట్రస్టులకు ఇంచార్జిగా ఉన్నారు. ఇందులో సౌదీఅరేబియాలోని హైదరాబాద్ రుబత్ కూడా ఉన్నది. హైదరాబాద్ కింగ్‌కోఠిలోని మజీద్-ఈ-జుడిలో ఆదివారం సాయంత్రం బహదూర్ అంత్యక్రియలు నిర్వహించారు.

తిరుమలగిరిలో బాలికపై లైగింకదాడి!

- డిసెంబర్‌లో ఘటన.. సోషల్‌మీడియాలో హల్‌చల్
- ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత నిందితులను అరెస్ట్ చేస్తామన్న పోలీసులు

బొల్లారం: జవాన్ కూతురిపై గుర్తుతెలియని వ్యక్తులు లైగింకదాడికి పాల్పడిన ఘటనలో నిందితులను పట్టుకోవడానికి హైదరాబాద్ నార్త్‌జోన్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. లైంగికదాడి వార్త ఆదివారం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. వెంటనే నార్త్‌జోన్ డీసీపీ సుమతి స్పందించారు. ఈ ఘటన రెండు నెలల కిందట జరిగిందని, అనుమానితులకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదిక అందాల్సి ఉన్నదన్నారు. తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు కథనం ప్రకారం. తిరుమలగిరి అమ్ముగూడకు చెందిన ఓ ఆర్మీ ఉద్యోగి కూతురు పదో తరగతి చదువుతున్నది. గత ఏడాది డిసెంబర్ 21న సాయంత్రం 6:45 గంటలకు ఆశా ఆఫీసర్స్‌కాలనీలో ఉంటున్న తన స్నేహితురాలిని కలిసి తిరిగి అమ్ముగూడ రైల్వేగేటు వద్ద నుంచి ఇంటికి వెళ్తున్నది. ఈ సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమెను కర్రతో కొట్టి, నోట్లో గుడ్డలు కుక్కి చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి లైగింకదాడికి పాల్పడ్డాడంటూ బాధితురాలి తండ్రి డిసెంబర్ 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అనుమానితులను విచారించారు. ఈ విచారణలో శాస్త్రీయమైన పలు ఆధారాలను సేకరించి వాటి నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఇందులో ఒక మైనర్ కూడా అనుమానితుడిగా ఉన్నట్టు తెలిసింది. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాతే నిందితుడు ఎవరో కచ్చితంగా తెలుస్తుందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, శాస్త్రీయ ఆధారాల కోసం ఎదురుచూస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.



పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ తదితరులు

సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి కల్పించండి

పౌరసరఫరాలశాఖ కమిషనర్‌ను కోరిన కారం రవీందర్‌రెడ్డి

అబిడ్స్, నమస్తే తెలంగాణ: పౌరసరఫరాలశాఖలో సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కోరారు. హైదరాబాద్‌లో కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి సన్మానించడంతోపాటు పదోన్నతుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తాము కోరిన పదోన్నతుల పట్ల సీవీ ఆనంద్ సానుకూలంగా స్పందించారని, త్వరలో సీనియర్ అసిస్టెంట్లు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతులు పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, విక్రమ్‌కుమార్, మాచన రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

లైవ్‌లో సూసైడ్!

వీడియో కాల్‌లో స్నేహితుడితో వాగ్వాదం.. కోపంతో ఉరేసుకొని ఆత్మహత్య

- కొంపల్లిలోని కాలేజీ హాస్టల్‌లో ఘటన

హైదరాబాద్ సిటీబ్యూరో/పేట్‌బషీరాబాద్, నమస్తే తెలంగాణ: పెండ్లికి వెళ్లే విషయంలో స్నేహితుడితో జరిగిన వాగ్వాదం కారణంగా మనస్థాపం చెందిన ఓ ఎంబీఏ విద్యార్థిని వీడియో కాల్ లైవ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన బుగ్గయ్య చౌదరి కుమార్తె హనీషా చౌదరి(23) నగర శివారు కొంపల్లిలోని శివశివాని కాలేజీలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నది. కాలేజీ క్యాంపస్ హాస్టల్‌లోని రూం నంబర్ 30 లో ఉంటున్నది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో హనీషా, ఆమె క్లాస్‌మేట్ మేడ్చల్‌కు చెందిన దాషీష్ పటేల్ ఫేసుబుక్ మెసెంజర్‌లో వీడియో కాల్ మాట్లాడుకున్నారు. మళ్లీ అర్ధరాత్రి 1.18 గంటల నుంచి 1.34 వరకు మాట్లాడుకున్నారు. ఆ సమయంలో హనీషా వీడియో కాల్‌ను అలాగే పెట్టి గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నది. ఈ పరిణామంతో షాక్‌కు గురైన దాషీష్ పటేల్ మేడ్చల్ నుంచి కొంపల్లిలోని కాలేజీ హాస్టల్‌కు చేరుకొని జరిగిన విషయాన్ని సిబ్బందికి చెప్పాడు. తలుపులు వేసి ఉండటంతో పగులగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న హనీషాను కిందికి దించారు. వెంటనే స్థానిక ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా హనీషా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. హనీషా తండ్రి బుగ్గయ్య చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండ్లికి వెళ్లే విషయంలో గొడవే కారణమా?

కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు దాషీష్ పటేల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. హనీషా చౌదరి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను, దాషీష్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. హనీషా చౌదరి, దాషీష్ పటేల్ మధ్య జరిగిన చాటింగ్‌లు, వీడియో కాల్స్, ఫోన్ సంభాషణాలు, సోషల్ మీడియాలోని వీరి పోస్టింగ్‌ల సమాచారాన్ని సేకరిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. హనీషా, దాషీష్ ప్రేమించుకుంటున్నట్టు తెలిసింది. కొన్నాళ్లుగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు వస్తున్నాయని సమాచారం. శనివారం రాత్రి ఇద్దరూ వీడియో కాల్‌లో మాట్లాడుకుంటుండగా అనంతపురం జిల్లాలో జరిగే ఓ పెండ్లికి గతంలో తనతో సన్నిహితంగా ఉన్న ఓ ఫ్రెండ్‌తో కలిసి వెళ్తున్నట్టు హనీషా చెప్పింది. తనకు ఏమీ అభ్యంతరం లేదని దాషీష్ చెప్పాడు. తాను ఫ్రెండ్‌తో కలిసి తప్పనిసరిగా పెండ్లికి వెళ్తానని హనీషా మరోసారి చెప్పడంతో, దాషీష్ నీ ఇష్టమని సమాధానం ఇచ్చాడు. దీంతో నువ్వు మనసులో ఏదో పెట్టుకున్నావ్.. నన్ను అనుమానిస్తున్నావ్ అంటూ దాషీష్‌తో గొడవపడింది. తనకు ఎలాంటి అనుమానం లేదని దాషీష్ చెప్పినా హనీషా వినకుండా చనిపోతానంటూ కోపంలో ఉరి వేసుకున్నదని సమాచారం. వారిద్దరి ఫోన్ సంభాషణాలను పరిశీలించినప్పుడు ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు మాత్రం అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



హనీషాచౌదరి మృతదేహం

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 19 ఫిబ్రవరి 2018
WWW.NTNEWS.COM



ప్యాడ్స్‌తో నిశ్శబ్దాన్ని ఛేదించిన

దీపాంజలి దాల్మియా

వ్యాపారంలో విజయం సాధించటం అంటే అంత సులువు కాదు. కానీ వినూత్న ఆలోచనలతో దూసుకుపోతే విజయం సాధించవచ్చని ఆమె నిరూపించారు. తనకున్న నైపుణ్యంతో మార్కెట్‌లో ఎలా రాణించాలో ఆకాళింపు చేసుకున్నారు. పురుషాధిక్య వ్యాపార సామ్రాజ్యంలోకి అడుగుపెడుతున్న క్రమంలోనే వ్యాపార మెలకువలను అలవర్చుకున్నారు. లక్షలు సంపాదించే ఉద్యోగం వదిలేసి వ్యాపారం చేస్తానంటే కుటుంబసభ్యులు ముక్కు మీద వేలేసుకున్నారు. తను సానిటరీ నాప్‌కిన్స్ తయారీ సంస్థ స్థాపిస్తానంటే అందరూ గుసగుసలు పెట్టుకున్నారు. పీరియడ్స్ గురించి చర్చించడమే తప్పుగా భావించేవారు చాటుగా నవ్వుకున్నారు. అయినా ఏ మాత్రం తడబడక ముందుకు సాగడమే కాక వ్యాపారంలో విజయం సాధించి స్ఫూర్తిగా నిలిచిన బిజినెస్ ఉమన్ దీపాంజలి దాల్మియా సక్సెస్‌మంత్ర.

సక్సెస్ మంత్ర

ఢిల్లీకి చెందిన దీపాంజలి దాల్మియా 2015 వరకు న్యూయార్క్‌లోని ఎర్నెస్ట్ అండ్ యంగ్ అనే సంస్థలో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా పనిచేస్తుండేది దీప. చదువుకుంటున్న సమయంలోనే మహిళా సాధికారత, హక్కుల పట్ల తనదైన దృక్పథంతో ఉండేది. దాంతో వారికోసం ఏదో ఒకటి చేయాలన్న ఆలోచనతో ఉండేది. అనుకున్నదే తడువుగా తన ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. అదికూడా మహిళల వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన సానిటరీ నాప్కిన్స్ తయారీ రంగంలోకి..

నాప్కిన్స్ అనగానే షాకయ్యారు..

దాల్మియా నాప్కిన్స్ తయారీ సంస్థ పెడుతానంటే ఇంట్లోవాళ్లు, స్నేహితులు షాకయ్యారు. లక్షల సంపాదన వచ్చే ఉద్యోగం వదిలేసి ఇలాంటి వ్యాపారం మొదలు పెట్టిందంటే చెప్పుకోవడానికి సిగ్గుపడాలి అంటూ ఎద్దేవా చేశారు. కానీ ఆమె వెనుకడుగు వేయలేదు. మహిళల ఆరోగ్యం గురించే ఆలోచించేది. ఆర్గానిక్ సానిటరీ నాప్కిన్స్ తయారు చేయాలనుకుంది దీపాంజలి. పీరియడ్స్ ఇప్పటికీ గుసగుసగా మాట్లాడుకోవాల్సిన అంశమే. అలాంటిది ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాలని ముందుకు సాగారు. చిన్నతనం నుంచి దీపా తన ఆలోచనలను తండ్రితో పంచుకునేది. ఆయనే ఆమెకు అన్నీ. అలాంటి తండ్రితో తన వ్యాపార ఆలోచనలను పంచుకున్నారు. పీరియడ్స్ గురించి తండ్రితో మాట్లాడడం వింతగా అనిపించినా విశాల దృక్పథం ఉన్న ఆయన అర్థం చేసుకున్నాడు. మహిళల సమస్యల పట్ల ఆమెకున్న ఆసక్తి, వారికోసం ఏదైనా చేయాలన్న తపన చూసి ఎంకరేజ్ చేశారు.

చదువు సంధ్యలు..

దీపాంజలి దాల్మియా ఢిల్లీలోని కార్మెల్ కాన్వెంట్లో స్కూలింగ్, న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసింది. మొదటి నుంచి మహిళ సాధికారత పట్ల తనదైన ఐడియాలజీతో ఉండేది. మహిళల స్వావలంబనకు తనేం చేయగలనన్న విషయంలో ఆమెకు స్పష్టత ఉండేది. అందుకే ఎకనామిక్స్, సైకాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే ఎఫ్ఎంసీజీ బిజినెస్‌లోకి ప్రవేశించింది. ఆ వ్యాపారంలో వచ్చిన సొమ్ముతో తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించిందామె.

సర్వేతో మొదలు..

సానిటరీ నాప్కిన్స్ తయారీ రంగంలోకి అడుగు పెట్టడానికి ముందు నీల్సన్ రీసెర్చ్ సెంటర్‌తో కలిసి ఓ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ప్రతి మహిళ తన జీవిత కాలంలో 11 నుంచి 17 వేల వరకు నాప్కిన్స్ ఉపయోగిస్తుందని అంచనా. చాలామంది మహిళలు సింథటిక్ నాప్కిన్స్ వాడడం వల్ల సున్నితమైన భాగాల వద్ద దద్దుర్లు వస్తుంటాయి. ఇలాంటి నాప్కిన్స్ తయారుచేయటం శ్రేయస్కరం కాదనే విషయం తేలింది. రెగ్యులర్ సానిటరీ నాప్కిన్స్‌ను తొంభై శాతం ప్లాస్టిక్ పాలీమర్స్‌తో తయారుచేస్తారు. యాంటీ బాక్టీరియల్ అంటూ రసాయనాలతో తయారుచేసిన ఫెర్ఫ్యూమ్స్ వాడుతారు. ఇవి మహిళల శరీరానికి ఎంతో హానికరం. సింథటిక్ నాప్కిన్స్ వాడడం వల్ల గర్భాశయ క్యాన్సర్ వంటి జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. అంటువ్యాధులూ వ్యాపిస్తాయి. బిడ్డలు లోపాలతో పుట్టే అవకాశాలు కూడా అధికమన్న విషయం తెలిసింది.



గొంతు విప్పాల్సిందే...

మహిళల వస్తువులే అయినా ఇప్పటికీ మహిళలు దుకాణానికి వెళ్లి నోరు విప్పి ప్యాడ్ కావాలని అడగలేని పరిస్థితి. ఇంట్లో మగవాళ్లకు చెప్పుకోలేని స్థితి. అయితే ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాలంటారు దీపాంజలి. తన హేడే ప్యాడ్స్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టే సమయంలోనూ ఇదే సమస్య ఎదురైందంటారామె. మార్కెటింగ్ చేసేవారు 'స్టోర్స్‌కు వెళ్లినపుడు మేడమ్ మేం ఎలా మాట్లాడాలి?' అని అడిగేవారట. దీంతో ఆమె 'గొంతు ఉంది. అది నలుగురికీ వినిపించడానికే. చాలామంది వినకపోవచ్చు. ఒక్కరైనా వింటారు. ఒక్కసారి ప్రొడక్ట్ మార్కెట్లోకి వెళ్లిన తరువాత మనం మాట్లాడాల్సిన అవసరం లేదు. అదే మాట్లాడుతుంది. మహిళలు కచ్చితంగా అదే కావాలనుకుంటారు. అప్పటిదాకా మనం వెళ్తూనే ఉండాలి, మాట్లాడుతూనే ఉండాలి' అని చెప్పారామె.



పర్యావరణ హితం కోసం..

కేవలం మహిళ ఆరోగ్యం విషయంగానే కాకుండా పర్యావరణ హితమైన నాప్కిన్స్ తయారు చేయాలన్నదే దీపాంజలి లక్ష్యం. ప్రతి ఏడాది మహిళలు తొమ్మిదివేల టన్నుల సానిటరీ నాప్కిన్స్ వృథా చేస్తున్నట్లు అంచనా. ఉపయోగించాక వాటిని డస్ట్‌బిన్‌లో వేసేస్తున్నారు. దానివల్ల పర్యావరణానికి, వాళ్ల శరీరానికి కూడా హాని కలుగుతున్నది. ఇంకొందరు కాటన్ ప్యాడ్స్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలోని రసాయనిక ఎరువుల్లో 26 శాతం కేవలం పత్తి మీదనే ఉపయోగిస్తున్నారు రైతులు. దీంతో కాటన్ ప్యాడ్స్‌ను ఉపయోగించినవాళ్లలోనూ హార్మోన్లలో అసమతుల్యత, సంతానం కలుగకపోవడం వంటివి జరుగుతున్నాయి. అందుకే ఆర్గానిక్ నాప్కిన్స్ వాడడం వల్ల విషపూరితమైన వ్యర్థాల నుంచి రక్షణ పొందవచ్చు.

విదేశాల్లో ఉత్పత్తి చేసి..

ఇదంతా అధ్యయనం చేసిన దాల్మియా హేడే బయోడిగ్రేడబుల్ అండ్ ఆర్గానిక్ సానిటరీ నాప్కిన్స్ కంపెనీని స్థాపించారు. పర్యావరణ హితమైన హేడేను రూపొందించారు. ఇవి పూర్తిగా ఆర్గానిక్ న్యాప్కిన్స్. దీనికోసం పాలీమర్స్ అధికంగా ఉండి.. గ్రాహకశక్తి ఎక్కువగా ఉన్న వెదురును ఎంచుకుంది. వెదురు సాగుకు రసాయనాల ప్రభావం లేని నేల కావాలి. భారతదేశంలో ఎక్కడా అది దొరుకలేదు. అందుకే చైనా, ఫిన్లాండ్‌లను వాటి సాగు కోసం ఎంచుకుంది. అక్కడి వారితో ఒప్పందాలు కుదుర్చుకుంది. చైనాలో ఉత్పత్తి అయిన దీనికి ఫిన్లాండ్‌లో మానిఫ్యాక్చర్ చేస్తారు. ఇండియాకు షిప్పింగ్ అయిన తరువాత ఫైనల్ ప్యాకింగ్ అయిపోతుంది. ఇవి డిస్పోజ్ చేసిన ఆరు నెలల్లోపే డీకంపోజ్ అయిపోతాయి.

త్వరలో దేశమంతటా..

ప్రస్తుతం ఈ నాప్కిన్స్ ఢిల్లీ, గుర్గావ్, నోయిడా తదితర ప్రాంతాల్లో లభిస్తున్నాయి. ఆర్గానిక్ కావడం వల్ల ధర ఎక్కువ ఉంటుందనే అపోహ చాలామందిలో ఉంటుంది. అయితే సాధారణ ప్యాడ్స్ ఖరీదులోనే వీటిని అందిస్తున్నారు. త్వరలోనే ఆన్‌లైన్‌తో పాటు, దేశ వ్యాప్తంగా ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నారు.


చెత్తతో కొత్తగా.. రైతులకు అండగా..



ఊటీలో ప్రారంభించనున్న ఈ ప్రాజెక్ట్ వ్యర్థాలను తగ్గించడమే కాదు.. చాలామంది రైతులకు అండగా నిలబడాలనుకున్నారు. మరికొద్ది రోజుల్లో నిర్మాణం కానున్న కంపోస్ట్ యార్డ్ నిర్మాణానికి కృషి చేసింది ఎవరో తెలుసా?

చెత్తతో కొత్తగానే కాకుండా రైతులకు అండ అవనున్న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నీలగిరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు దివ్య. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఖండాల్‌లో దీని నిర్మాణం జరుగుతున్నది. దీన్ని జిల్లా కలెక్టర్ దివ్య ప్రారంభించారు. ఊటీ పరిసర ప్రాంతాల్లోని రెస్టారెంట్లు, కాటేజ్‌లు, మార్కెట్‌లో సుమారు ఎనిమిది టన్నుల చెత్తను వేస్తున్నారు. ఇంత చెత్తను ఏదైనా మంచి కాజ్‌కు వాడితే ఒక కొత్త ఆవిష్కరణ చేయాలనుకున్నారు. ఆ ఆవిష్కరణ వల్ల పదిమందికీ మంచి చేయాలనుకున్నారు. అందుకే ఆర్గానిక్ వేస్ట్ యార్డ్ నిర్మించి దాని నుంచి సేంద్రీయ ఎరువు తయారు చేయనున్నారు. ఈ కార్యక్రమం వల్ల సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు రైతులకు అండగా నిలబడినట్టు ఉంటుందని భావించారు. భవిష్యత్తులో తక్కువ ధరకే ఈ సేంద్రీయ ఎరువును ఇవ్వనున్నారు. యార్డ్ ప్రారంభమయ్యాక రోజుకు సుమారు మూడు టన్నుల ఎరువు తయారు చేయనున్నారు. చెత్తతో కొత్తగా చేయాలనే ఐడియా ఎవరిదో కానీ అందుకు సహకరించిన కలెక్టర్ దివ్యను అక్కడి వాళ్లు అభినందిస్తున్నారు. పర్యావరణానికి హాని చేసే చెత్తతో ఎరువులు తయారు చేసే ఇలాంటి ప్రాజెక్టులు ఇంకా రావాలని ఆకాంక్షిస్తున్నారు.

పరుగుతో జ్ఞాపకం మెరుగు!



వ్యాయామంలో పరుగును తప్పనిసరిగా పెట్టుకోవడం వల్ల శారీరక.. మానసిక ప్రయోజనాలు చాలా ఉన్నాయంటున్నారు నిపుణులు. అందుకోసం క్రమం తప్పకుండా నిర్దిష్టం సమయం కేటాయించుకొని పరుగు పెట్టాలంటున్నారు. అమెరికాకు చెందిన బ్రిగమ్ యంగ్ యూనివర్సిటీ పరిశోధకులు తాజాగా వ్యాయామం-ప్రయోజనం అనే అంశంపై అధ్యయనం చేశారు. ఎక్సర్‌సైజ్ చేయాలంటే బద్ధకించేవాళ్లు ఇకనైనా శ్రద్ధ కనబర్చాలనీ.. పరుగును వ్యాయామ విధానంగా ఎంచుకుంటే మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని అంటున్నారు. ప్రధానంగా దీర్ఘకాలిక ఒత్తిళ్లు కూడా తొలిగిపోయే అవకాశం ఉరకడం వల్ల సాధ్యమవుతుందన్నారు. జ్ఞాపకశక్తి కూడా మెరుగవుతుందని చెప్తున్నారు. చాలామంది రన్నింగ్ మంచిది కాదు.. రన్నింగ్ చేస్తే గుండె సమస్యలు.. వచ్చి ఆరోగ్యం ఆందోళనకరంగా మారుతుంది అనుకోవడం పొరపాటు అన్నారు.

నాన్న ఆరోగ్యం ఎలా బాగవుతుంది?



మా నాన్న వయసు 56 సంవత్సరాలు. ఒక ఆటోమొబైల్ కంపెనీలో మార్కెటింగ్ మేనేజరుగా పనిచేస్తున్నారు. గడిచిన పదిహేను సంవత్సరాల నుంచి మద్యం అలవాటు ఉంది. ఆఫీసు తరపున తరచూ జరిగే మీటింగ్స్‌లో కొంచెం ఎక్కువగానే తాగుతారు. ఇతరత్రా చాలా జాగ్రత్తగా ఉంటారు. ఈ మధ్య కాలంలో ఆయన విపరీతమైన దురదతో బాధపడుతున్నారు. కడుపులో కూడా వికారంగా అనిపిస్తున్నదని అంటున్నారు. మూడు వారాల క్రితం మా ఫ్యామిలీ డాక్టర్‌కు చూపిస్తే మద్యం తగ్గించండి సర్దుకుంటుందని కొన్ని మందులు ఇచ్చారు. కానీ ఫలితం కనిపించడం లేదు. మద్యం వల్ల ఈ అనారోగ్యమా? ఆయన ఆరోగ్యం బాగుపడాలంటే ఏం చెయ్యాలి? దయచేసి వివరంగా తెలియజేయగలరు.

వి. సాయి దీప్తి, సికింద్రాబాద్

మీరు తెలిపిన వివరాల ప్రకారం చూస్తే మీ నాన్నగారికి కాలేయంలో సమస్య ఉన్నట్టు అనిపిస్తున్నది. మద్యం ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడి ఉంటుంది. అధిక మద్యపానం రకరకాల కాలేయ సమస్యలకు దారి తీస్తుంది. ఫాటీ లివర్, హెపటైటిస్, లివర్ సిర్రోసిస్ తీవ్రమైన అనారోగ్యాలకు మద్యపానం కారణమవుతుంది. ఈ జబ్బులు ఒక్కసారి ప్రాణాంతకంగా కూడా మారొచ్చు.

కాలేయ జబ్బులు ప్రారంభంలో ఎలాంటి లక్షణాలను కనబరుచవు. వ్యాధి తీవ్రమయ్యే కొద్దీ కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కళ్లు పచ్చగా మారడం, దురదలు రావడం, ఆకలి మందగించడం, నీరసంగా ఉండడం, ఎక్కువగా నిద్రపోతుండడం, కడుపులో వికారంగా ఉండడం, ఏకాగ్రత కుదురకపోవడం, జ్ఞాపకశక్తి మందగించడం వంటివి ముఖ్యమైన లక్షణాలు.

త్వరగా గుర్తిస్తే మందులతో చికిత్స అందించవచ్చు. కానీ సమయం మించి పోతే కాలేయకణాలు క్రమంగా జీవం కోల్పోతాయి. ఫలితంగా లివర్ స్కార్ ఏర్పడుతుంది. ఈ స్కార్ క్రమంగా లివర్‌ను పూర్తిగా కప్పేస్తుంది. ఇలాంటి స్థితిలోనే లక్షణాలు పూర్తిస్థాయిలో బయటపడుతాయి. కాలేయానికి జరిగిన నష్టాన్ని బట్టి ఈ స్థాయిలను ఎ, బి, సి గా గుర్తిస్తారు. చైల్డ్ పగ్ స్థాయిలోనే చికిత్సకు రాగలితే మందులతో, జీవనశైలి మార్పులతో చికిత్స పూర్తి చేసి సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

చివరి రెండు స్థాయిల్లో ఉన్నవారికి వ్యాధి తీవ్రతను, తట్టుకోగల శక్తిని అంచనావేసి కాలేయ మార్పిడిని సిఫారసు చేస్తారు. మీ నాన్నగారిలో కాలేయ వ్యాధులకు సంబంధించి లక్షణాలు కనిపించడం మొదలయ్యింది. కాబట్టి వెంటనే ఆలస్యం చెయ్యకుండా కాలేయనిపుణులను సంప్రదించండి. తీవ్రమైన కాలేయ వ్యాధులను ఇప్పుడు మందులతో, అవసరమనుకుంటే సర్జరీ ద్వారా తగ్గించే చికిత్సలు చాలా అందుబాటులో ఉన్నాయి.



డాక్టర్ బాల చంద్రమీనన్
సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్
సికింద్రాబాద్


బరువు పెరుగడం లేదా?

మీ పిల్లలు పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారా? కండ పుష్టిలేక నీరసించిపోతున్నారా? అయితే ప్రోటీన్లు శరీరానికి అధికంగా అందించే ఈ ఆహారం పెట్టండి.

- పాల ద్వారా లభించే వెన్నలో ఆరోగ్యకరమైన కొవ్వులు కండపుష్టికి సాయపడుతాయి. పిల్లల ఆహారంలో వెన్నను భాగం చేస్తే సులభంగా బరువు పెరుగుతారు.
- పాలు, మీగడలో కూడా అధిక కేలరీలు ఉంటాయి. ప్రతి రోజూ రెండు గ్లాసుల పాలు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. తినడానికి ఏమైనా ఇవ్వాలనుకుంటే తృణధాన్యాలు, మీగడ ఉండేలా చూసుకోండి.
- తక్కువ ధరలో అధిక మాంసకృత్తులు అందించే ఆహారం కోడిగుడ్లు. రోజువారీ ఆహారంలో గుడ్డును చేర్చితే బరువు పెరుగడమే కాదు.. తెలివితేటలు కూడా పెరుగుతాయి.
- అధిక కేలరీలు ఉండి తక్షణమే శక్తినిచ్చే పండు అరటి. ఇవి పిండి పదార్థాలను అందించడమే కాకుండా, ఆరోగ్యకరమైన కొవ్వును పెంచుతాయి.
- చికెన్ కండరాలను పెంచడంలో సాయపడుతుంది. తక్కువ బరువుతో బాధపడే చిన్నారులకు రోజూ అవసరమైనంత చికెన్ తినిపించాలి.
- అవకాడో పండులో ఉండే కొవ్వు, పోషకాలు పిల్లల ఎదుగుదలకు దోహదం చేస్తాయి. క్రమం తప్పకుండా ఇవి తినడం వల్ల బరువు పెరుగుతారు.




ఆరోగ్య సల్ఫర్..!




- గుడ్లలో ప్రోటీన్లతో పాటు సల్ఫర్ కూడా అధికంగా ఉంటుంది. గుడ్డును ఉడికించి తినడం వల్ల ప్రోటీన్లు, ఖనిజాలు శరీరానికి అందుతాయి.
- వెల్లుల్లి, ఉల్లి, ఉల్లికాడలు, కేసరము వంటి కూరగాయల్లో సల్ఫర్ అత్యధికంగా ఉంటుంది. పెద్దపేగు, ఊపిరితిత్తులు, ఆహార నాళాల్లో క్యాన్సర్ కణాల వృద్ధిని నిలువరిస్తుంది.
- అవిసె గింజల్లో ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ అత్యధికంగా ఉంటాయి. ఎమినో ఆమ్లాల వల్ల మెదుడు, కాలేయం మంచిగా పనిచేస్తాయి.
- చిక్కుళ్లు, ఎండిన బీన్స్, సోయా బిన్స్ వంటి ధాన్యాల్లో సల్ఫర్ అత్యధికంగా ఉంటుంది.

దాచొద్దు.. బాధపడొద్దు!



దాచొద్దు.. అస్సలు బాధపడొద్దు. అలాగని సమస్యను కొని తెచ్చుకోవద్దు. చాలా చోట్ల సానిటరీ నాప్‌కిన్స్ న్యూస్ పేపర్‌లో మలిచి నల్లటి ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి ఎవరికీ కనబడకుండా ఇస్తారు. తెలిసి కూడా ప్లాస్టిక్ వాడకాన్ని ఈ విధంగా పెంచుతున్నారు. ఎందుకంటే అది బయటికి కనిపించొద్దు అంటే నల్లటి ప్లాస్టిక్ కవర్ మంచిదని అందరి భావన. ఆ ప్లాస్టిక్‌తో ఎంత నష్టం చేకూరుతుందో పట్టింపు ఉండదు. 'ఎందుకు సానిటరీ నాప్‌కిన్స్ మీ అందమైన హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టరు?' అనే ప్రశ్న నుంచి మొదలైంది ఓ ప్రచార ఉద్యమం. 'డోంట్ హైడ్ ఇట్. పీరియడ్' పేరుతో సోషల్‌మీడియాలో లేవనెత్తిన ఓ అంశానికి విశేష స్పందన వస్తుంది. నేహా తుల్సైన్ ఈ ప్రచారానికి ఆజ్యం పోశారు. ప్రజల ఆలోచనా తీరు మారితే తప్ప ఇది సాధ్యం కాదని, అందుకోసం ఈ ప్రచారోద్యమానికి శ్రీకారం చుట్టినట్టు నేహా చెప్తున్నారు. సానిటరీ ప్యాడ్స్‌ని తీసుకెళ్లడం అదేదో చెడును తీసుకెళ్లిన భావన ఉన్నన్ని రోజులు మార్పు ఉండదని అంటున్నారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రజల్లో చైతన్యం కల్పించాలనుకుంటున్నారు. ఈ ఉద్యమంలో భాగంగా ఎర్రటి పోల్కా చుక్కలతో ఉన్న తెల్లటి కాన్వాస్ బ్యాగ్‌లో ప్యాడ్స్ ప్యాక్ ఉంచుతున్నారు. ఇది ఈ ఏడాది జనవరి మాసంలో ప్రారంభం అయింది. వీళ్లు రూపొందించిన కాన్వాస్ బ్యాగ్‌లో పది ప్యాడ్స్ పడుతాయి. ప్రతీ ప్యాడ్ మీద సామాజిక ఉద్దేశంతో రాసిన సందేశం ఉంటుంది.



అందుబాటులో ఐఐటీ మాక్‌టెస్ట్‌లు

దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న విషయం విదితమే. మొదటిసారి ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఐఐటీ కాన్పూర్ మాక్‌టెస్ట్‌లను అందుబాటులో ఉంచింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్‌లో ఇప్పటికే మూడు మాక్‌టెస్ట్‌లను విద్యార్థుల సౌకర్యార్థం విడుదలచేసింది. పరీక్షలోగా మరికొన్ని టెస్ట్‌లను కూడా అందుబాటులోకి తెస్తామని అధికారులు వెల్లడించారు. మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష స్వరూపాలను పూర్తిగా అవగతం చేసుకోవచ్చు.

గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామ్

గతవారం తరువాయి

వెర్బల్ సెక్షన్‌లో మార్కులు ఎలా పెంచుకోవాలి?

- రోజు కనీసం 30 నిమిషాలు ఆంగ్ల దినపత్రిక, వ్యాసాలు చదవాలి.
- కొత్త పదాలు నేర్చుకున్నప్పుడు వాటిని ఒక వాక్యంలో ఉపయోగించడానికి ప్రయత్నించాలి.
- సెంటెన్స్ ఈక్వాలెన్స్, టెక్ట్స్ కంప్లీషన్ ప్రశ్నల్లో వాక్యాలను చాలా జాగ్రత్తగా చదివి, అక్కడ ఉన్న ఖాళీల్లో ఏ పదం సరిపోతుందని ఊహించిన తర్వాతనే ఇచ్చిన ఆప్షన్స్‌లోని పదాల నుంచి సరిపడే వాటిని ఎంచుకోవాలి. ఇలాంటి ప్రశ్నల్లో జవాబుకు సంబంధించిన ఏదో ఒక క్లూ ఉంటుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్‌కు మిగిలిన ప్రశ్నలతో పోలిస్తే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుంది. ఇచ్చిన విషయం త్వరగా చదివి, అర్థం చేసుకోవడం అలవర్చుకోవాలి. ప్రతి ప్రశ్నకు సంబంధించిన జవాబు ప్యాసేజ్‌లో వెతకాలి. తప్పు ఆప్షన్స్‌ను తొలిగిస్తూ సరైన జవాబును ఎంచుకోవాలి.



- క్వాంటిటేటివ్ రీజనింగ్: ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో 20 ప్రశ్నలను 35 నిమిషాల్లో పూర్తిచేయాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్ స్కోర్ 130-170 ఉంటుంది. మన దేశంలో జీఆర్ఈ రాసిన విద్యార్థులు సగటు స్కోర్ 153.5. కానీ ఇందులో 170 మార్కులు సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇందులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, న్యూమరిక్ ఎంట్రీ ప్రశ్నలు (ఖాళీని పూరించడం), క్వాంటిటేటివ్ కంపారిజన్ ప్రశ్నలు ఉంటాయి. ఒక ఆన్‌లైన్ క్యాలిక్యులేటర్ కూడా అందుబాటులో ఉంటుంది. ఇది న్యూమరిక్ ఎంట్రీ ప్రశ్నల్లో లేదా లెక్కచేయడం కష్టంగా ఉన్నప్పుడు ఉపయోగించాలి. కొన్ని ప్రశ్నలకు ఒకటి కంటే ఎక్కువ జవాబులు ఉండొచ్చు. ఇది ముందే చాలా స్పష్టంగా తెలియజేసేలా ఉంటుంది. అన్ని కరెక్ట్ ఆప్షన్స్ సెలెక్ట్ చేస్తేనే మార్కులు ఉంటాయి. ఈ సెక్షన్‌లో అడిగే ప్రశ్నలు చదివిన విషయాల మీదనే ఉంటాయి. అందుకే స్కూల్‌లో చదివిన గణిత విషయాలన్నీ ఒకసారి రివైజ్ చేయాలి. క్యాలిక్యులేషన్స్ త్వరగా చేయడం అలవాటు చేసుకోవాలి. అన్ని రకాల లెక్కలను ప్రాక్టీస్ చేయాలి. అవసరమైనప్పుడు మాత్రమే ఆన్‌లైన్ క్యాలిక్యులేటర్‌ను ఉపయోగించాలి. చాలా వరకు లెక్కలకు ఇది అవసరం ఉండదు. జీఆర్ఈలో కనీసం 300 స్కోర్ తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి. 315 కంటే ఎక్కువ తెచ్చుకుంటే ఉత్తమ యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చే అవకాశం ఎక్కువ.

జీఆర్ఈ పరీక్ష తీరుతెన్నులు

- ఇందులో ఉన్న మార్క్ అండ్ రివ్యూ ఫీచర్స్ మరోసారి చూద్దామనే ప్రశ్నలకు ఉపయోగించాలి. ఇవి ఒక సెక్షన్ నిర్ణీత సమయంలోపే ఉపయోగించాలి.
- టెస్ట్‌లో నెగెటివ్ మార్కింగ్ లేదు
- పరీక్ష రాయడానికి సరైన సమయం: జీఆర్ఈ స్కోర్‌తో ఐదేండ్లలోపు ఎప్పుడైనా మాస్టర్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు బ్యాచిలర్స్ డిగ్రీ మూడో ఏడాది పరీక్ష రాసి, నాలుగో ఏడాది మొదటి సెమిస్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇలా చేయడంతో నాలుగో ఏడాదిలో ప్రాజెక్ట్‌వర్క్, జాబ్ ప్లేస్‌మెంట్స్‌పై కూడా ఫోకస్ చేయవచ్చు.

పకడ్బందీ ప్రిపరేషన్ కోసం

- జీఆర్ఈ కోసం చదవడం లేదా కోచింగ్ గ్రాడ్యుయేషన్ మూడో ఏడాదిలో పూర్తి చేసుకోవాలి.
- కనీసం 3-4 నెలలు శ్రద్ధగా అన్నిరకాల ప్రశ్నలు, మాక్ పరీక్షలను ప్రాక్టీస్ చేసుకోవాలి.
- కనీసం 5-6 కంప్యూటర్ ఆధారిత మాక్ పరీక్షలు రాయాలి.
- ఏ ప్రశ్నలైతే సరిగ్గా చేయలేకపోతున్నారో వాటిపై ఇంకా ఎక్కువ శ్రద్ధ వహించాలి.
- మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్- www.ets.org చూడవచ్చు. ప్రస్తుతం ఈ పరీక్షను 12 నెలల్లో ఐదుసార్లు నిర్వహిస్తున్నారు.
- ఈ పరీక్ష నిర్వహించే సంస్థ ఇటీవల వివిధ దేశాల నుంచి పరీక్ష రాసిన వారి సగటు స్కోర్‌ని చెప్పింది. అవి కింది విధంగా ఉన్నాయి.

దేశం	వెర్బల్ రీజనింగ్	క్వాంటిటేవ్ రీజనింగ్	ఏడబ్ల్యూఏ
యూఎస్ఏ	153.0	150.1	3.8
చైనా	147.5	164.2	3.0
ఇండియా	143.9	153.5	2.9



Sirisha Reddy Dubbudu
Director,
Abhyaas
Hyderabad & Warangal

భారతదేశం ఒక ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యమే కాదు, సమాఖ్య వ్యవస్థ కూడా. ఒక సమాఖ్య రాజ్యాంగానికి ఉండాల్సిన అతిముఖ్యమైన లక్షణం రాజకీయ, అధికార వికేంద్రీకరణ. ఎక్కడైతే సార్వభౌమాధికారం మొత్తం కేంద్రీకృతం కాకుండా పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు వికేంద్రీకరించబడుతుందో అక్కడ ప్రజాస్వామ్యం తన స్వచ్ఛమైన రూపాన్ని, బలమైన మనుగడను సాధిస్తుంది. అందుకోసం సమాఖ్య రాజ్యాంగంగా చెప్పబడే మన రాజ్యాంగం ప్రజాప్రతినిధులు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పరిచే విధాన్ని అవలంబించింది. కానీ నేటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు ఎన్నికల ద్వారా అన్ని రాష్ర్టాల్లోనూ ఏకకాలంలో ఎన్నుకోబడటం లేదు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా పేర్కొనే ఎన్నికలను సమర్థవంతంగా, స్వల్ప ఖర్చుతో ప్రజానీకానికి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలంటే కేంద్ర, రాష్ట్రస్థాయి ఎన్నికలు ఏకకాలంలో జరగాలన్న అభిప్రాయం చాలామంది మేధావులే గాక, 1999లో న్యాయ సంఘం తన 170వ నివేదికలో వెలిబుచ్చింది.



ఏకకాల ఎన్నికలు..!

దేశంలో ఏకకాల ఎన్నికలు పరిణామాలు

- రాష్ర్టాల, అసెంబ్లీలు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన చర్చల్లోకి వచ్చిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం కొంతకాలంగా చెబుతున్న ఈ మాటకు గతంలో మాజీ, ప్రస్తుత రాష్ట్రపతులు మద్దతు తెలపడం విశేషం.
- ఈ నేపథ్యంలో భారత్‌వంటి పెద్దదేశంలో సంక్లిష్టమైన ఏకకాల ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సిన అవసరం, దానివల్ల కలిగే లాభాలు, నష్టాలవంటివన్నీ చర్చనీయమే. ఎన్నికలు అంటే ఖర్చుతో కూడుకున్న విషయం కాబట్టి మొత్తం ప్రక్రియ పూర్తికావడానికి నెలల తరబడి సమయం పడుతుండటంతో న్యాయ కమిషన్ కూడా ఏకకాలపు ఎన్నికలు అవసరమని చెప్పింది. పార్లమెంటరీ స్థాయి సంఘం కూడా దీనిపై సిఫారసులు చేసింది.
- దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి 1951-52లో 1వ లోక్‌సభకు, అన్ని రాష్ర్టాల శాసనసభలకు ఎన్నికలు ఏకకాలంలోనే జరిగాయి. తర్వాత 1957, 1962, 1967 లలోనూ ఎన్నికలు ఏకకాలంలోనే నిర్వహించారు. ఇప్పటివరకు తొలి నాలుగు పర్యాయాలు ఏకకాలంలో ఎన్నికలు జరుగగా.. 1968లో తొలిసారి దీనికి అంతరాయం ఏర్పడింది. ఎందుకంటే 1966లో 'హర్యానా' రాష్ట్రం ఏర్పడిన తర్వాత.. 1967లో అన్ని రాష్ర్టాల శాసనసభలు, లోక్‌సభతోపాటే హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. అయితే 1968లో హర్యానా అసెంబ్లీ రద్దయింది. అలాగే 1969లో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ర్టాల అసెంబ్లీలను రద్దుచేశారు. ఆ రెండు సంవత్సరాలు అసెంబ్లీలకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 1970లో ప్రధాని ఇందిరాగాంధీ 4వ లోక్‌సభను రద్దుచేయడంతో 1971లో మళ్లీ లోక్‌సభ ఎన్నికలు నిర్వహించారు. దీంతో 1967లో ఏకకాల ఎన్నికలు పరంపరగా ముగిసినట్లయింది.
- దీని మీద 'ప్రజా ఫిర్యాదుల చట్టం'పై అప్పటి రాజ్యసభ సభ్యుడు 'సుదర్శన్ నాచియప్పన్' నేతృత్వంలో పనిచేసిన పార్లమెంటరీ స్థాయీసంఘం 2015, డిసెంబర్‌లో ఉభయసభలకు ఒక నివేదిక సమర్పించింది. దీనిలో భాగంగా ఎన్నికల సాధ్యాసాధ్యాల గురించి కూలంకషంగా చర్చించింది. దీనిపై చర్చ జరుగాలని అభిప్రాయపడుతూ పలు సూచనలు, సిఫారసులు చేసింది.

ఏకకాల ఎన్నికలు - లాభాలు

- ఎన్నికల సంస్కరణలకు సంబంధించి న్యాయ కమిషన్ 1999లో ఇచ్చిన నివేదికలో ఏకకాల ఎన్నికల లాభాలను చర్చించింది.
- లోక్‌సభ, దేశంలోని అన్ని శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుంది. 2014 ఎన్నికల సమయంలో లోక్‌సభ, విధాన సభల ఎన్నికలకు కలిపి సుమారు రూ. 4,000 కోట్లకుపైగా ఖర్చయ్యింది.
- ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుంది. ఎన్నికల నియమ-నిబంధనలు అమల్లో ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతాయి. అదే ఏకకాల ఎన్నికలు జరిగినట్లయితే పలుమార్లు ఈ అసౌకర్యం కలుగకుండా ఉంటుంది.
- తరచుగా ఎన్నికలు వస్తుంటే ప్రజాజీవితానికి ఇబ్బందులు ఏర్పడుతాయి. ఏకకాల ఎన్నికల ద్వారా వీటి ప్రభావం కూడా చాలా తగ్గుతుంది.

ఏకకాల ఎన్నికలు - సవాళ్లు

- ఎన్నికల నిర్వహణలో ఉండే ఇబ్బందులను ఎన్నికల సంఘం ప్రస్తావించింది.
- ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తగినన్ని సమకూర్చాలి.
- VVPAT (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్) యంత్రాలు తగినన్ని లేవు.
- 2015 అంచనా ప్రకారం ఏకకాల ఎన్నికల కోసం రూ. 9,284 కోట్లు అవసరం అవుతాయి.
- ఓటింగ్ యంత్రాలను పెద్ద సంఖ్యలో 15 ఏండ్లకొకసారి మార్చాల్సి వస్తుంది.

రాజ్యాంగపరమైన అంశాలు

ఏకకాల ఎన్నికలు నిర్వహిస్తే లోక్‌సభ ఎలా ఉండాలి?

- భారత ఎన్నికల సంఘం సూచనల ప్రకారం లోక్‌సభ టర్మ్ ప్రారంభమయ్యే, ముగిసే తేదీలను నిర్ణయించుకోవాలి.
- ముందుగా నిర్ణయించుకున్న తేదీ ప్రకారం లోక్‌సభ ఎప్పుడు మొదలవ్వాలో దానిని బట్టి ఏకకాల ఎన్నికల తేదీలను ఖరారు చేయాలి.
- లోక్‌సభ గడువుకు ముందే రద్దయ్యే అవకాశాలు తగ్గించడానికి ఎన్నికల సంఘం కొన్ని సూచనలు చేసింది. అవి.
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాలనుకుంటే వారే తదుపరి ప్రధానిగా ఎవరు ఉంటారో చెబుతూ వారి పేరిట అవిశ్వాస తీర్మానం పెట్టాలి.
- ఈ రెండు తీర్మానాలకు సభలో ఒకేసారి ఓటింగ్ జరగాలి. ఈ రెండు ఆమోదం పొందితేనే సభ రద్దయి ఎన్నికలు అవసరం లేకుండానే కొత్త సభ ఏర్పడుతుంది.
- ఒకవేళ ఏదైనా ఇతర కారణాల వల్ల లోక్‌సభ రద్దయి అనివార్య పరిస్థితి ఏర్పడితే అప్పుడు పాటించాల్సిన రెండు మార్గాలను ఎన్నికల సంఘం సూచించింది.
- లోక్‌సభ రద్దు కారణంగా ఎన్నికలకు కొద్ది సమయే ఉన్నట్లయితే దాని పాలనా పగ్గాలు రాష్ట్రపతి చేపట్టాలి. రాష్ట్రపతి కొందరు మంత్రులను నియమించుకుని వారి సలహా ప్రకారం ప్రభుత్వాన్ని నడపాలి. ఈ నిర్ణీత గడువులో కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు గాని, మళ్లీ ఎన్నికలు వచ్చేవరకు గాని అధ్యక్షపాలన ఉంటుంది.
- ఒకవేళ సభ రద్దయ్యేనాటికి లోక్‌సభ కాలపరిమితి మిగిలి ఉంటే అప్పుడు ఎన్నికలు నిర్వహించుకోవచ్చు. కానీ అప్పుడు ఏర్పడే ప్రభుత్వం అప్పటికి మిగిలి ఉన్న కాలం మాత్రమే అధికారంలో ఉంటుంది. ఇది రాష్ర్టాల శాసనసభలకు వర్తిస్తుంది.

ఏకకాల ఎన్నికలు-రాజ్యాంగ సవరణలు

- లోక్‌సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగంలోని కనీసం 5 అధికరణలను సవరించాల్సి ఉంటుంది.
- **ఆర్టికల్-83:** లోక్‌సభ గురించి తెలిపే ప్రకరణ
- **ఆర్టికల్-85:** రాజ్యసభ సమావేశాలను రాష్ట్రపతి ఏర్పాటు, వాయిదా, రద్దు చేయవచ్చు.
- **ఆర్టికల్-172:** విధానసభ కాలపరిమితి గురించి తెలుపుతుంది.
- **ఆర్టికల్- 174:** శాసనసభ సమావేశాల ఏర్పాటు, వాయిదా, రద్దుచేసే అధికారం గవర్నర్‌కు ఉంటుంది.
- **ఆర్టికల్-356:** రాష్ర్టాల్లో విఫలమయ్యే సందర్భాల్లో రాష్ట్రపతి పాలన విధించే నిబంధన.
- దక్షిణాఫ్రికా, స్వీడన్ వంటి దేశాల్లో ఏకకాల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే భారత్‌లో ఉన్నంత జనాభా ఈ దేశాల్లో లేదు. 1967లో చివరిసారిగా ఏకకాల ఎన్నికలు నిర్వహించినప్పటికంటే ప్రస్తుత జనాభా గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ ఏకకాల ఎన్నికలకు 2018 సెప్టెంబర్ తర్వాత సిద్ధంగా ఉన్నామని ఎన్నికల సంఘం తెలపడం తమ సామర్థ్యాన్ని తెలుపుతున్నది. ప్రాంతీయంగా ఒక రాజకీయ పార్టీపై స్థానిక జనాభాకు ఉన్న అభిమానం కేంద్ర ఎన్నికలను కూడా ప్రభావితం చేసిన సందర్భాలు మనం చూసినా రాజకీయ సమీకరణాలు, స్థితిగతులు ఎప్పటికీ శాశ్వతమైనవి కావు. కాబట్టి ఏకకాల ఎన్నికలు నిర్వహించడం భారత్‌కు దీర్ఘకాలంలో ప్రయోజనకరం కానుంది.



M. Balalatha
Civils Faculty

ఐఈఎల్‌టీఎస్

ఇంగ్లిష్ ప్రధాన భాషగా ఉండి అందులో కార్యకలాపాలు, కమ్యూనికేషన్ చేసే దేశాలకు చదువు లేదా ఉద్యోగాల కోసం వెళ్లేవారు తమ ఇంగ్లిష్ భాషా నైపుణ్యం నిరూపించుకోవడానికి ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ (ఐఈఎల్‌టీఎస్) పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీన్ని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం (కేంబ్రిడ్జ్ ఈఎస్ఓఎల్), బ్రిటిష్ కౌన్సిల్, ఐడీపీ: ఐఈఎల్‌టీఎస్ ఆస్ట్రేలియా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. ఇందులో వచ్చిన మార్కులను ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, యూకే, యూఎస్ఏ దేశాలు పరిగణనలోకి తీసుకుంటాయి. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు www.ielts.org వెబ్‌సైట్‌లో ఉంటాయి.

ఐఈఎల్‌టీఎస్ ఎక్కడ రాయవచ్చు?

ప్రపంచవ్యాప్తంగా సుమారు 1100 పైగా పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఇందులో చాలావరకు బ్రిటిష్ కౌన్సిల్, ఐఈఎల్‌టీఎస్ ఆస్ట్రేలియా, ఐడీపీ విశ్వవిద్యాలయాలు, భాష పాఠశాలలు నడుపుతున్నాయి. మనకు సమీపంలో ఐఈఎల్‌టీఎస్ టెస్ట్ సెంటర్ ఎక్కడ ఉందో ఐఈఎల్‌టీఎస్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

అకడమిక్ ట్రైనింగ్

ఐఈఎల్‌టీఎస్ పరీక్ష రెండు ఫార్మాట్‌లలో ఉంటుంది. అవి.. అకడమిక్, జనరల్ ట్రైనింగ్. అకడమిక్ ఫార్మాట్ ఇంగ్లిష్ మాట్లాడే యూనివర్సిటీలో అధ్యయనం లేదా శిక్షణ కోసం వెళ్లి తీసుకోవాల్సిన పరీక్ష. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అకడమిక్ ఫార్మాట్‌లో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. ఆంగ్లభాష మాట్లాడే దేశంలో ఒక ప్రొఫెషనల్ సంస్థలో చేరాలన్నా అకడమిక్ ఫార్మాట్ పరీక్ష తప్పనిసరి.

జనరల్ ట్రైనింగ్ ఫార్మాట్‌ను పని ప్రదేశాల్లో, సామాజిక ప్రదేశాల్లో సాధారణ మనుగడ కోసం వెళ్లేవారు రాయాల్సిన పరీక్ష. ఒకవేళ మీరు ఇంగ్లిష్ మాట్లాడే దేశాలకు మాధ్యమిక విద్య, ఉద్యోగం, శిక్షణ కోసం లేదా ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ వంటి దేశాలకు వెళ్లేవారు జనరల్ ట్రైనింగ్ ఫార్మాట్ పరీక్ష రాయాలి.

పరీక్ష విధానం

- ఈ పరీక్షలో స్థూలంగా నాలుగు మాడ్యూల్స్ ఉంటాయి. అవి పఠనం, రాయడం, వినడం, మాట్లాడటం. అన్ని మాడ్యూల్స్ తప్పనిసరి. లిజనింగ్, స్పీకింగ్ మాడ్యూల్స్ పైన చెప్పిన రెండు ఫార్మాట్‌లకు ఒక్కటే. రైటింగ్, రీడింగ్ మాత్రం కొంత భిన్నంగా ఉంటాయి.
- రీడింగ్, రైటింగ్, లిజనింగ్ మాడ్యూల్స్ ఒకేరోజు జరుగుతాయి. స్పీకింగ్ మాడ్యూల్ మాత్రం వేరే రోజు నిర్వహిస్తుంటారు.
- ఐఈఎల్‌టీఎస్ పరీక్ష 30 నిమిషాలు ఉంటుంది. ఇందులో నాలుగు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ ఒక్కో విధంగా ఉంటుంది. ప్రశ్నల కాఠిన్యత కూడా పెరుగుతుంది.
- ప్రతి సెక్షన్‌లో ఒక సంభాషణ లేదా ప్రకటన వింటారు. అది ఒకేసారి మీరు వినగలుగుతారు. అది వింటూ ప్రతి సెక్షన్‌కి సమాధానాలు కనుక్కోవాలి. ప్రతి సెక్షన్‌లో సమాధానాలు సరి చూసుకోవడానికి ఒక అర నిమిషం ఉంటుంది.
- ఐఈఎల్‌టీఎస్ రీడింగ్ పరీక్ష 60 నిమిషాలు ఉంటుంది. ఇది రెండు ఫార్మాట్లకి వేర్వేరుగా ఉంటుంది. వీటిలో మూడు సెక్షన్లు ఉంటాయి, అవి కూడా పెరుగుతున్న క్రమంలో కష్టతరంగా ఉంటాయి.
- ఐఈఎల్‌టీఎస్ రైటింగ్ పరీక్ష 60 నిమిషాలు ఉంటుంది. ఇది రెండు ఫార్మాట్లకు వేర్వేరుగా ఉంటుంది. ఇందులో రెండు రచనలు చేయాలి.

అకడమిక్

- **రచన 1:** డేటా ఇంటర్‌ప్రిటేషన్. అంటే ఇచ్చిన ఒక చార్ట్ గురించిగాని, గ్రాఫ్ గురించిగాని, పట్టిక గురించిగాని, రేఖాచిత్రం గురించి గాని మీ సొంతంగా వివరించాలి. (150 పదాలు, 20 నిమిషాలు)

  రచన 2: వ్యాసం (250 పదాలు , 40 నిమిషాలు)

జనరల్ ట్రైనింగ్

- **రచన 1:** ఒక లేఖ (150 పదాలు , 20 నిమిషాలు)
- **రచన 2:** వ్యాసం (250 పదాలు, 40 నిమిషాలు)
- మీ ఐఈఎల్‌టీఎస్ స్పీకింగ్ పరీక్ష 11-14 నిమిషాలు సాగుతుంది. ఇందులో మూడు విభాగాలు ఉంటాయి.
- **విభాగం 1:** మీ పరిచయం, ఇంటర్వ్యూ. ఇందులో మీరు 4-5 నిముషాలు ప్రసంగిస్తారు. దాని తర్వాత కొన్ని ప్రశ్నలు ఉంటాయి.
- **విభాగం 2 :** మీరు ఒక నిర్దిష్ట అంశంపై మాట్లాడాలి.
- **విభాగం 3 :** సాధారణ అంశానికి లేదా ఒక ప్రత్యేక అంశానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

మార్కింగ్ నమూనా

పరీక్ష తీసుకున్న తర్వాత ఆత్రుతగా ఎదురుచూసేది మార్కుల కోసం. మీ పరీక్షలో చాలా అనుభవం కల్గిన ఎగ్జామినర్స్ మార్కింగ్ నిర్వహిస్తారు. వీళ్లు కూడా ఒక ప్రామాణిక మార్గదర్శకాలు అనుసరిస్తారు. సంబంధిత టీచింగ్ అర్హత కలిగి, కేంబ్రిడ్జ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అసెస్మెంట్ ద్వారా సర్టిఫికెట్ పొందిన వారు మాత్రమే మీ పరీక్షలో మార్కులు వేయడానికి అర్హులు. ప్రతి రెండేండ్లకొకసారి పరిశీలకులు తమ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించుకోవాలి. దీనికోసం వాళ్లకు ప్రత్యేక పరీక్ష ఉంటుంది. ఇక విద్యార్థుల విషయానికి వస్తే, ప్రతి మాడ్యూల్‌లో మీకు 1 నుంచి 9 మధ్య ఒక బ్యాండ్‌స్కోర్ ఇస్తారు. ప్రతి మాడ్యూల్‌లో మీకు 1 నుంచి 9 మధ్య ఒక బ్యాండ్ స్కోర్ ఇస్తారు. ప్రతి మాడ్యూల్‌కి ఒక ప్రొఫైల్ స్కోరు ఉంటుంది. ఈ నాలుగు వ్యక్తిగత స్కోర్లు సగటు చేసి మొత్తం బ్యాండ్ స్కోరుగా ఇస్తారు. అది కూడా 1 నుంచి 9 మధ్య ఉంటుంది. మొత్తం బ్యాండ్ స్కోరు, ప్రతి మాడ్యూల్ బ్యాండ్ స్కోర్ అంకెలు, లేదా సగం అంకెల్లో మాత్రమే ఇస్తారు. కనీసం ప్రతి సెక్షన్‌లో 7 బ్యాండ్ కోసం మీరు ప్రయత్నం చేయాలి. ఇది ఒక స్కిల్ బేస్డ్ పరీక్ష కాబట్టి చాలా సాధన చేయాల్సి ఉంటుంది. రోజు వార్త పత్రికలు చదవడం, ఇంగ్లిష్ న్యూస్ వినడం, మాట్లాడడం, రాయడం లాంటివి చేస్తూ ఉండాలి.

సాట్

ఈ పరీక్ష అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు చేయాలనుకునేవారు (అంటే మన దగ్గర బాచిలర్స్ డిగ్రీకి సమానం). ప్రస్తుత పరీక్ష పాటర్న్‌లో క్రిటికల్ రీజనింగ్, రైటింగ్, మ్యాథ్స్ మీద ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష ప్రస్తుత పాటర్న్

Area(s)	Duration
Eassy	50 min
Mathematics	80 min
Critical Reading	35 min

మొత్తం పరీక్ష నిడివి మూడు గంటల 50 నిమిషాలు. ఇది ఆన్‌లైన్ పరీక్ష కాదు. పేపర్‌లో రాయాల్సి ఉంటుంది. ఇదే కాకుండా దీనిలో సబ్జెక్టు టెస్ట్ కూడా ఉంటుంది. మీరు వెళ్లాలనుకునే యూనివర్సిటీని బట్టి ఈ పరీక్ష రాయాలో వద్దో నిర్ణయించుకోవచ్చు. దీని కోసం <http://sat.collegeboard.org/home> చూడాలి.

పైన చెప్పినవే కాకుండా, ఇతర పరీక్షలు కూడా రాస్తుంటారు. ఉదాహరణకు టోఫెల్ పరీక్షకి ప్రత్యామ్నాయంగా రాస్తుంటారు. ఈ పరీక్ష కూడా లాంగ్వేజ్ ఎబిలిటీని టెస్ట్ చేస్తుంది. మరిన్ని వివరాల కోసం http://www.ets.org/toefl చూడవచ్చు.

పియర్సన్ అనే సంస్థ పీటీఈ పరీక్ష నిర్వహిస్తుంది. ఇది కూడా ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ లాంటిది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో పైచదువుల కోసం ఇది ఉపయోగపడుతుంది.

జీమ్యాట్ పరీక్ష బిజినెస్ స్కూల్‌లో అడ్మిషన్ కోసం రాస్తారు. అమెరికాలో ఇతర దేశాల పేరున్న యూనివర్సిటీల్లో ఎంబీఏ చేయడానికి ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. అయితే ఈ మధ్య కొన్ని బిజినెస్ స్కూల్ స్కోర్‌ని కూడా పరిగణిస్తున్నాయి. యూనివర్సిటీలను బట్టి అవసరాలు మారుతూ ఉంటాయి. అందుకే యూనివర్సిటీ వెబ్‌సైట్ చూసి ఏం చేయాలి అనేది నిర్ణయించుకోవాలి. ఉదాహరణకు కొన్ని జర్మనీలోని కొన్ని యూనివర్సిటీలకు జర్మన్ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ కాకుండా అదనపు అవసరాల గురించి తెలుసుకోవాలి.

సుడోకు

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

డైలీ సుడోకు 131 సమాధానం

2	1	9	3	4	6	7	8	5
8	6	3	2	7	5	9	4	1
7	5	4	9	8	1	2	3	6
9	4	2	6	5	7	8	1	3
3	8	6	1	2	9	4	5	7
1	7	5	4	3	8	6	2	9
5	3	7	8	6	4	1	9	2
6	9	8	5	1	2	3	7	4
4	2	1	7	9	3	5	6	8

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -132

				6				
		2	1			7	8	
1			8		2			4
5	7		6			4		
			2		1			
		4			5		3	1
8			3		6			9
	5	6			4	2		
				1				

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 19 ఫిబ్రవరి 2018

నీట్‌కు ఆధార్ లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు!

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)కు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ తప్పనిసరి అని ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చాలా మంది విద్యార్థులకు ఆధార్ లేదు. దీంతో వారందరికి న్యాయం చేయాలన్న ఉద్దేశంతో విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో గుర్తింపు కార్డు కాలమ్‌లో ఆధార్‌తోపాటు పేర్కొన్న ఇతర డాక్యుమెంట్లను వేటినైనా ఎంపికచేసుకోవచ్చు. ఆధార్ కాలమ్‌లో మాత్రం ఎన్‌రోల్‌మెంట్ నంబర్ తప్పనిసరిగా వేయాలి. అంటే ఆధార్ లేని విద్యార్థులు దగ్గర్లోని ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లలో తమ వివరాలు నమోదుచేసుకొని, సెంటర్‌లో ఇచ్చే ఎన్‌రోల్‌మెంట్ నంబరును తప్పక దరఖాస్తులో నమోదుచేసుకోవాలి. చివరితేదీకి చాలా సమయం ఉన్నందున ఆధార్ లేని విద్యార్థులు వెంటనే ఎన్‌రోల్ చేసుకోవాలని సీబీఎస్‌ఈ దరఖాస్తు పేర్కొంది. వేలిముద్రల విషయంలో కూడా సడలింపు ఇస్తున్నట్లు సీబీఎస్‌ఈ తెలిపింది. గరిష్ఠ వయోపరిమితి విషయంలో ప్రభుత్వ గెజిట్ విడుదలచేసింది కాబట్టి ఆ నిబంధన తప్పక అమలు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.






టీఆర్టీ - జనరల్ నాలెడ్జ్

1. ఆధునిక కంప్యూటర్‌ను కనుగొన్నవారు?
   1) న్యూమన్ 2) బిల్‌గేట్స్
   3) స్టీవ్ జాబ్స్ 4) చార్లెస్ బాబేజ్
2. ఖాసీలు ఏ ప్రాంతానికి చెందిన గిరిజనులు? (3)
   1) ఛత్తీస్‌గఢ్ 2) అండమాన్ నికోబార్ దీవులు
   3) మేఘాలయ, త్రిపుర 4) పశ్చిమ ఉత్తరప్రదేశ్
3. కిందివాటిలో సరైనది? (4)
   1) ఫయర్డ్‌లు, క్రిక్స్ అనేవి నదులు ఏర్పరిచిన భూ స్వరూపాలు
   2) స్పిట్ అనేది పవనం ఏర్పరిచిన నిక్షేపణ భూస్వరూపం
   3) నదీలోయ U ఆకారంలో ఉంటుంది. హిమానీ నది లోయ V ఆకారంలో ఉంటుంది.
   4) నదీలోయ V ఆకారంలో, హిమానీ నదిలోయ U ఆకారంలో ఉంటుంది.
4. స్వాతంత్ర్య పోరాటంలో జరిగిన సంఘటనలకు సంబంధించి సరైన చారిత్రక క్రమం? (3)
   1) క్రిప్స్ మిషన్, కేబినెట్ మిషన్, క్విట్ ఇండియా ఉద్యమం
   2) కేబినెట్ మిషన్, క్రిప్స్ మిషన్, క్విట్ ఇండియా ఉద్యమం
   3) క్రిప్స్ మిషన్, క్విట్ ఇండియా ఉద్యమం, కేబినెట్ మిషన్
   4) క్విట్ ఇండియా ఉద్యమం, క్రిప్స్ మిషన్, కేబినెట్ మిషన్
5. కింది యుద్ధాలను సరైన క్రమంలో అమర్చండి. (2)
   1) ప్లాసీ యుద్ధం, బక్సార్ యుద్ధం, వందవాసి యుద్ధం
   2) ప్లాసీ యుద్ధం, వందవాసి యుద్ధం, బక్సార్ యుద్ధం
   3) వందవాసి యుద్ధం, ప్లాసీ యుద్ధం, బక్సార్ యుద్ధం
   4) బక్సార్ యుద్ధం, ప్లాసీ యుద్ధం, వందవాసి యుద్ధం
6. అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం ఎక్కడ ఉంది?
   1) మలేషియా 2) ఫిలిప్పీన్స్
   3) కంబోడియా 4) మయన్మార్
7. కిందివాటిలో ఒక సమాచారాన్ని డిజిటల్ రూపంలోకి మార్చేది?
   1) మోడెమ్ 2) డిజిటైజర్ 3) మౌస్ 4) లైట్‌పెన్
8. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ, 7 రాజ్యసభ స్థానాలు ఉండగా దేశంలో 14 లోక్‌సభ స్థానాలు ఉన్న రెండు రాష్ట్రాలు ఏవి?
   1) పంజాబ్, కేరళ 2) జార్ఖండ్, పంజాబ్
   3) జార్ఖండ్, అసోం 4) ఛత్తీస్‌గఢ్, అసోం
9. భారతదేశ నాగరికతలో అతిపురాతన గ్రంథం ఏది?
   1) రుగ్వేద 2) యజుర్వేద
   3) బ్రాహ్మణాలు 4) భగవద్గీత
10. కిందివాటిలో చంద్రయాన్, మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్) కోసం ఇస్రో ఉపయోగించిన వాహక నౌక/ రాకెట్ శ్రేణి?
    1) పీఎస్‌ఎల్‌వీ-G 2) పీఎస్‌ఎల్‌వీ-CA
    3) పీఎస్‌ఎల్‌వీ-XL 4) జీఎస్‌ఎల్‌వీ-MK II
11. కింది ఏ రెండు దేశాలు కలిసి బరాక్-8 క్షిపణిని అభివృద్ధి చేశాయి?
    1) భారత్-రష్యా 2) భారత్-ఫ్రాన్స్
    3) భారత్-ఇజ్రాయెల్ 4) భారత్-జపాన్
12. ఉపరితలం నుంచి ఉపరితలంపై గల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉన్న అణ్వస్త్ర క్షిపణి ఏది?
    1) అగ్ని 2) బ్రహ్మోస్
    3) అర్జున్ 4) ద్రోణాచార్య
13. రాష్ట్రాలు, ఆ రాష్ట్ర పండుగలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    ఎ. బిహు- అరుణాచల్‌ప్రదేశ్
    బి. హార్న్‌బిల్-మణిపూర్
    సి. లోసార్- అసోం
    1) ఎ 2) ఎ, సి 3) బి 4) పైవన్నీ
14. సంప్రదాయ పండుగలు, రాష్ట్రాలకు సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ. జల్లికట్టు-తమిళనాడు బి. కంబళ-కేరళ
    సి. బైల్‌గాడి షరియత్-మహారాష్ట్ర
    1) ఎ 2) ఎ, బి 3) సీ 4) ఎ, సి
15. విద్యాంజలి పథకం కేంద్ర ప్రభుత్వంలోని ఏ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంది?
    1) యువజన వ్యవహారాలు, క్రీడలు
    2) శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ
    3) కార్మిక, ఉపాధి కల్పన శాఖ
    4) మానవ వనరుల మంత్రిత్వ శాఖ
16. పోఖ్రాన్‌లో తొలిసారిగా అణుపరీక్ష నిర్వహించిన రోజును జాతీయ వైజ్ఞానిక దినోత్సవంగా జరుపుతున్నారు. అది ఎప్పుడు?
    1) జూన్ 29 2) మే 11
    3) మార్చి 16 4) ఏప్రిల్ 21
17. కిందివాటిలో కేసీఆర్ కిట్‌కు సంబంధించి సరికానిది?
    1) మాతా, శిశు మరణాల రేటును తగ్గించడానికి
    2) ఆడపిల్లల జననాల రేటును ప్రోత్సహించడం
    3) బాలిక జన్మిస్తే రూ. 14 వేలు, బాలుడు జన్మిస్తే రూ. 13 వేలు అందిస్తారు
    4) ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను పెంచడానికి
18. టీ-హబ్ ఉండే ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
    1) ఇంక్యుబేటర్ సెంటర్ 2) క్యాటలాగ్
    3) ఆవిష్కరణల ప్రాంతం 4) క్యాటలిస్ట్
19. ఆయుధాల సరఫరా, ఎగుమతులను నియంత్రించే వాసెనార్ బృందంలో భారత్ చేరింది. ఇందులో భారత్ ఎన్నో సభ్య దేశం?
    1) 41 2) 43 3) 39 4) 42
20. పదిహేనవ ఆర్థికసంఘం చైర్మన్ ఎవరు?
    1) వైవీ రెడ్డి 2) విజయ్ కేల్కర్
    3) ఎన్‌కే సింగ్ 4) నందన్ నీలేకని
21. ప్రపంచంలో అత్యధికంగా బంగారాన్ని వినియోగిస్తున్న దేశం?
    1) భారత్ 2) అమెరికా
    3) రష్యా 4) చైనా
22. ఐక్యరాజ్యసమితిలో మొత్తం సభ్యదేశాల సంఖ్య 193. వాటిలో 2011, జూలై 14న చివరగా సభ్యత్వం పొందిన దేశం ఏది?
    1) తూర్పు తైమూర్ 2) దక్షిణ సూడాన్
    3) స్విట్జర్లాండ్ 4) మాంటెనీగ్రో
23. దులీప్ ట్రోఫీ ఏ క్రీడకు సంబంధించింది?
    1) ఫుట్‌బాల్ 2) హాకీ
    3) క్రికెట్ 4) బ్యాడ్మింటన్
24. రగ్బీ జట్టులో మొత్తం ఎంతమంది ఆటగాళ్లు ఉంటారు?
    1) 15 2) 11 3) 13 4) 10
25. దేశంలో అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్‌పర్సన్ ఎవరు?
    1) అరుంధతీ భట్టాచార్య 2) వైసీ మోదీ
    3) దినేశ్వర్ శర్మ 4) రజనీశ్ కుమార్
26. 'నేషన్ బ్యాంక్ ఆన్ అజ్' అనే పంచ్‌లైన్ కలిగిన బ్యాంకు ఏది?
    1) బ్యాంక్ ఆఫ్ బరోడా 2) ఐడీబీఐ బ్యాంక్
    3) స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ 4) ఏదీకాదు
27. అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఏ నెల రెండో ఆదివారం జరుపుకుంటారు?
    1) జూన్ 2) మే 3) జూలై 4) ఆగస్ట్
28. గ్లోబల్ ఫ్యామిలీ డే/అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ఎప్పుడు?
    1) జనవరి 1 2) డిసెంబర్ 28
    3) జనవరి 24 4) నవంబర్ 31
29. కింది వాటిలో కేంద్రప్రభుత్వ భౌగోళిక గుర్తింపు పొందింది?
    1) హైదరాబాద్ బిర్యానీ 2) వరంగల్ తివాచీలు
    3) పోచంపల్లి ఇక్కత్ 4) నిర్మల్ బొమ్మలు
30. తెలంగాణ ప్రభుత్వం ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించింది. ఇలా గుర్తించిన మరో రాష్ట్రం ఏది?
    1) జమ్ముకశ్మీర్ 2) పశ్చిమబెంగాల్
    3) బీహార్ 4) ఢిల్లీ
31. 'జాగో-బదలో-బోలో' అనే అవగాహన కార్యక్రమం దేనికి సంబంధించింది?
    1) స్వచ్ఛ హైదరాబాద్ 2) బాలల భద్రత
    3) వృద్ధుల భద్రత 4) స్వచ్ఛ సర్వేక్షణ్
32. 'ద గోట్ తీఫ్' పుస్తక రచయిత ఎవరు? (4)
    1) రఘురాం రాజన్ 2) ప్రదీప్ దామోదరన్
    3) జయా జైట్లీ 4) పెరుమాల్ మురుగన్
33. వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్ (ప్రపంచ సంతోష సూచి)-2017లో భారత్ స్థానం?
    1) 131 2) 143 3) 122 4) 92
34. 2016కు గాను మానవాభివృద్ధి సూచి (హెచ్‌డీఐ)లో భారత్ స్థానం?
    1) 131 2) 122 3) 92 4) 143
35. దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ 2014, జూన్ 2న అవతరించింది. ఎన్నో లోక్‌సభ కాలంలో కొత్త రాష్ట్రం ఏర్పాటైంది?
    1) 16వ లోక్‌సభ 2) 14వ లోక్‌సభ
    3) 15వ లోక్‌సభ 4) 17వ లోక్‌సభ
36. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉదయ్ యోజన దేనికి సంబంధించింది?
    1) ఉచిత గ్యాస్ కనెక్షన్లు 2) విద్యుత్ పంపిణీ
    3) ఉపాధిహామీ
    4) గ్రామపంచాయతీల కంప్యూటరీకరణ
37. రెడ్ డాటా బుక్ లేదా రెడ్ లిస్ట్‌కు సంబంధించిన సంస్థ ఏది?
    1) రెడ్‌క్రాస్ 2) UNESCO
    3) IUCN 4) UNCTAD
38. శీతాకాలంలో 10 నుంచి 15 డిగ్రీ సెం.గ్రే ఉష్ణోగ్రత, ఎండాకాలంలో వర్షం కురువకుండా 21 నుంచి 25 డిగ్రీ సెం.గ్రే ఉష్ణోగ్రతతో కూడిన వాతావరణం ఏ పంట సాగుకు అనుకూలం?
    1) మక్కజొన్న 2) వరి
    3) వేరుశనగ 4) గోధుమ
39. 2017లో జరిగిన అండర్-17 ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు సాల్ట్‌లేక్ స్టేడియం ఆతిథ్యం ఇచ్చింది. అది ఎక్కడ ఉంది?
    1) చెన్నై 2) కోల్‌కతా
    3) ఢిల్లీ 4) అహ్మదాబాద్
40. కిందివాటిలో 'లెర్నింగ్ టు రియలైజ్ ఎడ్యుకేషన్స్ ప్రామిస్' ప్రధాన ఇతివృత్తంగా కలిగింది?
    1) వరల్డ్ డెవలప్‌మెంట్ రిపోర్ట్-2018
    2) హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్ట్-2016
    3) వరల్డ్ డెవలప్‌మెంట్ రిపోర్ట్- 2017
    4) హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్ట్- 2018
41. కింది వాటిలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ రాసిన పుస్తకం కానిది?
    1) ఐ డూ వాట్ ఐ డూ 2) ఇన్‌డామిటబుల్ స్పిరిట్
    3) ఫాల్ట్ లైన్స్
    4) సేవింగ్ క్యాపిటలిజమ్ ఫ్రమ్ ద క్యాపిటలిస్ట్స్
42. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై కేంద్ర ప్రభుత్వం నియమించిన సర్కారియా కమిషన్‌లో సభ్యునిగా ఉన్నవారు?
    1) వీ శంకర్ 2) కే హనుమంతయ్య
    3) డా. ఎస్‌ఆర్ సేన్ 4) ఓవీ అల్గేసన్
43. 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో శిశు మరణాల రేటు (IMR)ను ఎంతకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?
    1) ప్రతి 1000 జననాలకు 27
    2) ప్రతి 1000 జననాలకు 28
    3) ప్రతి 1000 జననాలకు 29
    4) ప్రతి 1000 జననాలకు 30
44. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభా తగ్గుదల నమోదైన రాష్ట్రం?
    1) నాగాలాండ్ 2) మణిపూర్
    3) త్రిపుర 4) సిక్కిం
45. ఆర్థికంగా అగ్రస్థానంలో నిలిచి లింగ నిష్పత్తిలో అట్టడుగు స్థానంలో ఉన్న రాష్ట్రం?
    1) గుజరాత్ 2) మధ్యప్రదేశ్
    3) మహారాష్ట్ర 4) హర్యానా
46. కిందివాటిలో జీ-20 సదస్సుకు సంబంధించి సరైనది?
    ఎ. 12వ జీ-20 సదస్సు జర్మనీలో జరిగింది
    బి. 13వ జీ-20 సదస్సుకు చైనా ఆతిథ్యం ఇచ్చింది
    సి. 14వ జీ-20 సదస్సును జపాన్‌లో నిర్వహించారు
    1) ఎ, బి సరైనవి 2) ఎ, సి సరైనవి
    3) బి, సి సరైనవి 4) పైవన్నీ
47. 2017కుగాను ప్రపంచ ఆర్థిక మండలి (WEF) ప్రకటించిన గ్లోబల్ జండర్ గ్యాప్ ఇండెక్స్‌లో భారత్ ఏ స్థానంలో నిలిచింది?
    1) 108 2) 122 3) 94 4) 112
48. కిందివాటిలో దేని ద్వారా బంకర్లలో ఉండి భూమి ఉపరితలంపై శత్రు సైనికుల కదలికలను తెలుసుకుంటారు?
    1) పుటాకార దర్పణం 2) కుంభాకార కటకం
    3) పెరిస్కోప్ 4) కెలిడయాస్కోపు
49. 2017లో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన పర్యావరణ సదస్సుకు ఆతిథ్యమిచ్చిన నగరం?
    1) యాంగాన్ 2) బాన్
    3) సింగపూర్ 4) పారిస్
50. దేశంలో పచ్చికబయళ్లు, పశుగ్రాసం పరిశోధనా కేంద్రం ఎక్కడ ఉంది?
    1) రాజేంద్రనగర్ 2) ఇండోర్
    3) గాంధీనగర్ 4) ఝాన్సీ
51. మార్కెట్‌లో పెట్టుబడుల దృష్ట్యా ప్రపంచంలో అతిపెద్ద లిస్టెడ్ కంపెనీ ఏది?
    1) అమెజాన్ 2) మైక్రోసాఫ్ట్
    3) ఆపిల్ 4) షియోమి
52. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ 2017లో అందుకున్న అవార్డు ఏది?
    1) ద గ్రాండ్ కార్డన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద పౌలోనియా ఫ్లవర్స్
    2) వరల్డ్ స్టేట్స్‌మ్యాన్ అవార్డ్
    3) ఉత్తమ పార్లమెంటేరియన్
    4) ఇందిరాగాంధీ శాంతి బహుమతి
53. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సదస్సు ప్రధాన ఇతివృత్తం ఏది?
    1) ఉమెన్ ఫస్ట్, ప్రాస్పరిటీ ఫర్ ఆల్
    2) డెవలప్‌మెంట్ ఫర్ ఆల్
    3) రిచ్ మస్ట్ షేర్ దేర్ జాయ్ విత్ పూర్
    4) డూ యూ ఫీల్ స్యాడ్ ఫర్ మీ
54. ఏ అంతర్జాతీయ నౌకా కేంద్రాన్ని అభివృద్ధి చేయడంలో భారత్ ప్రధాన పాత్ర పోషించింది?
    1) గ్వదార్ పోర్ట్ 2) హబన్‌టోటాలోని డీప్ సీ పోర్ట్
    3) చాబహార్ పోర్ట్ 4) చిట్టగాంగ్ పోర్ట్
55. భారతదేశానికి సంబంధించిన కింది సమాచారాన్ని పరిశీలించండి.
    ఎ. ప్రపంచ బ్యాంకు ప్రకటించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ ఇండెక్స్-2018లో భారత్ 100వ స్థానంలో ఉంది.
    బి. ఐఎండీ వరల్డ్ టాలెంట్ ర్యాంకింగ్స్-2017లో 51వ స్థానం
    సి. క్రెడిట్ రేటింగ్ సంస్థ మూడీస్ Baa2 రేటింగ్ ప్రకటించింది.
    డి. న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా పనిచేసే రేటింగ్ ఏజెన్సీ స్టాండర్డ్ అండ్ పూర్ Baa2 రేటింగ్ ఇచ్చింది.
    పైవాటిలో సరైనది ఏది?
    1) ఎ, బి 2) ఎ, డి 3) బి, సి 4) పైవన్నీ
56. 2017, నవంబర్‌లో 100 ఏండ్లు పూర్తి చేసుకున్న భారతీయ కరెన్సీ నోటు ఏది?
    1) రూ. 1 2) రూ. 2 3) రూ. 5 4) రూ. 10
57. కొత్తగా ప్రవేశపెట్టిన రూ. 10 నోటుపై ఉన్న చారిత్రక ప్రదేశం ఏది?
    1) సారనాథ్ స్తూపం 2) హంపీ శిల్పం
    3) అశోక ధర్మచక్రం 4) ఎర్రకోట
58. బీజేపీ ప్రభుత్వం 2016, నవంబర్ 8న పెద్ద నోట్లను రద్దు చేసింది. దేశంలో ఇప్పటి వరకు ఎన్నిసార్లు డీమానెటైజేషన్ (నోట్ల రద్దు)ను ప్రకటించారు?
    1) రెండు 2) మూడు
    3) నాలుగు 4) ఒక్కసారి మాత్రమే
59. 'సాగా ఆఫ్ స్ట్రగుల్ అండ్ సాక్రిఫైస్-1992' పుస్తక రచయిత?
    1) ప్రణబ్ ముఖర్జీ 2) అబ్దుల్ కలాం
    3) ఏబీ వాజ్‌పేయి 4) పీవీ నరసింహారావు
60. 'రివర్ ఆఫ్ స్మోక్' పుస్తక రచయిత?
    1) రఘురాం రాజన్ 2) చేతన్ భగత్
    3) కుశ్వంత్ సింగ్ 4) అమితవ్ ఘోష్
61. రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవ్స్ కరెన్సీ ఏది?
    1) రుఫియా 2) రూపీ 3) రియాల్ 4) రూపియా
62. ఎవరెస్ట్ శిఖరాన్ని ఆరుసార్లు అధిరోహించిన మొదటి భారతీయుడు?
    1) జామ్లింగ్ టెంజింగ్ నార్గే 2) లోవ్‌రాజ్ సింగ్
    3) మోహన్ సింగ్ గంజ్వాల్
    4) హెచ్‌పీఎస్ అహ్లువాలియా
63. అపర్ణా పోపట్ ఏ రంగానికి చెందినవారు?
    1) క్రికెటర్ 2) హాకీ 3) బ్యాడ్మింటన్ 4) కబడ్డీ
64. దేశంలో అతిపెద్ద బ్రిడ్జి అయిన ధోలా సాథియా వంతెనను ఏ నదిపై నిర్మించారు?
    1) బ్రహ్మపుత్ర 2) తీస్తా నది
    3) దిహంగ్ నది 4) లోహిత్ నది
65. దేశంలో మొదటి అండర్ వాటర్ మెట్రోరైల్ సొరంగాన్ని నిర్మించారు. అది ఏ నదిపై ఉంది?
    1) హుగ్లీ నది 2) యమునా నది
    3) నర్మదా నది 4) గోమతి నది
66. తెలంగాణలో మొత్తం భూవిస్తీర్ణంలో అడవుల విస్తీర్ణం ఎంత శాతం ఉంది?
    1) 20.45 శాతం 2) 24.35 శాతం
    3) 33.35 శాతం 4) 28.25 శాతం
67. 2017లో ప్రపంచ సుందరి కిరీటాన్ని మానుషి చిల్లార్ సొంతం చేసుకుంది. 1966లో రీటా ఫారియా మొదటిసారిగా విశ్వసుందరిగా ఎంపిక కాగా, ఇప్పటివరకు మొత్తం ఎన్నిసార్లు భారత్‌కు చెందినవారు మిస్ వరల్డ్‌గా నిలిచారు?
    1) నాలుగు 2) ఐదు 3) ఆరు 4) ఏడు
68. అత్యున్నత సాహితీ పురస్కారమైన మ్యాన్ బుకర్ ప్రైజ్‌ను 2017లో జార్జ్ సాండర్స్ అందుకున్నారు. అయితే ఆయన రాసిన ఏ నవలకు ఈ అవార్డు లభించింది?
    1) టెన్త్ ఆఫ్ డిసెంబర్ 2) లింకన్ ఇన్ ది బార్డో
    3) ద బ్రెయిన్ డెడ్ మెగాఫోన్
    4) ఇన్ పెర్సుయేషన్ నేషన్
69. కింది ఏ ఆటగాడు ధ్యాన్‌చంద్ అవార్డును అందుకోలేదు?
    1) సయిద్ షాహిద్ హకీమ్ 2) సుమరాయ్ టెటె
    3) సర్దార్ సింగ్ 4) భూపీందర్ సింగ్
70. దేశంలో అత్యున్నత క్రీడా అవార్డు అయిన రాజీవ్ ఖేల్‌రత్నను అందుకున్న మొదటి పారాలింపియన్?
    1) మరియప్పన్ తంగవేలు 2) దేవేంద్ర ఝజరియా
    3) దీపా మాలిక్ 4) వరుణ్‌సింగ్ భాటి
71. 'ది మేకింగ్ ఆఫ్ ఏ లెజెండ్' పుస్తక రచయిత?
    1) సల్మాన్ రష్దీ 2) ప్రదీప్ దామోదరన్
    3) వైవీ రెడ్డి 4) బిందేశ్వరి పాఠక్
72. 'బియాండ్ ద డ్రీమ్ గర్ల్' పుస్తక రచయిత?
    1) జైరామ్ రమేష్ 2) హేమా మాలిని
    3) అమితాబ్ బచ్చన్ 4) రేఖ
73. ప్రపంచంలో యురేనియం నిల్వలు అత్యధికంగా ఎక్కడ గుర్తించారు?
    1) కెనడా 2) చిలీ 3) నైజీరియా 4) స్వీడన్
74. ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌ను దేశంలో మొదటిసారిగా ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు?
    1) కేరళ 2) సిక్కిం 3) కర్ణాటక 4) పంజాబ్
75. కిందివాటిలో తెలంగాణలో లేని వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ?
    1) శివరామ్ వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ
    2) కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ
    3) ప్రాణహిత వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ
    4) భద్ర వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ
76. సార్క్ కూటమిలోని ఏ దేశంలో పర్యటించినప్పుడు మన సమయాన్ని సవరించుకోవాల్సిన అవసరం లేదు?
    1) బంగ్లాదేశ్ 2) నేపాల్ 3) పాకిస్థాన్ 4) శ్రీలంక
77. హిమాలయ నదీ వ్యవస్థకు సంబంధించి కింది ఏ నదులు ద్వీపకల్ప పీఠభూమిలో ప్రవహిస్తున్నాయి?
    ఎ. చంబల్ బి. సోన్ సి. మహానది
    డి. దామోదర్ ఇ. సబర్మతి
    1) ఎ, బి 2) డి, ఇ 3) ఎ, బి, డి 4) పైవన్నీ
78. షగుణ్ వెబ్‌పోర్టల్ దేనికి సంబంధించింది?
    1) స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్
    2) సాగరమాల ప్రాజెక్ట్
    3) సర్వశిక్ష అభియాన్
    4) చిన్న, మధ్యతరహా తయారీ పరిశ్రమలు
79. కిందివాటిలో ఏది ప్రత్యక్ష పన్ను?
    ఎ. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ)
    బి. షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్
    సి. కార్పొరేట్ ట్యాక్స్
    1) ఎ 2) ఎ, బి 3) బి, సి 4) పైవన్నీ
80. ఆహార భద్రత హక్కు ఒక?
    1) ప్రాథమిక హక్కు 2) న్యాయబద్ధ హక్కు
    3) రాజ్యాంగబద్ధ హక్కు 4) ఏదీకాదు
81. కింది వాటిలో భూ పరివేష్ఠిత దేశాలు ఏవి?
    ఎ. కిర్గిస్థాన్ బి. తజికిస్థాన్
    సి. ఉజ్బెకిస్థాన్ డి. అర్మేనియా
    1) ఎ, డి 2) ఎ, సి 3) సి, డి 4) పైవన్నీ
82. కింది పట్టణాలను ఉత్తరం నుంచి దక్షిణానికి అమర్చండి.
    ఎ. దిస్పూర్ బి. సిల్చార్
    సి. ఇంఫాల్ డి. షిల్లాంగ్
    1) డి, ఎ, సి, బి 2) సి, బి, ఎ, డి
    3) ఎ, సి, డి, బి 4) ఎ, డి, సి, బి
83. సర్దార్ సరోవర్ డ్యామ్ వల్ల సాగునీటి రంగంలో లబ్దిపొందే రాష్ట్రాలు?
    ఎ. గుజరాత్ బి. రాజస్థాన్
    సి. మహారాష్ట్ర డి. మధ్యప్రదేశ్
    1) ఎ, బి 2) ఎ, సి, డి 3) ఎ, డి 4) పైవన్నీ
84. 'కాలంబు రాగానే కాటేసి తీరాలే' అనే కవిత రాసిన కవి?
    1) దాశరథి 2) సుద్దాల అశోక్‌తేజ
    3) కాళోజీ 4) అందెశ్రీ
85. '50 సంవత్సరాల హైదరాబాద్' పుస్తక రచయిత?
    1) బోయ జంగయ్య 2) మందుముల నరసింగరావు
    3) ఎలికట్టె శంకర్‌రావు 4) సీ నారాయణరెడ్డి
86. తెలంగాణ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ పేరును ఏమని మార్పు చేసింది?
    1) బీసీ సంక్షేమ శాఖ
    2) దళిత, గిరిజన అభివృద్ధి శాఖ
    3) బీసీ, దళిత సంక్షేమ శాఖ
    4) దళిత అభివృద్ధి శాఖ
87. రాష్ట్ర అధికార చిహ్నాల్లో 'కొరాషియస్ బెంగాలెన్సిస్' అనే శాస్త్రీయ నామం కలిగింది?
    1) తంగేడు 2) మచ్చల జింక
    3) పాలపిట్ట 4) సీతాఫలం
88. భౌగోళిక గుర్తింపు పొందిన గొల్లభామ చీరలు ఏ ప్రాంతానికి చెందినవి?
    1) పోచంపల్లి 2) సిద్దిపేట 3) గద్వాల 4) పెంబర్తి
89. కింది వాటిలో ఖరీఫ్ పంట కానిది?
    1) వరి 2) జొన్న 3) పత్తి 4) పైవన్నీ
90. కింది వాటిలో జయిద్ పంట కానిది?
    1) పప్పులు 2) దోస 3) టమాట 4) వరి
91. వేలాల జాతర ఏ జిల్లాలో జరుగుతుంది?
    1) వరంగల్ 2) అదిలాబాద్
    3) మహబూబ్‌నగర్ 4) నిజామాబాద్
92. రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మలో ఐదో రోజు పేర్చే బతుకమ్మని ఏమని పిలుస్తారు?
    1) అలిగిన బతుకమ్మ 2) వెన్నముద్దల బతుకమ్మ
    3) అట్ల బతుకమ్మ 4) నానబియ్యం బతుకమ్మ
93. ఒడిశా తీరంలోని వీలర్ ఐలాండ్‌కు ఏమని నామకరణం చేశారు?
    1) బిజూ పట్నాయక్ 2) హోమీ జే బాబా
    3) మహారాణి చక్రవర్తి 4) అబ్దుల్ కలాం
94. తెలంగాణలో మిషన్ భగీరథ పథకం ద్వారా మంచి నీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి కిందివాటిలో సరైనది?
    1) గ్రామాల్లో తలసరి 100 లీ.
    2) పట్టణాల్లో తలసరి 135 లీ.
    3) నగరాల్లో తలసరి 150 లీ.
    4) పైవన్నీ సరైనవే
95. కిందివాటిలో జాతీయ వారసత్వ జంతువు ఏది?
    1) పెద్దపులి 2) సింహం
    3) ఏనుగు 4) రాయల్ బెంగాల్ టైగర్
96. ల్యాండ్ ఆఫ్ థౌజండ్ ఎలిఫెంట్స్ (వెయ్యి ఏనుగుల దేశం) అని ఏ దేశాన్ని పిలుస్తారు?
    1) థాయ్‌లాండ్ 2) లావోస్
    3) స్విట్జర్లాండ్ 4) ఐవరీకోస్ట్
97. 'సంస్కారం లేని చదువు, వాసన లేని పూవు' అని వ్యాఖ్యానించింది?
    1) స్వామి వివేకానంద
    2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    3) బాలగంగాధర తిలక్
    4) మహాత్మా గాంధీ
98. దేశంలో అతిపెద్ద గ్రంథాలయమైన నేషనల్ లైబ్రరీ ఎక్కడ ఉంది?
    1) కోల్‌కతా 2) ముంబై
    3) న్యూఢిల్లీ 4) హైదరాబాద్
99. భారత్, బంగ్లాదేశ్ మధ్య నడుస్తున్న మొదటి ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్ మైత్రి కాగా, రెండోది బంధన్. ఈ రైలు ఇరు దేశాల్లోని ఏ రెండు నగరాలను కలుపుతున్నది?
    1) కోల్‌కతా-ఢాకా 2) గెడె - దోర్షోన
    3) ఖుల్నా-కోల్‌కతా 4) గెడె-ఢాకా
100. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సుమారు 18.47 లక్షల ఎకరాలు సాగులోకి రానున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుద్వారా ఏ జిల్లాలు లబ్ధిపొందనున్నాయి (పాత జిల్లాలు)?
     1) వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి
     2) వరంగల్, నిజామాబాద్, మెదక్, ఖమ్మం, నల్లగొండ
     3) వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి
     4) కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి

ANSWERS

1-1	26-4	51-3	76-4
2-3	27-2	52-4	77-2
3-4	28-1	53-1	78-3
4-3	29-3	54-3	79-4
5-2	30-4	55-4	80-2
6-2	31-2	56-1	81-4
7-2	32-4	57-3	82-4
8-3	33-3	58-2	83-3
9-1	34-1	59-1	84-3
10-3	35-3	60-4	85-2
11-3	36-2	61-1	86-4
12-1	37-3	62-2	87-3
13-4	38-4	63-4	88-2
14-4	39-2	64-3	89-4
15-4	40-1	65-1	90-1
16-2	41-2	66-2	91-2
17-3	42-3	67-3	92-3
18-4	43-2	68-2	93-4
19-4	44-1	69-3	94-4
20-3	45-4	70-2	95-3
21-4	46-2	71-4	96-2
22-2	47-1	72-2	97-4
23-3	48-3	73-1	98-1
24-1	49-2	74-4	99-3
25-4	50-4	75-4	100-3

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 19 ఫిబ్రవరి 2018



చిత్రసీమలో జయాపజయాలు దోబూచులాడుతుంటాయి. కొన్ని సినిమాల విషయంలో విజయం ఖాయమనే ధీమాతో ఉంటారు అభిమానులు. కథానాయకుల వ్యక్తిగత ఇమేజ్, దర్శకుడు, సాంకేతిక నిపుణుల ప్రతిభాపాటవాలు, నిర్మాణ సంస్థల ప్రమాణాలు.. వెరసి సదరు సినిమాలు గ్యారెంటీగా హిట్ కొడతాయని భావిస్తుంటారు. ఇక మరి కొన్ని చిత్రాలేమో నిర్మాణదశ నుంచి ప్రచార ఆర్భాటానికి దూరంగా వుంటాయి. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై సైలెంట్ హిట్స్‌గా సంచలనం సృష్టిస్తుంటాయి. సినిమాల విషయంలో ప్రేక్షకుల నాడీని పట్టుకోవడం అంత సులభం కాదు. అంచనాల్ని తలక్రిందులు చేస్తూ వారు ఫలితాల్ని అందిస్తుంటారు. నవ్యమైన కథలకు మాత్రం ఎప్పుడూ బ్రహ్మరథం పడతారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు విడుదలై అనూహ్యంగా పరాజయంపాలైన చిత్రాలు, అదే సమయంలో ఎలాంటి అంచనాలు లేకుండా ప్రేక్షకులముందుకొచ్చి అద్భుత విజయాన్ని అందుకున్న సినిమాలపై కథనమిది...

అంచనాలు తారుమారు


'భాగమతి' చిత్రంలో అనుష్క


'ఛలో' చిత్రంలో నాగశౌర్య, రష్మిక


'తొలిప్రేమ'లో వరుణ్‌తేజ్, రాశీఖన్నా

తెలుగు పరిశ్రమ ఈ ఏడాది శుభారంభానికి నోచుకోలేదు. సంక్రాంతి బరిలో తొలుత ప్రేక్షకులముందుకొచ్చిన 'అజ్ఞాతవాసి' పరాజయం ఇటు ప్రేక్షకులకు , అటు పరిశ్రమ వర్గాలకు ఓ శరాఘాతంలా తాకింది. పవన్‌కల్యాణ్-త్రివిక్రమ్ ద్వయానికి ఉన్న క్రేజ్‌తో ఈ సినిమాపై అంచనాలు అంబరాన్నంటాయి. టీజర్ మొదలుకొని పాటల వరకు సోషల్‌మీడియాలో సరికొత్త ట్రెండ్‌ను సృష్టించాయి. దాంతో 'అజ్ఞాతవాసి' గత రికార్డులన్నింటిని చెరిపివేస్తుందని ఊహించారు. ప్రాంతీయంగా 'బాహుబలి' కలెక్షన్లను కూడా అధిగమిస్తుందని భావించారు. కానీ ఈ సినిమా ఫలితం ట్రేడ్ వర్గాల్ని విస్మయపరచింది. అంచనావేసిన కలెక్షన్లలో సగం కూడా వసూలు చేయలేకపోయింది. అభిమానుల్ని నిరుత్సాహానికి గురిచేస్తూ పవన్‌కల్యాణ్-త్రివిక్రమ్ కెరీర్‌లో 'అజ్ఞాతవాసి' చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది.

కథానాయకుల్ని బలమైన పాత్రల్లో శక్తివంతంగా ఆవిష్కరించడంలో సిద్ధహస్తుడని దర్శకుడు వినాయక్‌కు పేరుంది. గత ఏడాది చిరంజీవి 'ఖైదీ నంబర్ 150'తో సత్తాచాటారాయన. మెగా హీరోలతో వినాయక్ చేసిన సినిమాలన్ని మంచి విజయాల్ని సొంతం చేసుకున్నాయి. సాయిధరమ్‌తేజ్-వినాయక్ కలయికలో తొలిసారిగా వచ్చిన 'ఇంటిలిజెంట్' మెగాభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. వ్యవస్థపై తిరుగుబాటు చేసి అన్యాయాల్ని సరిదిద్దే యువకుడు ఇతివృత్తమని దర్శకుడు చెప్పడంతో మాస్‌కు సినిమా బాగా రీచ్ అవుతుందని అనుకున్నారు. కానీ 'ఇంటిలిజెంట్' వినాయక్ కెరీర్‌లోనే అతిపెద్ద పరాజయంగా మిగిపోయింది. రొటీన్ ఫార్ములా, బలహీన కథ, కథనాలతో ఈ చిత్రం ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచింది.

గత ఏడాది 'రాజా ది గ్రేట్'తో తిరిగి విజయాల బాటపట్టారు రవితేజ. నూతన దర్శకుడు విక్రమ్ సిరికొండతో ఆయన చేసిన'టచ్‌చేసి బాక్సాఫీస్ వద్ద చతికిలపడింది. గతంలో రచయితగా రాణించిన విక్రమ్ సిరికొండ దర్శకుడిగా పరిచయం కావడం, వక్కంతం వంశీ కథనందించడంతో ఈ సినిమా విజయం ఖాయమనుకున్నారు. ముఖ్యంగా రవితేజ పోలీస్ పాత్రలో కనిపించిన సినిమాలన్ని హిట్టే అన్న సెంటిమెంట్ కూడా వినిపించింది. అయితే బాక్సాఫీస్ వద్ద అనూహ్య రీతిలో ఈ సినిమా బోల్తాకొట్టింది. కథలో కొత్తదనం లేకపోవడం, రవితేజ శైలి మెరుపులులోపించడం, కథావిష్కరణలో నవ్యతలేమితో ప్రేక్షకుల్ని ఉసూరుమనిపించింది. అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ సంస్థ రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నిర్మించిన 'రంగులరాట్నం' కూడా ప్రేక్షకుల్ని నిరాశపరచింది. ఇక ఇటీవలకాలంలో ప్రచారపరంగా అందరి దృష్టిని ఆకర్షించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. అగ్రహీరో మహేష్‌బాబు సోదరి మంజుల ఈ సినిమాకు దర్శకత్వం వహించడం, మహేష్ స్వయంగా వాయిస్‌ఓవర్ చెప్పడంతో ఈ సినిమా గురించి ప్రేక్షకులు ఆసక్తిగా చర్చించుకున్నారు. ప్రకృతి, ప్రేమ అంశాల కలబోతగా ఈ సినిమా కాన్సెప్ట్ ఉంటుందని చెప్పడంతో ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ అవుతుందని భావించారు. అయితే ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. కథకు ప్రేక్షకులు కనెక్ట్ కాలేకపోవడంతో నిరాశచెందారు. 'అజ్ఞాతవాసి' 'ఇంటిలిజెంట్' 'టచ్ చేసి చూడు' 'మనసుకు నచ్చింది' చిత్రాలు ఈ ఏడాదిలో ప్రేక్షకుల అంచనాల్ని పూర్తిగా తారుమారు చేశాయి.


'టచ్ చేసి చూడు'లో రాశీఖన్నా, రవితేజ

ఫర్వాలేదనిపించాయి..

బాలకృష్ణను సంక్రాంతి కథానాయకుడిగా అభివర్ణిస్తుంటారు. పండగ బరిలో నిలిచిన ఆయన చిత్రాలన్ని అధికశాతం విజయాల్ని సాధించాయి. ఈ ఏడాది ఆయన 'జై సింహా'తో ప్రేక్షకులముందుకొచ్చారు. దర్శకుడు కె.ఎస్.రవికుమార్, బాలకృష్ణ కలయికలో సినిమా కోసం గత ఏడేళ్లుగా ప్రయత్నాలు జరిగాయి. చివరకు 'జై సింహా' రూపంలో వారి కాంబినేషన్ కార్యరూపం దాల్చింది. 'సింహా' తర్వాత బాలకృష్ణతో నయనతార జతకట్టడం ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. కుటుంబ భావోద్వేగాలు ప్రధానంగా తనదైన శైలి మాస్ అంశాలతో దర్శకుడు కె.ఎస్.రవికుమార్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని అంచనా వేశారు. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లను రాబట్టలేకపోయింది. ఓ మోస్తరు కలెక్షన్లతో ఫర్వాలేదనిపించింది. ఇక రెండేళ్ల విరామం తర్వాత మోహన్‌బాబు 'గాయత్రి' సినిమాలో నటించారు. ఆయన శివాజీ, గాయత్రిపటేల్‌గా ద్విపాత్రాభినయం చేశారు. వినూత్న కథా చిత్రాలకు పెట్టింది పేరైన మదన్ దర్శకత్వం చేశారు. ఈ సినిమాలో మోహన్‌బాబు నటవిశ్వరూపాన్ని ప్రదర్శించారు. మోహన్‌బాబు వన్‌మెన్‌షోగా సినిమాను నడిపించారు. ఆయన ఇమేజ్ ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించింది. అయితే వాణిజ్యపరంగా మధ్యస్థమైన ఫలితాల్ని నమోదు చేసుకుందీ చిత్రం.


'ఇంటిలిజెంట్'లో సాయిధరమ్‌తేజ్

అంచనాలకు మించి...

'భాగమతి' 'తొలిప్రేమ' 'ఛలో' చిత్రాలు అంచనాలకు మించిన ఫలితాలతో బాక్సాఫీస్‌ను పరుగులుపెట్టించాయి. ప్రస్తుతం ఈ చిత్రాలు చక్కటి కలెక్షన్లతో దూసుకుపోతున్నాయి. 'బాహుబలి' సిరీస్ తర్వాత అనుష్క 'భాగమతి' చిత్రంలో నటించింది. అయితే చిత్ర దర్శకుడు అశోక్ గత చిత్రాలు కొన్ని ఫెయిల్‌కావడం, సినిమా విడుదల ఆలస్యం కావడం, టీజర్ అంత ఉత్సుకతను రేకెత్తించకపోవడంతో సినిమా ఫలితం ఎలా వుంటుందోనని అనుకున్నారు. అందరి అంచనాల్ని తలక్రిందులు చేస్తూ మహిళా ప్రధాన ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రం యాభైకోట్ల మైలురాయిని అధిగమించింది. కమర్షియల్‌గా అనుష్క స్టామినా ఏమిటో తెలియజేసింది. ఇక వరుణ్‌తేజ్ నటించిన 'తొలిప్రేమ' ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైంది. 'ఫిదా' వంటి హృద్యమైన ప్రేమకథా చిత్రం తర్వాత వరుణ్‌తేజ్ మరోసారి లవ్‌స్టోరీనే ఎంచుకోవడం, దర్శకుడు వెంకీ అట్లూరి కొత్త కావడంతో విజయావకాశాల్ని ఎవరూ అంచనా వేయలేకపోయారు. అయితే ఈ సినిమా అందరి ఊహలకు భిన్నంగా పెద్ద విజయం దిశగా పయనిస్తున్నది. మనసుల్ని


'జై సింహా'లో నయనతార, బాలకృష్ణ

తడిమే చక్కటి ఇతివృత్తంతో, ప్రేమభావనలకు అందమైన దృశ్యరూపంలా ఈ సినిమా యువ హృదయాల్ని ఆకట్టుకుంటున్నది. 'తొలిప్రేమ' వరుణ్‌తేజ్ కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచిపోయింది. ఇక 'ఛలో' చిత్రం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కెరీర్ ఆరంభం నుంచి జయాపజయాలకు అతీతంగా విభిన్న కథాంశాల్ని ఎంచుకుంటున్న నాగశౌర్య మరో ప్రేమకథా చిత్రం 'ఛలో'తో అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. గతకొంతకాలంగా ఆయనకు సక్సెస్‌లు లేకపోవడంతో ఈ సినిమా విజయంపై ఎవరూ అంచనాలు లేకుండా వున్నాయి. నాగశౌర్య తల్లిదండ్రులు ఉషా, శంకరప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరించారు. వెంకీ కుడుముల దర్శకుడిగా పరిచయమయ్యారు. కన్నడ 'కిరిక్‌పార్టీ'తో దక్షిణాదిన సంచలనంగా మారిన రష్మిక మందన కథానాయిక నటించింది. గిలిగింతలు పెట్టే హాస్యం, కథావిష్కరణలో నవ్యత...ఉన్నత నిర్మాణ విలువలు వెరసి ఈ సినిమా ప్రేక్షకాదరణ చూరగొంటున్నది. నాని నిర్మించిన 'అ!' ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది. ఎక్స్‌ప్రెజనిజమ్ అనే విభిన్న కథారీతితో సినీ ప్రేమికుల్ని అలరిస్తున్నది. అయితే ఈ సినిమా కమర్షియల్ ఫలితమేమిటో మరికొన్ని రోజుల్లో వెల్లడవుతుంది.

కథలోని నవ్యతకే పెద్దపీట

ఇటీవలకాలంలో పరాజయం పాలైన సినిమాల్ని పరిశీలిస్తే కథలో నవ్యత లేకపోతే అగ్రహీరోల ఇమేజ్, భారీ నిర్మాణవిలువలు సినిమాల్ని ఏమాత్రం రక్షించలేవన్న నిజం తేటతెల్లమవుతున్నది. సరికొత్త ఇతివృత్తాలు, కథావిష్కరణలో వైవిధ్యానికే ప్రేక్షకులు పెద్దపీట వేస్తున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుంటే దర్శకనిర్మాతలు నాణ్యమైన చిత్రాల రూపకల్పనకు పూనుకునే అవకాశం ఉంటుంది.

మెకానిక్ పాత్రలో?


మహేష్‌బాబు

'స్పైడర్' ఫలితం తరువాత సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు మహేష్‌బాబు. ఆయన ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'భరత్ అనే నేను' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకున్నది. ఏప్రిల్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తరువాత వంశీపైడిపల్లి దర్శకత్వంలో దిల్‌రాజు, సి.అశ్వనీదత్ సంయుక్తంగా నిర్మించనున్న సినిమాకు మహేష్‌బాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది పూర్తయిన వెంటనే 'అర్జున్‌రెడ్డి' చిత్రంతో పాపులర్ అయిన సందీప్ రెడ్డి వంగ రూపొందించనున్న చిత్రాన్ని మహేష్ పట్టాలెక్కించనున్నట్లు తాజా సమాచారం. సరికొత్త నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో మహేష్‌బాబు మెకానిక్‌గా కనిపించనున్నట్లు తెలిసింది. మహేష్ బాడీలాంగ్వేజ్‌కు తగ్గట్లుగా ఆయన పాత్రను దర్శకుడు సందీప్‌రెడ్డి వంగ తీర్చిదిద్దారని, అది హీరో మహేష్‌కు కూడా బాగా నచ్చిందని చెబుతున్నారు. కాగా ఈ చిత్రాన్ని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్నట్లు సమాచారం.

ప్రేమానుబంధాల సాక్షిగా


బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్నారు. మే 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ప్రేమికుల రోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభించింది. ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాం. పంచభూతాల అండతో తన గమ్యాన్ని చేరుకున్న ఓ యువకుడి కథ ఇది. అతడి లక్ష్యసాధనకు ప్రకృతి ఎలా తోడ్పడిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. పీటర్ హెయిన్స్ నేతృత్వంలో డూప్ లేకుండా బెల్లంకొండ శ్రీనివాస్‌పై చిత్రీకరించిన పోరాట ఘట్టాలు చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి. హీరో, హీరోయిన్‌ల కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. త్వరలో చివరి షెడ్యూల్ కోసం అమెరికా వెళ్లనున్నాం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని మే 11న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందకు తీసుకొస్తాం' అని తెలిపారు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెలకిషోర్, జయప్రకాష్, పవిత్రాలోకేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్, మాటలు: సాయిమాధవ్‌బుర్రా, సినిమాటోగ్రఫీ: ఆర్థర్ ఏ విల్సన్.

దయ్యాలతో సినిమా తీస్తే..!


శ్రీమిత్రచౌదరి, నాని, విజయ్, శ్రీకాంత్, తరుణ్, షకీల్

'హారర్ కథాంశంతో నేను చేస్తున్న తొలి ప్రయత్నమిది. ఇదివరకు తెలుగు తెరపై చాలా హారర్ సినిమాలు వచ్చినా ఈ కథ మాత్రం వాటికి భిన్నంగా సరికొత్తగా ఉంటుంది. మనుషులకు, దయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలతో ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగుతుంది' అని అన్నారు శ్రీకాంత్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రా రా'. విజిచెర్రీష్ దర్శకుడు. విజయ్ నిర్మాత. నజియా కథానాయిక. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన హీరో నాని మాట్లాడుతూ 'నా తొలి చిత్రం 'అష్టాచమ్మా' నుంచి శ్రీకాంత్‌తో పరిచయముంది. హారర్ కథాంశంతో ఆయన చేస్తున్న ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'శ్రీకాంత్ నటిస్తున్న 125వ సినిమా ఇది. హారర్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందించాం. దయ్యాల కారణంగా ఓ సినీ దర్శకుడికి ఎదురయ్యే కష్టాలు నవ్విస్తాయి. ఈ నెల 23న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని దర్శకుడు చెప్పారు. వినోదాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని ఈ సినిమా మెప్పిస్తుందని నిర్మాత చెప్పారు. ఈ కార్యక్రమంలో తరుణ్, అలీ, రఘుబాబు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో అధ్యయనం



- వేసవిలో వన్యప్రాణులకు నీటిఎద్దడి లేకుండా చర్యలు
- ఈ నెల 24, 25 తేదీల్లో అభయారణ్యాల్లో సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా అడవుల్లో పులులు, వన్యప్రాణుల గణన విజయవంతంగా పూర్తిచేసిన అటవీశాఖ మరో కసరత్తుకు సిద్ధమైంది. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో వన్యప్రాణులకు అడవుల్లో నీటి వసతిపై ఆ శాఖ దృష్టి పెట్టింది. సహజంగా ఉన్న నీటివనరులను కాలుష్యం నుంచి కాపాడుతూనే, అడవి జంతువులకు వీలైనంత సమీపంలో తాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 24, 25 తేదీల్లో రెండురోజులపాటు అడవుల్లో నీటి వసతిపై సర్వే చేయనున్నారు. అటవీ అధికారులు, సిబ్బందితోపాటు పులుల జనగణనలో పాల్గొన్న వాలంటీర్లను కూడా భాగస్వామ్యం చేయనున్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులతోపాటు, రక్షిత అడవులు, ఏటూరునాగారం, కిన్నెరసాని, పోచారం అభయారణ్యాల్లో సర్వే చేపడుతారు. ఆయా ప్రాంతాల్లోని సహజవనరులు, నీటిలభ్యత, నీటిస్వచ్ఛత, జలకాలుష్యం, సమీపంలోని జనావాసాల వివరాలతోపాటు ఇటీవల జంతువులకు, మనుషులకు మధ్య ఏమైనా ఘర్షణలు జరిగాయా? తదితర అంశాలను ఆరాతీయనున్నారు. జంతువులు సంచరించే ప్రాంతానికి ఎంత దూరంలో నీటివసతి ఉన్నది? ప్రత్యామ్నాయంగా కృత్రిమ నీటి వసతి ఎన్నిచోట్ల అవసరం? అన్న విషయాలను రెండురోజుల సర్వేలో నమోదుచేస్తారు. దీని ఆధారంగా వెంటనే చర్యలు చేపట్టి అడవుల్లో జంతువులకు నీటివసతి కల్పించడంపై కార్యాచరణ రూపొందించనున్నారు.



నీటి కొరత లేకుండా చర్యలు
మంత్రి జోగురామన్న

వేసవిలో నీటిఎద్దడి వల్ల, జంతువులు అడవి నుంచి బయటకు రావడం, ప్రమాదాలకు గురికావడం, వేటగాళ్ల బారినపడే అవకాశం ఉన్నందున వీలైనంతవరకు అడవిలోనే నీటివసతికి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకొంటామని అటవీశాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. అటవీశాఖ సిబ్బందితోపాటు వాలంటీర్లను ఉపయోగించుకొని అన్ని అటవీప్రాంత బీట్లవారీగా సర్వేచేస్తామని పేర్కొన్నారు. అడవుల్లోని జనావాసాల్లో నివసిస్తున్నవారి దగ్గరికెళ్లి వేసవిలో జంతువుల రక్షణ చర్యలు వివరిస్తామన్నారు. ప్లాస్టిక్ కారణంగా అడువుల్లో వ్యర్థాలు పేరుకుపోయి.. నీరు, పర్యావరణం కలుషితమై అడవి జంతువులకు వాటిల్లుతున్న ముప్పును నివారించేందుకు చర్యలు తీసుకొంటామని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డన్ పీకే ఝా వెల్లడించారు. అటవీచట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

రక్షణరంగంలో గైడెన్స్ టెక్నాలజీ కీలకం

- డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ క్రిస్టోఫర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రక్షణరంగంలో నియంత్రణ, గైడెన్స్ టెక్నాలజీ కీలకమైనవని డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ ఎస్ క్రిస్టోఫర్ చెప్పారు. ఆదివారం డీఆర్డీవో (డిఫెన్స్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో మూడో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆటోమెటిక్ కంట్రోల్ (ఐఎఫ్ఏసీ), ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్స్‌డ్ ఇన్ కంట్రోల్ , ఆప్టిమైజేషన్ ఆఫ్ డైనమికల్ సిస్టమ్స్ (ఏసీఓడీఎస్) సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రిస్టోఫర్ మాట్లాడుతూ.. ఏరోస్పేస్, రక్షణ కార్యక్రమాల అవసరాలను తీర్చడానికి వినూత్న మార్గనిర్దేశక పథకాలు అమలుచేయాలని కోరారు. రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలను మరింత సమన్వయపర్చేందుకు అకాడమీ పరిశ్రమ అనుసంధానానికి ప్రయత్నించాలని చెప్పారు. భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా కొత్త ఎయిర్‌క్రాఫ్ట్స్, మిస్సైల్స్ తయారీకి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఫ్రాంక్ అల్‌గోవేర్, ఇండియన్ నేషనల్ అకాఫ్ ఇంజినీరింగ్ బీఎన్ సురేశ్ , డీఆర్డీఎల్ డైరెక్టర్ ఎంఎస్ఆర్ ప్రసాద్, ఏఎస్ఎల్ డైరెక్టర్ డాక్టర్ టెస్సీ థామస్ , డైరెక్టర్ ఆర్‌సీఐ నారాయణమూర్తి, ఏసీవోడీఎస్ ఇండియా అధ్యక్షుడు ప్రొఫెసర్ రామ్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చివరిదశలో రైతు సమన్వయ సమితుల ఏర్పాటు

- మూడు జిల్లాలు మినహా అన్నింటా పూర్తి
- త్వరలో సీఎం చెంతకు జిల్లాల జాబితా
- రెండు మూడు రోజుల్లో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయాన్ని వ్యవస్థీకృత రంగంగా మార్చాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టిన రైతు సమన్వయ సమితుల ఏర్పాటు చివరిదశకు చేరింది. ఇప్పటికే గ్రామ, మండలస్థాయి కమిటీల నియామకాలు పూర్తయ్యాయి. జిల్లాస్థాయి రైతు సమన్వయ సమితుల ఏర్పాటు పూర్తికావొచ్చింది. ఏర్పాటుకాని జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు వేగంగా పనులు జరుగుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో ఆయా జిల్లాల్లో సమితుల ఏర్పాట్లు పూర్తి కానున్నాయి. పూర్తికాగానే రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. వ్యవసాయశాఖకు చేరిన జిల్లా రైతు సమన్వయ సమితుల జాబితాను పరిశీలించిన అనంతరం సీఎం కేసీఆర్ కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు చైర్మన్ నియామకంపై నిర్ణయం తీసుకోనున్నారు. 42 మంది సభ్యులతో కార్పొరేషన్ ఉండబోతున్నది. దీనిలో జిల్లాల రైతు సమన్వయ సమితిసభ్యులతోపాటు వ్యవసాయరంగంలో నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారులు, మంత్రులకు చోటుకల్పించే అవకాశం ఉన్నది.

సహజసిద్ధమైన ఆహారంతోనే ఆరోగ్యం

- కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి శ్రీపాద్ యశోనాయక్
- ముగిసిన నేషనల్ నేచురల్ ఫుడ్ ఫెస్టివల్



ఆదివారం హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఆరోగ్య నియమాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి శ్రీపాద్ యశోనాయక్, రాష్ట్ర మంత్రి లక్ష్మారెడ్డి, భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, సంప్రదాయ సిద్ధమైన ప్రకృతి, యోగా వైద్యాన్ని అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి శ్రీపాద్ యశోనాయక్ పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి పుణె, కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ, తెలంగాణ ఆయుష్ విభాగం, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ నేచురల్ ఫుడ్ ఫెస్టివల్ జరిగింది. ఆదివారం ఫెస్టివల్ ముగింపు సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీపాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సహజసిద్ధమైన ఆహార పదార్థాలతోనే ఆరోగ్యం నిలకడగా ఉంటుందని చెప్పారు. తెలంగాణలోని సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ సేవలు విస్తృతం చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి డైరెక్టర్ కే సత్యలక్ష్మి, తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, సినీనటి ఝాన్సీ, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయుష్, నేచురోపతి విభాగాల వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ స్టాళ్లకు కేంద్రమంత్రి అవార్డులు అందజేశారు. జాతీయ ఫుడ్ ఫెస్టివల్ సావనీర్, ఆరోగ్య నియమాల పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

11 దేశాల్లో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



టీఆర్ఎస్ డెన్మార్క్ శాఖ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న ఆశాఖ అధ్యక్షుడు శ్యామ్‌బాబు ఆకుల తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు వేడుకలను తూర్పుయూరప్‌లోని 11 దేశాల్లో ఘనంగా నిర్వహించారు. డెన్మార్క్, ఫిన్లాండ్, స్వీడన్, నార్వే, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, పోలాండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ దేశాల్లో కేక్‌కట్‌చేసి జన్మదిన వేడుకలు జరిపినట్టు టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆదివారం మీడియాకు తెలిపారు. ఐర్లాండ్‌తోపాటు, పలు దేశాల్లోని తెలంగాణవాదులు సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారని చెప్పారు. విదేశాల్లో, తెలంగాణలో ఎన్నారైశాఖల కోఆర్డినేటర్లు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు వెల్లడించారు. టీఆర్ఎస్ డెన్మార్క్ అధ్యక్షుడు శ్యామ్‌బాబు ఆకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రసాద్‌రావు కల్వకుంట్ల, ఐరెడ్డి సందీప్‌రెడ్డి, గడ్డంవార్ మహేందర్‌శర్మ, వైవీ శ్రీనివాస్, మేడిపల్లి వివేక్‌రెడ్డి, శ్రీధర్ గండే, మహేందర్ బొజ్జ, అరవింద్‌బాబు, వినయ్‌బండారి, ఫణిరామ్, నీలాస్ శ్రీనివాస్, మూర్తికర్ర, కపిల్ మగ్గిడి పాల్గొన్నారు.



టీఆర్ఎస్ స్విట్జర్లాండ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు, వారి కుటుంబసభ్యులు

మహారాష్ట్రలో పసుపు క్షేత్రాల సందర్శన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సోంకేడ్‌లో ఎకరానికి 300 క్వింటాళ్ల దిగుబడిని సాధించిన పసుపు రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. అక్కడి రైతు లక్ష్మీపతి దేశ్‌ముఖ్ పసుపు సాగులో అనుసరిస్తున్న వినూత్న పద్ధతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో క్షేత్రాలను పరిశీలించారు.

ఆత్మీయ బంధువులా..
షాదీ ముబారక్



మూడున్నరేండ్లలో 76 వేల మందికి ఆర్థికసాయం.. గ్రీన్ చానెల్ ద్వారా రూ.408 కోట్ల నిధులు విడుదల.. రూ.51 వేల నుంచి రూ.75,116కు పెరిగిన సాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నిరుపేద మైనారిటీ యువతులను షాదీముబారక్ పథకం ఆర్థికంగా ఆదుకుంటున్నది. వారికి ఆపద్బంధువులా నిలిచింది. ఎంతోమంది ఆ వర్గ మహిళలకు ఈ పథకం అండగా నిలిచి కొండంత ధైర్యాన్నిస్తున్నది. తెలంగాణ సర్కార్ వచ్చిన తర్వాత ప్రారంభమైన షాదీముబారక్ ద్వారా సుమారు 76 వేల మంది మైనారిటీ పేద మహిళలు ప్రయోజనం పొందడమే ఇందుకు నిదర్శనం. ఈ సంఖ్య కూడా 2017 డిసెంబర్ 31 నాటిదే. గత నెలన్నర రోజుల్లో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగిందని అధికారికవర్గాలు తెలిపాయి. పేద మైనారిటీ యువతుల వివాహాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదనే ఉద్దేశం, లక్ష్యంతో సహాయం అందించడానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు షాదీముబారక్ పథకాన్ని తీసుకొచ్చారు. గ్రీన్ చానెల్ ద్వారా బడ్జెట్ కేటాయించి నిధులు విడుదలలో జాప్యం జరుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద మైనారిటీ యువతుల వివాహాల సమయంలో తొలుత రూ.15 వేలు, అనంతరం రూ.25 వేల విలువ చేసే సామగ్రి అందించే వారు. అది కూడా చాలా తక్కువ మందికి లభించేది. పైగా వివాహాలు సామూహికంగా ఒకే వేదికపై నిర్వహించేవారు. చాలామంది ముస్లిం కుటుంబాలకు ఈ విధానం నచ్చకపోయేది.

2014 నుంచి షాదీ ముబారక్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎస్సీ, ఎస్టీలకు అమలుచేసే కల్యాణలక్ష్మి తరహాలో మైనారిటీవర్గాలకు షాదీ ముబారక్ పథకాన్ని 2014 అక్టోబర్ రెండున టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద మైనారిటీ యువతి వివాహ సమయంలో రూ.51 వేలు నగదు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం తొలి ఏడాది 2014-15లో ఈ పథకాన్ని గ్రీన్ చానెల్‌లో చేర్చి రూ.100 కోట్ల నిధులు కేటాయించింది. తొలి ఏడాది నియమ నిబంధనలు, విధి విధానాలు, సిబ్బంది అక్రమాలు, పలు సమస్యల కారణంగా ఊహించిన స్థాయిలో ఈ పథకానికి అర్హుల ఎంపిక జరుగలేదు. దీంతో ఆ ఏడాది కేవలం 5779 మందికి రూ.29.54 కోట్ల నిధులు విడుదలయ్యాయి. అనంతరం షాదీ ముబారక్ పథకంలో కొన్నిమార్పులు, పారదర్శకంగా అమలుచేయడానికి ప్రభుత్వం విధానాల్లో మార్పులు తీసుకురావడంతో రెండో ఏడాది నుంచి ఈ పథకానికి అపూర్వ స్పందన వచ్చింది. ఆర్థికసాయాన్ని కూడా రూ.51 వేల నుంచి రూ.75,116కు పెంచారు. ఇందుకోసం 2016-17 నుంచి నిధుల కేటాయింపును రూ.150 కోట్లకు పెంచి గత మూడున్నరేండ్లుగా నిధులను విడుదల చేస్తున్నది. 2014 అక్టోబర్ 2 నుంచి 2017 డిసెంబర్ 31 వరకు ప్రభుత్వం షాదీ ముబారక్ పథకానికి మొత్తం రూ.500 కోట్లు కేటాయించి దానిలో రూ.408.55 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా 75,627 మంది నిరుపేద మైనారిటీ యువతులకు ఆర్థికసాయం లభించింది. తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిన షాదీ ముబారక్ పథకం పట్ల మైనారిటీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్థిక సంవత్సరం	కేటాయించిన బడ్జెట్ (రూ. కోట్లలో)	చేసిన ఖర్చు (రూ. కోట్లలో)	లబ్ధిదారుల సంఖ్య
2014-15	100.00	29.54	5,779
2015-16	100.00	140.01	27,453
2016-17	150.00	119.96	23,522
2017-18	150.00	119.04	18,873
(31-12-17) వరకు			
మొత్తం	500.00	408.55	75,627

ప్రత్యేక రాష్ట్రంలో హజ్ బడ్జెట్ రెట్టింపు

- ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ
- వాహెద్‌నగర్‌లో హజ్‌యాత్రికుల మొట్టమొదటి శిక్షణ శిబిరం

హైదరాబాద్/మలక్‌పేట, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో రూ.కోటిన్నర ఉన్న హజ్ బడ్జెట్‌ను, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం రూ.3 కోట్లకు పెంచిందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకోసం అన్ని సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లోని పాత మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్‌లో ఏర్పాటుచేసిన హజ్ యాత్రికుల మొట్టమొదటి శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు హజ్ యాత్రికుల కోసం సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల మాట్లాడుతూ హజ్‌యాత్ర ఎంతో పవిత్రమైందని, హజ్‌కు వెళ్లే యాత్రికులు రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించాలని కోరారు. హజ్ యాత్రికులకోసం దేశంలో ఏ రాష్ట్రంలో తీసుకోని చొరువను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని సకల వసతులు కల్పిస్తుందని రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ మహ్మద్ మసి ఉల్లాఖాన్ పేర్కొన్నారు. హజ్‌కమిటీ ఈవో ప్రొఫెసర్ ఎస్ఏ షకూర్ మాట్లాడుతూ రాష్ట్రంనుంచి మొత్తం 17,130 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో హైదరాబాద్ నుంచి అత్యధికంగా 10908 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. యాత్రికుల కోసం రూ.3 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిన ప్రభుత్వం ఇప్పటికే రూ.2.40 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ రషీద్ తల్హా నౌమానీ, మౌలానా అబ్బాస్ జకీ, హజ్‌కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని పాత మలక్‌పేటలో హజ్ యాత్రికుల శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ మహ్మద్ మసి ఉల్లాఖాన్ ఉన్నారు

ఏపీకి అన్యాయం ఎక్కడ జరిగింది?

- టీడీపీ విమర్శలకు సమాధానం చెబుతాం: ఎంపీ కంభంపాటి

అమరావతి, నమస్తే తెలంగాణ: కేంద్రబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందన్న టీడీపీ, వైసీపీ విమర్శలను తిప్పికొడతామని ఏపీ బీజేపీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు స్పష్టంచేశారు. విభజన హామీలపై ప్రజల ఆందోళన, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని అన్ని హామీలను అమలుపరుస్తున్నామని, దుగరాజపట్నం, కడప స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వేజోన్ వంటి కొన్ని అంశాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూలోటు భర్తీకోసం కేంద్రం రూ.4 వేలకోట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిధులపై బహిరంగచర్చకు సిద్ధం: సోమువీర్రాజు

కేంద్రం ఏపీకి ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమని భాజపా ఎమ్మెల్సీ సోమువీర్రాజు టీడీపీకి సవాలు విసిరారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడతూ అమరావతికి ఢిల్లీ తరహాలో అభివృద్ధి నిధులిచ్చామన్నారు.

కేంద్రంపై అవిశ్వాసం పెడితే టీడీపీకి మద్దతిస్తాం

- ఏపీ ప్రతిపక్షనేత జగన్ సంచలన ప్రకటన

అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీకి ఇచ్చిన ప్యాకేజీని పక్కనపెట్టి ప్రత్యేకహోదా కోసం కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడితే టీడీపీకి తాము మద్దతు ఇస్తామని వైసీపీ అధినేత, ఏపీ ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఏపీలోని ప్రకాశం జిల్లాలో 91వ రోజు ప్రజాసంకల్ప యాత్రలో ఆదివారం కందుకూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్రానికి మంచి జరుగుతుందంటే కేంద్రంపై అవిశ్వాసం పెట్టడానికి తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని, మీరు సిద్ధమా అని జగన్ టీడీపీకి సవాల్ విసిరారు.

పురుషోత్తంరెడ్డి కస్టడీపై వాదనలు నేడు




- నేడు అజ్ఞాతం వీడనున్న శ్రీనివాస్‌రెడ్డి!
- అతడి ఇంట్లో సోదాలు నిర్వహించే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి (సస్పెన్షన్) విచారణ నిమిత్తం ఏసీబీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై సోమవారం కోర్టులో వాదనలు జరుగనున్నాయి. పురుషోత్తంరెడ్డిని విచారిస్తే ఆయనకు సంబంధించి మరిన్ని ఆస్తులు బయటపడుతాయని ఏసీబీ భావిస్తున్నది. పురుషోత్తంరెడ్డికి సంబంధించిన ఇద్దరు బినామీల కస్టడీ కూడా సోమవారం ముగియనున్నది. ఏసీబీ అధికారులకు సహకరించాలని న్యాయస్థానం ఆదేశించడంతో పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి కూడా సోమవారం అజ్ఞాతం నుంచి బయటకు వచ్చే అవకాశం ఉన్నదని తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి ఇంటిని ఏసీబీ అధికారులు సోదా చేసే అవకాశం ఉంది. పురుషోత్తంరెడ్డిని వారంరోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ దాఖలుచేసిన పిటిషన్‌పై ఆయన తరఫు న్యాయవాదులు సోమవారం కౌంటర్ దాఖలు చేయనున్నారు. ఏసీబీ పిటిషన్, నిందితుడి తరఫు కౌంటర్ పిటిషన్‌పై వాదనలు జరుగుతాయి. ఈ కేసులో బినామీలుగా ఉన్న నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిని మూడో రోజు ఆదివారం కూడా విచారించారు. వారి కస్టడీ సోమవారంతో ముగియనున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారి యాదవరెడ్డికి నగర శివారుల్లో ఉన్న వెంచర్లు, నగరంలో ఉన్న బహుళ అంతస్థుల భవనాల్లో పురుషోత్తంరెడ్డి వాటా శాతం, పెట్టుబడులపై విచారించినట్టు తెలిసింది. పురుషోత్తంరెడ్డితో కలిసి చేస్తున్న వ్యాపార లావాదేవీలు, ఆదాయ వనరులు, బ్యాంకు లావాదేవీలు, డాక్యుమెంట్లను కూడా పరిశీలించడంతోపాటు ఇద్దరు బినామీలను వేర్వేరుగా విచారిస్తున్నట్టు సమాచారం. పురుషోత్తంరెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో అతడి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్ర పోషించినట్టు ఏసీబీ అనుమానిస్తుంది. కేసు నమోదైన సమయం నుంచి అతడు అజ్ఞాతంలో ఉండటంతో ఏసీబీ అనుమానాలకు బలం చేకూరింది. ఎస్ఆర్‌నగర్‌లో ఉన్న అతడి ఇంటిని సోదా చేస్తే మరింత సమాచారం లభించే అవకాశం ఉందని భావించిన ఏసీబీ.. కుటుంబసభ్యులతోపాటు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఇంటిని సీజ్ చేశారు. తనను ఏసీబీ అధికారులు వేధిస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి తరఫు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేయగా ఏసీబీ విచారణకు సహకరించాలని అతడిని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అజ్ఞాతం నుంచి బయటకు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. శ్రీనివాస్‌రెడ్డి వస్తే అతడికి ఇంట్లో సోదాలు చేసేందుకు ఏసీబీ అధికారులు సమాయత్తమవుతున్నారు. పురుషోత్తంరెడ్డి కుటుంబసభ్యులు కూడా బయటకు రాలేదు. వాళ్లు వస్తే వారి ఇంటిని కూడా తనిఖీలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. పురుషోత్తంరెడ్డి, అతడి బావమరిది ఇండ్లను సోదా చేస్తే మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

కొల్లామ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు

- సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేరళలోని కొల్లామ్‌లో ఏప్రిల్ 26 నుంచి సీపీఐ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మహాసభల్లో పొత్తులు, రాజకీయవ్యూహాలపై పార్టీ సభ్యుల అభిప్రాయాలను స్వీకరిస్తామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఉందని, ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలకు వామపక్షాలే కీలకమని చెప్పారు. నిరుద్యోగ సమస్య తీరుస్తానని, నల్లధనాన్ని తెస్తానని చెప్పి గెలిచిన మోదీ ఇప్పుడు మతఘర్షణలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మోదీ వచ్చాక అంబానీ, ఆదాని ఆస్తులు పెరిగాయని ఆరోపించారు. వామపక్ష, లౌకికవాదులు, మేధావులంతా కలిసి ఒకవేదిక ఏర్పాటుచేస్తే సంఘపరివార్‌ను ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధం లేకుండా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ వేదిక పనిచేయాలన్నారు. నీరవ్‌మోదీ కేంద్రంగా జరిగిన దోపిడీ.. తమ పాలనలో జరుగలేదని బీజేపీ తప్పించుకుంటున్నదని విమర్శించారు. హిందీ రాష్ట్రాల్లో మతఘర్షణలను బీజేపీ రెచ్చగొడుతున్నదని, దీని వెనుక పెట్టుబడిదారుల అనుకూలమైన పాలనావైఖరి ఉందని అనుమానం వ్యక్తంచేశారు.



పెట్రోల్‌బంకుల్లో మహిళలకు ఉపాధి

ఐఓసీఎల్‌తో జైళ్ల శాఖ ఒప్పందం.. ఈ ఏడాది 2 వేల మందికి: డీజీ వీకే సింగ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైలు శిక్ష అనుభవించి, విడుదలైన మహిళల ఉపాధి కోసం జైళ్లశాఖ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మహిళల కోసం ప్రత్యేకంగా చంచల్‌గూడలో పెట్రోల్‌బంకును ఏర్పాటుచేశారు. జైలు జీవితాన్ని గడిపాక కుటుంబ ఆదరణ లేని మహిళలకు ఉపాధి కల్పించాలని భావిస్తున్నారు. ప్రైవేటు పెట్రోల్‌బంకుల్లో పని కల్పించాలనే ఆలోచనతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ను జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ సంప్రదించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పెట్రోల్‌బంకుల్లో మహిళకు ఉపాధి కల్పించేందుకు ఆయిల్ కంపెనీ అంగీకరించడంతో ఒప్పందం చేసుకున్నారు. జైలు శిక్ష పూర్తయిన వితంతువులు, ఆదరణ లేని మహిళలకు ప్రైవేటు పెట్రోల్ బంకుల్లో ఈ ఏడాది 2 వేల మందికి ఉపాధి కల్పిస్తామని అధికారులు చెప్పారు. ఇల్లాలు అనారోగ్యానికి గురైతేనే ఆ ఇల్లు తల్లడిల్లుతుంది. అదే ఓ ఇల్లాలు జైలుకెళితే ఆ కుటుంబం సమాజంగా ఎలాంటి ఇబ్బంది ఎదుర్కొంటుందో ఊహించి ఈ కార్యక్రమం ప్రారంభించినట్టు తెలిపారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సంస్కరణలను అమలు చేస్తున్న జైళ్లశాఖ.. చంచల్‌గూడలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకును మొత్తం మహిళతో నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో కుటుంబ ఆదరణకు నోచుకోని, ఒంటరిగా ఉండే మహిళలకు ఉపాధి కల్పిస్తామని జైళ్లశాఖ డీజీ పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.9 వేల జీతం ఇచ్చేందుకు ఆయిల్ కంపెనీ అంగీకరించినట్టు వెల్లడించారు. జైలుశిక్ష పూర్తిచేసుకొని విడుదలైన మహిళలు తమ సొంత జిల్లాలోని జైలు సూపరింటెండెంట్లను సంప్రదించాలని ఆయన కోరారు. వారికి అక్కడ ఉన్న బంకుల్లో ఉపాధి కల్పిస్తారని వివరించారు. నేరాలను తగ్గించాలనే లక్ష్యంతో ఈ సంస్కరణలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

కడప ఒంటిమిట్ట చెరువులో ఏడుగురి మృతి

ఎర్రచందనం కూలీలుగా అనుమానం

పోలీసుల నుంచి తప్పించుకోబోయి మృత్యువాత?


ఒంటిమిట్ట చెరువులో తేలియాడుతున్న మృతదేహం

కడప: ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా తిరుపతి హైవే రోడ్డు పక్కన ఉన్న ఒంటిమిట్ట చెరువులో ఏడుగురి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. వీరు తమిళనాడుకు చెందిన ఎర్ర చందనం కూలీలుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వారికి అక్కడ ఓ లారీ కనిపించింది. ఇందులో 30 మంది ఎర్రచందనం కూలీలు ఉన్నట్టు తెలిసింది. తమను చూసి తప్పించుకొనే ప్రయత్నం చేయగా వారిలో కొందరు కూలీలు చెరువులో దూకి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వారు ఊపిరి ఆడక మృతిచెందిఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి వద్ద లభించిన బ్యాగుల్లోని వస్తువుల ఆధారంగా మృతుల వివరాలను తెలుసుకొనేందుకు యత్నిస్తున్నారు. సంఘటనాస్థలాన్ని ఓఎస్డీ నయీం అజ్మీ పరిశీలించారు. చెరువులో పడటంతో మృతదేహాలు ఉబ్బిపోయాయని, శవపరీక్ష తర్వాత వారి మృతికి కారణం తెలుస్తుందని కడప ఎస్పీ నాగిరెడ్డి తెలిపారు. మరోవైపు కడప జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లపై తమ బృందం తనిఖీలు చేయలేదని, కూలీల మృతి సంగతి తెలియదని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకదళం ఏపీ అధిపతి కాంతారావు తెలిపారు.

తెలంగాణ ఐటీఐలు భేష్

ఇంజినీరింగ్ విద్యార్థుల కంటే ఐటీఐ అభ్యర్థులకే ఎక్కువ ఉద్యోగాలు

కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి అనంతకుమార్ హెగ్డే


నోవాటెల్ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే. చిత్రంలో మంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)ల పనితీరు బాగుందని కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి అనంతకుమార్ హెగ్డే ప్రశంసించారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో పోలిస్తే ఐటీఐ పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు లభించిన శాతం మెరుగ్గా ఉన్నదని అన్నారు. ఐటీఐ కళాశాలలను మరింత సమర్థంగా తీర్చిదిద్దినట్లయితే విద్యార్థుల భవిష్యత్తు ఇంకా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం రాష్ట్ర హోం, కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, అధికారులతో కలిసి కేంద్రమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీఐ కోర్సులు చదివే విద్యార్థినులకు విదేశాల్లో శిక్షణ ఇప్పించే అవకాశముందని, ఆ విధంగా ఐటీఐలను తీర్చిదిద్దాల్సి ఉందని అన్నారు. అప్రెంటీస్ యాక్ట్-1961 అనుసరించి ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు అప్రెంటీస్ శిక్షణ ఇస్తున్నామని మంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కాలేజీల్లో 32 ట్రేడ్లలో 3,378 సీట్లు ఉన్నాయని మంత్రి వివరించారు. సీట్ల భర్తీని ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నామని, ప్రతి ప్రభుత్వ ఐటీఐలో ప్లేస్‌మెంట్ సెల్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్, అక్రెడిటేషన్ 40 నుంచి 60 రోజుల సమయం తీసుకుంటున్నదని, ఈ సమయాన్ని తగ్గించాలని మంత్రి నాయిని కేంద్రమంత్రిని కోరారు. ఈ విషయంపై త్వరలోనే మార్గదర్శకాలు పంపుతామని, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కోసం నిధులను అందజేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. సమావేశంలో కార్మిక, ఉపాధి కల్పనశాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్, ఉపాధి కల్పన డైరెక్టర్ వైబీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


జనగామ జిల్లా ఇబ్రహీంపూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో ఎమ్మెల్యే రాజయ్య

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు విద్య

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

రఘునాథపల్లి: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం విద్యాపరంగా వెనుకబాటుకు గురైందని కడియం అన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఇందులోభాగంగా విద్యా రంగానికి పెద్ద పీటవేసేందుకు 470 గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మేధావులు సీఎం కేసీఆర్‌ను అభినందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ వద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కడియం శ్రీహరి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మిద్దెతోట

- కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ పురుషోత్తం


రెడ్‌హిల్స్ ఫ్యాప్సీ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో పాల్గొన్న రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నగరాలు, పట్టణాల్లో ఉన్నవారు పర్యావరణ పరిరక్షణతోపాటు స్వచ్ఛమైన ఆక్సిజన్, తాజా పండ్లు, పూలు, కూరగాయల కోసం వారికున్న పరిధిలో మిద్దెతోట చేపట్టాలని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ డీ పురుషోత్తం కోరారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యానవనశాఖ సహకారంతో ఆదివారం రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ కేఎల్ ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో కిచెన్‌గార్డ్, రూఫ్‌గార్డెన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యానవన వర్సిటీ సంచాలకుడు రావి చంద్రశేఖర్, రిటైర్డ్ ఏడీ విద్యాభూషణ్, మిద్దెతోట నిపుణుడు రఘోత్తం రెడ్డి, సైదాబాద్‌కు చెందిన బకెట్ గార్డెన్ నిపుణుడు రవిచంద్రకుమార్, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, రైతు రాంబాబు పాల్గొన్నారు.

అలిశెట్టి తల్లి కన్నుమూత



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ కవి అలిశెట్టి ప్రభాకర్ తల్లి లక్ష్మి (90) ఆదివారం రాత్రి కన్నుమూశారు. హైదరాబాద్ రామంతపూర్‌లోని చిన్న కొడుకు దయాకర్ ఇంట్లో ఉంటున్న ఆమె నిద్రలోనే తుదిశ్వాస విడిచారు. సోమవారం ఉదయం అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా: 12 మందికి తీవ్రగాయాలు

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూర్-కుంటాల ప్రధాన రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఎస్సై యూనీస్ కథనం ప్రకారం.. భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 16 మంది ప్రయాణికులతో మహారాష్ట్రలోని అప్పారావు పేట్‌కు వెళ్తుంది. కుంటాల పోలీస్‌స్టేషన్ సమీపంలో మలుపు వద్ద బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఇందులో కండక్టర్, డ్రైవర్‌తోపాటు 12 మందికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో భైంసా దవాఖానకు తరలించారు.

అమ్మఒడిలో సురక్షితంగా..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పురిటినొప్పికి ముందే గర్భిణి అమ్మఒడి వాహనంలో సురక్షితంగా ప్రభుత్వ దవాఖానకు చేరుతున్నది. అంతే సురక్షితంగా బిడ్డ, కుటుంబంతో సహా ఇంటికి చేరుతున్నది. గర్భిణుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి 102 వాహనాలు విస్తృత సేవలు అందిస్తున్నాయి. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు చెందిన గర్భిణులను ప్రసవ సమయానికి ముందు దవాఖానకు చేర్చడం, ప్రసవం తర్వాత పుట్టిన బిడ్డతోపాటు కుటుంబసభ్యులను కూడా సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు వీటిని ప్రవేశపెట్టారు. మాతాశిశు రక్షణ ఉద్దేశంతో అందుబాటులోకి తీసుకువచ్చిన అమ్మఒడి 102 వాహనాన్ని నెల రోజుల క్రితం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. ఈ నెల రోజుల్లో ఈ వాహనాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 8,817 మంది గర్భిణులకు లబ్ధిచేకూరింది.

గర్భిణులకు విస్తృత సేవలు అందిస్తున్న 102 వాహనాలు
నెల రోజుల్లో 8,819 మందికి లబ్ధి
పేదలకు వైద్యసేవలను విస్తృతం చేస్తున్న ప్రభుత్వం



సమర్థవంతంగా నిర్వహణ

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి



తెలంగాణ రాష్ట్రంలో మాతాశిశు మరణాల నియంత్రణలో భాగంగా కేసీఆర్ కిట్ల పథకం అమలుచేస్తున్నది. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా గర్భిణులను సర్కారు దవాఖానాలకు చేర్చేందుకు ఏర్పాటుచేసిన 102 అంబులెన్సులను సద్వినియోగం చేసుకుంటున్నారు. అమ్మఒడి వాహనాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పేదలకు ప్రయోజనం చేకూరేలా కృషిచేస్తున్నాం.

అమ్మఒడి 102 వాహనాలతో..

వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ సహకారంతో 200 అమ్మఒడి వాహనాలు గర్భిణులకు సేవలు అందిస్తున్నాయి. జననీ శిశు సురక్ష కార్యక్రమం (జేఎస్ఎస్‌కే) నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో 102 వాహనసేవలను అందిస్తున్నారు. ఒక్కోవాహనం ద్వారా ప్రతి రోజూ కనీసం నలుగురు గర్భిణులను సర్కారు దవాఖానకు చేర్చడం, ప్రసవం తరువాత శిశువు, కుటుంబసభ్యులతో సహా ఇంటికి చేర్చడం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం ఒక్కో వాహనానికి ప్రతినెలా రూ.99,765 ఖర్చు చేయనున్నట్టు అంచనా. 200 వాహనాలకు కలిపి ఏడాదికి ప్రభుత్వం రూ.23,94,36,000 ఖర్చు చేయనుంది. ప్రసవం నిర్ధారించిన తేదీకి ముందురోజు గర్భిణిని ఇంటినుంచి 102 వాహనంపై సర్కారు దవాఖానకు చేరవేసేందుకు 102 టోల్‌ఫ్రీ నంబరును ఉపయోగిస్తారు. ప్రసవం తర్వాత దవాఖాన నుంచి ఇంటికి సురక్షితంగా చేర్చుతారు. గర్భిణులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే ఆర్‌సీహెచ్, ఏఎన్ఎంఓఎల్, కేసీఆర్ కిట్ పోర్టల్‌లలో నమోదు చేస్తారు. సాంకేతికపరిజ్ఞానాన్ని వినియోగించి ప్రభుత్వ పోర్టల్‌లో నమోదుచేసుకున్న గర్భిణులను ప్రసవం జరుగనున్నట్టు అంచనావేసిన తేదీకి ముందురోజు 102 వాహనంలో సర్కారు దవాఖానకు చేర్చుతారు.

నెలరోజుల్లో జిల్లాల వారీగా అమ్మఒడి 102 వాహన సేవలు పొందినవారి సంఖ్య ఇలా..

జిల్లాపేరు	ట్రిప్పుల సంఖ్య	లబ్ధిదారుల సంఖ్య
ఆదిలాబాద్	126	212
భద్రాద్రి కొత్తగూడెం	237	395
గద్వాల జోగుళాంబ	177	228
హైదరాబాద్	217	334
జగిత్యాల	135	205
జనగామ	242	381
భూపాలపల్లి	165	269
కామారెడ్డి	302	402
కరీంనగర్	167	245
ఖమ్మం	225	299
కుమ్రంభీం	85	113
మహబూబాబాద్	194	304
మహబూబ్‌నగర్	264	376
మంచిర్యాల	152	225
మెదక్	236	405
మేడ్చల్	118	241
నాగర్‌కర్నూల్	286	385
నల్లగొండ	149	180
నిర్మల్	203	353
నిజామాబాద్	222	381
పెద్దపల్లి	162	213
రాజన్న సిరిసిల్ల	131	218
రంగారెడ్డి	237	396
సంగారెడ్డి	249	357
సిద్దిపేట	250	338
సూర్యాపేట	214	347
వికారాబాద్	187	239
వనపర్తి	157	226
వరంగల్ రూరల్	120	152
వరంగల్ అర్బన్	228	328
యాదాద్రి	61	72
మొత్తం	5,898	8,819

దొండపాడులో సాంకేతిక అక్షరాస్యత


సాంకేతిక అక్షరాస్యత కోర్సులో ఉత్తీర్ణులైనవారికి పత్రాలు అందజేసిన టీటా వ్యవస్థాపకుడు సందీప్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక అక్షరాస్యత ఫలాలు అందివస్తున్నాయి. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో ఎన్నారైలు దత్తత తీసుకున్న మొట్టమొదటి గ్రామం సూర్యాపేట జిల్లాలోని దొండపాడు సాంకేతిక అక్షరాస్యతలో విజయం సాధించింది. మరిన్ని గ్రామాలను ఎన్నారైలు దత్తత తీసుకునేందుకు దొండపాడు గ్రామం ఆదర్శంగా నిలుస్తున్నది. ఇప్పుడు గ్రామంలో ప్రతి ఇంటికి సాంకేతిక పరిజ్ఞానం చేరువైంది. టీటా ఆధ్వర్యంలో ఈ గ్రామాన్ని అప్పిరెడ్డి అనే ఎన్నారై, రెడ్లకుంట గ్రామాన్ని కోటేశ్వర్‌రావు దత్తత తీసుకున్నారు. దొండపాడులో 20 వారాలకుపైగా గ్రామస్థులకు శిక్షణనిచ్చారు. సాంకేతిక అక్షరాస్యతకు సంబంధించిన నిర్దేశిత కోర్సుల్లో గ్రామస్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి ఆదివారం పత్రాలు అందించారు. దొండపాడు గ్రామస్థులతోపాటు రెడ్లకుంట గ్రామస్థులు కొందరికి పత్రాలు అందించారు. సాంకేతిక అక్షరాస్యతలో రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలుపడమే టీటా లక్ష్యమని టీటా వ్యవస్థాపకుడు, గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు.

'కాంగ్రెస్ బస్సు యాత్ర'తో ఒరిగేదేమీ లేదు

భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్



నల్లగొండ, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో చేపట్టబోయే బస్సు యాత్రతో పెట్రోల్, డీజిల్ నష్టమే తప్ప ప్రయోజనం ఏమీ ఉండదని భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన నల్లగొండలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటయ్యాక టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మూడున్నరేండ్లలోనే అనేక రంగాల్లో అభివృద్ధి సాధించినట్టు తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలే తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కీర్తిస్తుంటే ఇక్కడి కాంగ్రెస్ నేతలు మాత్రం ఎదుటివారిపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సీనియర్లుగా చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు మొదట వారి భాషను మార్చుకోవాలని హెచ్చరించారు.

అస్మదీయులకు కోరుకున్నచోట బదిలీ

- ఇరకాటంలో వసుంధర రాజే సర్కార్

జైపూర్: అసంతృప్తితో రగిలిపోతున్న పార్టీ కార్యకర్తలను మచ్చిక చేసుకోవాలనుకున్న రాజస్థాన్ సీఎం వసుంధర రాజే ప్రభుత్వానికి కొత్త చిక్కొచ్చిపడింది. బీజేపీ కార్యకర్తల బంధువులకు కోరుకున్న చోట బదిలీచేసేందుకు ప్రాథమిక, మాధ్యమిక విద్యామంత్రి వాసుదేవ్ లేఖను తయారుచేయించారు.ఉన్నతాధికారి సంతకంతో జారీచేసిన ఈ లేఖను బీజేపీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లాశాఖల అధ్యక్షులు, ముఖ్యనాయకులకు పంపారు. ఉప ఎన్నికల్లో ఓటమితో అసంతృప్త కార్యకర్తలను మచ్చికచేసుకునేందుకు లేఖ తీసుకొచ్చారని కాంగ్రెస్‌నేత సచిన్ పైలట్ విమర్శించారు.

సెట్విన్ ఆధ్వర్యంలో నేడు ఉద్యోగ మేళా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వృత్తి నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలను కల్పించడంలో కూడా సెట్విన్ సంస్థ తన వంతు కృషిచేస్తున్నది. సెట్విన్ గతంలో కేవల నిరుద్యోగులకు వివిధ అంశాల్లో శిక్షణ తరగతులు మాత్రమే నిర్వహించేంది. సెట్విన్‌లో శిక్షణ పొందిన ఎంతో మంది అభ్యర్థులు స్వయం ఉపాధి పొందడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగవకాశాలు పొందుతున్నారు. ఇందులో భాగంగానే ప్రైవేట్‌రంగాల్లో సుమారు రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు సెట్విన్ సంస్థ అధికారులు తెలిపారు. వివిధ రంగాల్లో శిక్షణ పొంది, సెట్విన్ ద్వారా అర్హత సర్టిఫికెట్లను అందుకున్న అభ్యర్థులతోపాటు ఇతర అభ్యర్థులకు పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు సోమవారం హైదరాబాద్ న్యూ మెట్టుగూడలోని మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు అధికారులు వివరించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వనపర్తి జిల్లా తోమాలపల్లెలో లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గొర్రెల పెంపకంతో ఆదాయం

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: గొర్రెల పెంపకాన్ని చులకన చేయొద్దనీ, వాటి వల్ల కాపరులకే కాకుండా రాష్ట్రానికి ఆదాయం కూడా పెరుగుతుందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాలపల్లెలో ఆదివారం లబ్ధిదారులకు సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేసిన ఆయన, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొనే సీఎం కేసీఆర్ గొర్రెల పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. సబ్సిడీ గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించేందుకుగానూ అనుసంధానంగా మాంసం ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గొర్రెల పెంపకందార్లకు ప్రభుత్వం అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలిచి ఉచిత వైద్యంతో పాటు మందులను పంపిణీ చేస్తుందన్నారు.

విభజన సమస్యలపై నివేదికలకు కసరత్తు

21న విభజన సమస్యలపై హోంశాఖలో సమావేశాలు ● నివేదికలు తయారుచేయాలని సీఎస్ ఆదేశాలు
సమావేశానికి ఎస్కే జోషి వెళ్లడం అనుమానమే.. వాయిదాకు విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రెండు రాష్ట్రాల్లో విభజన సమస్యలపై ఈనెల 21న ఢిల్లీలోని కేంద్రహోంశాఖ నిర్వహించనున్న సమావేశాల్లో చర్చనీయాంశాలపై అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో జాతీయ ఎస్సీ కమిషన్ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ సమావేశానికి రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి హాజరుకావడం అనుమానంగా మారింది. ఉద్యోగుల విభజన, తొమ్మిది, పదో షెడ్యూల్ విభజన, పదమూడు షెడ్యూల్ హామీలతోపాటు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణచట్టం-2014 ప్రకారం అమల్లోకి రావాల్సిన అంశాలను సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. అన్ని శాఖల్లో విభజన సమస్యలపై నివేదికలను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించినట్టు సమాచారం. తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజన కోసం ఏర్పరిచిన షీలాబీడే కమిటీ గడువు ఫిబ్రవరితో ముగియనున్నది. ఈ కమిటీ చేసిన సిఫారసులు, వాటిల్లో అమల్లోకి రాని అంశాలతో అధికారులు పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేస్తున్నారు.

షీలాబీడే కమిటీ విభజన అంశాలన్నీ వివాదాస్పదం

తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజన కోసం ఏర్పరిచిన షీలాబీడే కమిటీ 71 సంస్థల ఆస్తులు, అప్పులు ఉద్యోగుల విభజన అంశాలపైన నివేదికలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. అయితే షీలాబీడే కమిటీ విభజనకు అనుసరించిన పద్ధతులు, ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన తదితర అంశాలన్నీ వివాదాస్పదమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విభజన కోసం ఏర్పరిచిన కమలనాథన్ కమిటీ మార్గదర్శకాలను తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజనలో కూడా పాటించాలని డీవోపీటీ సూచించింది. ఈ మార్గదర్శకాలను రెండురాష్ట్రాల్లోని సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ షెడ్యూల్‌లోని 90 సంస్థలలో 70 సంస్థల ఆస్తులు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. కానీ 78 శాతం ఉద్యోగులు ఏపీ స్థానికత కలిగినవారే పనిచేస్తున్నారు. దీంతో తెలంగాణ ఖజానాకు చాలా నష్టం జరుగుతున్నదని ఉద్యోగసంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. తొమ్మిది, పదోషెడ్యూల్ సంస్థలలో జరిగిన అన్యాయాలపై తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ రాజేశం, వ్యవస్థాపక అధ్యక్షులు సుధీర్, ప్రధాన కార్యదర్శి జీవన్, ప్రధాన సలహాదారు సింగం విజయమోహన్ సారథ్యంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శ్రీలక్ష్మితో సమావేశమై తెలంగాణలోని పబ్లిక్‌సెక్టార్ సంస్థలకు జరిగిన అన్యాయాలను వివరించారు. కేంద్ర డీవోపీటీకి, నివేదికను అందజేయనున్నారు.


అమలుకు నోచుకోని షెడ్యూల్ -13లో హామీలు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణచట్టం-2014 షెడ్యూల్ -13లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నది. ప్రధానంగా చట్టంలో హామీ ఇచ్చినట్లుగా ఎయిమ్స్ ఏర్పాటు, గిరిజన విశ్వవిద్యాలయం, ఉద్యానవన విశ్వవిద్యాలయం, పారిశ్రామిక కారిడార్లు, విద్యుత్తుప్లాంట్ల ఏర్పాటుకు చట్టంలో పొందుపరిచిన విధంగా సహకారం అందించలేదు. ఓడరేవులకు తెలంగాణలో అవకాశం లేనందున టూరిజం మౌలిక సదుపాయాల కల్పనలకు సహకారం అందిస్తామని చట్టంలో హామీఇచ్చారు. ఈ హామీలు అమలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నారు.

ఉద్యోగుల విభజనపై అన్యాయాలు

ఉద్యోగుల విభజనలో మూడేండ్లుగా ఒక్కోశాఖలో జరిగిన ఉల్లంఘనలపై తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నది. తెలంగాణ స్థానికుల డిమాండ్లను అంగీకరించకపోవడం, నియామకాల్లో అన్యాయం వల్లే తెలంగాణను తెచ్చుకున్నామని, ఇప్పటికీ సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్ క్యాటగిరీలో 80 మంది ఏపీ స్థానికతగల ఉద్యోగులకు అవకాశం ఇస్తే ఎలా భరించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. జూన్-2, 2014 నుంచి స్థానికత నిబంధనల ప్రకారం ఉద్యోగుల విభజన జరుగాలని ఉద్యోగ సంఘాల విజ్ఞాపనలను కమలనాథన్ కమిటీ బేఖాతర్ చేయడం వల్లే సమస్యలు ఏర్పడ్డాయని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ విమర్శించారు. ఉద్యోగుల విభజనలో జరిగిన అన్యాయాలను కేంద్రానికి నివేదిస్తామని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్ చెప్పారు. ఈ అంశాన్ని రాష్ట్రపతికి నివేదించామని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏ పద్మాచారి తెలిపారు. ఉద్యోగుల విభజనలో జరిగిన అన్యాయాలను తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తున్నది. నకిలీ స్థానికత ధ్రువీకరణపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల జేఏసీ కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నది. 1954 ముల్కీ నిబంధనల ప్రకారం స్థానికతను నిర్వచించాలని, స్థానికత నిబంధనల ఉల్లంఘనలపైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయనున్నారు.

న్యాయాధికారుల వేతనాలపై వచ్చేనెలలో ప్రాథమిక నివేదిక



నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ చైర్మన్ జస్టిస్ వెంకట్రామరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిలో కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయాధికారుల వేతనాలు, పింఛన్ల పెంపు అంశంపై ప్రాథమిక నివేదికను వచ్చే నెలలో సుప్రీంకోర్టుకు సమర్పించనున్నట్టు జాతీయ జ్యుడీషియల్ వేతన సంఘం చైర్మన్ జస్టిస్ పీ వెంకట్రామరెడ్డి తెలిపారు. కమిషన్ ఏడో సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. సమావేశం అనంతరం కమిషన్ సభ్యులు జస్టిస్ ఆర్ బసంత్, జస్టిస్ వీకే గుప్తాతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కిందిస్థాయి కోర్టుల న్యాయాధికారుల వేతనాలు, పింఛన్ల పెంపుపై తగిన మార్గదర్శకాలు రూపొందించేందుకు సుప్రీంకోర్టు 2017 జూన్‌లో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 1998లో జగన్నాథశెట్టి కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని కిందిస్థాయి కోర్టుల్లో ఒకేరకమైన వేతనాల అమలుపై కమిషన్ మార్గదర్శకాలు రూపొందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్రాల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నామని తెలిపారు.

8 పీఎస్‌యూల్లో వాటా విక్రయం

■ దీపం కార్యదర్శి నీరజ్ గుప్తా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను విక్రయించేయోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తున్నది. వీటిలో హిందుస్థాన్ ఎరోనాటిక్స్, ఆర్‌ఐటీఈఎస్‌లు 2018-19 ఆర్థిక సంవత్సరంలో స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్(దీపం) కార్యదర్శి నీరజ్ గుప్తా ఈ సందర్భంగా తెలిపారు. వీటిలో ఇప్పటికే హెచ్ఏఎల్‌కు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతినిచ్చింది కూడా. ఈ రక్షణ రంగ సంస్థల్లో పది శాతం వాటాను విక్రయించడానికి కేంద్రం కసరత్తు చేస్తున్నది. వీటితోపాటు ఆర్‌ఐటీఈఎస్, ఐఆర్‌ఈడీఏ, భారత్ డైనమిక్స్ అండ్ మిధానిలు సెబీ వద్ద తమ డ్రాఫ్ట్ పేపర్లను సమర్పించాయి. ఆర్‌ఐటీఈఎస్‌లో 12 శాతం వాటాను విక్రయించడం ద్వారా రూ.600 కోట్లు రావచ్చునని కేంద్రం అంచనావేస్తున్నది. అలాగే ఐఆర్‌ఈడీఏలో 12 శాతం, మిధానీలో 25 శాతం విక్రయించేయోచనలో కేంద్రం ఉన్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల్లో వాటాలను విక్రయించడం ద్వారా రూ.80 వేల కోట్ల నిధులను సేకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నది.



హైదరాబాద్‌లో కొనసాగిన దాడులు

■ 14 లాకర్లలో ఉన్న వజ్రాలు, ఆభరణాలను పరిశీలిస్తున్న ఈడీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకులకు వేల కోట్ల రూపాయల మోసం చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ వ్యాపార కేంద్రాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల దాడులు ఆదివారం కూడా కొనసాగాయి. నీరవ్ మోదీకి సంబంధం ఉన్నట్టుగా భావిస్తున్న రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండలం పరిధిలోని రావిర్యాలలో ఉన్న హార్డ్‌వేర్ పార్క్‌లో నీరవ్ మోదీ దగ్గరి బంధువుకు సంబంధించిన జెమ్స్ అండ్ జువెల్లరీ కంపెనీలో విస్తృతంగా దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న 14 భారీ లాకర్లలో ఉన్న వజ్రాలు, బంగారు ఆభరణాల విలువను లెక్కగట్టే పనిలో సీబీఐ అధికారులు ఉన్నారు. లాకర్లలో ఉన్న ఎనిమిది రకాల డైమండ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వజ్రాలను గుర్తించి, వాటి విలువను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా నిపుణుల బృందాలను కూడా ఈడీ అధికారులు రప్పించారు.

పీఎన్‌బీలో 14,593 కోట్ల మొండిఘటాలు

కుంభకోణంతో సతమతమవుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంకుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. జనవరితో ముగిసిన ఎనిమిది నెలల కాలంలో బ్యాంక్ మొండి బకాయిలు 23 శాతం పెరిగాయి. గత నెల చివరినాటికి బ్యాంక్ ఇచ్చిన రూ.25 లక్షల కోట్ల రుణాల్లో రూ.14,593.16 కోట్ల మొండి బకాయిలు ఉన్నట్లు బ్యాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. జూన్ 2017లో విడుదల చేసిన నివేదిక ప్రకారం అప్పట్లో మొండి బకాయిలు రూ.11,879.74 కోట్ల మేర ఉన్నాయి. అంటే గడిచిన ఎనిమిది నెలల్లోనే 22.8 శాతం పెరుగడం బ్యాంక్ కలవరానికి గురి చేస్తున్నది. 123 ఏండ్ల చరిత్ర కలిగిన బ్యాంక్‌లో ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయనకు చెందిన ఇతర కంపెనీలు రూ.11,400 కోట్ల మోసానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ మొండి బకాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు గతవారంలో పీఎన్‌బీ సీఎండీ సునీల్ తెలిపారు. జూన్ 2013 నుంచి మే 31, 2017 వరకు రూ.25 లక్షల కంటే అధికంగా తీసుకున్న రుణాలను చెల్లించని వారి పేర్లతో ప్రత్యేక నివేదికను రూపొందించింది.

రుణ ఎగవేతల్ని ప్రకటించాల్సిందే

■ పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో మళ్లీ తెరపైకి సెబీ ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: సంచలనం సృష్టించిన పీఎన్‌బీ కుంభకోణం.. స్టాక్ మార్కెట్ సంస్థల రుణాల వ్యవహారంపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీని మరోసారి దృష్టి పెట్టేలా చేస్తున్నది. ఈ స్కాంలతో అమయాక మదుపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదనే ఉద్దేశంతో మార్కెట్ లిస్టింగ్ కంపెనీలు అన్ని రుణ ఎగవేతల వివరాలను ఒక్కరోజులో ప్రకటించాలనే ప్రతిపాదనను సెబీ గతంలోనే తీసుకొచ్చింది. అయితే మార్కెట్ లావాదేవీలను నష్టపరుస్తుందని, బ్యాంకింగ్‌తాజా కుంభకోణం నేపథ్యంలో సెబీ ప్రతిపాదనకు బలం చేకూరుతున్నది. దీంతో మళ్లీ తెరపైకి వస్తున్నది. ఏండ్ల తరబడి వెలుగుచూడని ఈ రూ.11,400 కోట్ల భారీ స్కాం ప్రభావం ఇప్పటికే స్టాక్ మార్కెట్లపై పడుతున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తోపాటు, గీతాంజలి జెమ్స్ షేర్ల విలువ అమాంతం పడిపోతున్న విషయం తెలిసిందే. ఈ కుంభకోణం సూత్రధారి నీరవ్ మోదీతో స్టాక్ మార్కెట్లకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవు. అంటే ఈయన సంస్థలేవీ స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ కాలేదు. అయినప్పటికీ ఈయనవల్ల మోసపోయిన పీఎన్‌బీ.. స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సంస్థ. అలాగే నీరవ్ మామ మెహుల్ చోక్సీ కూడా ఈ కుంభకోణంలో నిందితుడే అవగా, ఆయన ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్న గీతాంజలి జెమ్స్ కూడా స్టాక్ మార్కెట్ కంపెనీయే. దీంతో సహజంగా వీటి షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండగా, వీటిల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల సంపద ఆవిరైపోతున్నది. ఇతర బ్యాంకుల షేర్లూ నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ క్రమంలోనే గతంలో చేసిన ప్రతిపాదనను సెబీ తప్పక అమల్లోకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

200 షెల్ సంస్థల ప్రమేయం?

■ పీఎన్‌బీ కేసులో ఈడీ, ఐటీ శాఖల అనుమానం
■ బినామీ ఆస్తుల కూపీ లాగుతున్న అధికారులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పీఎన్‌బీ కుంభకోణంలో షెల్ కంపెనీలు, బినామీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయం పన్ను (ఐటీ) శాఖలు దృష్టి పెట్టాయి. రూ.11,400 కోట్ల ఈ కుంభకోణంలో షెల్, బినామీల పాత్రేమైనా ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే కనీసం 200 షెల్ సంస్థలు, బినామీ ఆస్తులను పరిశీలిస్తున్నాయి. ఇప్పటికే నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల ఇండ్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇతరత్రా ఆస్తులపై ఈడీ తనిఖీలు చేపడుతున్న విషయం తెలిసిందే. గురువారం మొదలైన ఈ దాడులు ఆదివారం కూడా కొనసాగగా, దేశవ్యాప్తంగా ఉన్న కనీసం 45 జువెల్లరీ షోరూంలు, వర్క్‌షాపులను ఈ ఒక్కరోజే ఈడీ తనిఖీ చేసింది. ఇప్పటిదాకా సుమారు రూ.6,000 కోట్ల మేర వజ్ర, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న ఈడీ.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కనీసం 24 స్థిరాస్తులను జప్తు చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నది. మరోవైపు పీఎంఎల్‌ఏ కేసు నేపథ్యంలో నీరవ్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీలకు చెందిన 29 ఆస్తులను ఐటీ శాఖ అటాచ్ చేసింది. మరో 105 బ్యాంక్ ఖాతాలనూ సీజ్ చేసింది. త్వరలో మరికొన్ని ఆస్తుల జప్తు ఉంటుందని ఓ సీనియర్ ఈడీ అధికారి చెబుతున్నారు. పీఎన్‌బీ గ్యారెంటీలను మోసపూరితంగా పొందిన నీరవ్ మోదీ.. వాటి ద్వారా విదేశాల్లో రుణాలు తీసుకున్నాడంటూ సదరు బ్యాంక్ ఆరోపిస్తున్న క్రమంలో మొత్తం ఈ వ్యవహారంలో దాదాపు 200 షెల్ కంపెనీల ప్రమేయం ఉండవచ్చన్న అనుమానాల్ని ఈడీ, ఐటీ శాఖలు వ్యక్తం చేస్తున్నాయి. దేశీయంగా సృష్టించిన ఈ డొల్ల సంస్థల ద్వారానే నిధుల మళ్లింపు జరిగి ఉండవచ్చని భావిస్తున్నాయి. అలాగే భూములు, బంగారం, వజ్రాలు, రత్నాలు, ఇతరత్రా విలువైన రాళ్ల రూపంలో బినామీ ఆస్తులుండొచ్చన్న సందేహాల్నీ అధికారులు వెలిబుచ్చుతున్నారు. దీంతో ఈ కేసు విచారణలో భాగంగా అటు ఈడీ, ఇటు ఐటీ శాఖలు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశాయి. ఇప్పటికే ఈ కేసులో ఈడీ రూ.5,674 కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు, విలువైన రాళ్లను జప్తు చేసిన విషయం తెలిసిందే. పన్ను ఎగవేతల విచారణలో భాగంగా ఐటీ శాఖ సైతం శనివారం గీతాంజలి జెమ్స్, దాని ప్రమోటర్ మెహుల్ చోక్సీ, ఇతరులకు చెందిన 9 బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసింది.

ఇంకా ఎవరెవరున్నారు?

ఇతర బ్యాంక్ అధికారుల పాత్రపై దర్యాప్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పీఎన్‌బీ కుంభకోణంలో ఇతర బ్యాంక్ అధికారుల పాత్రపై దర్యాప్తులు జరుగుతున్నాయి. రూ.11,400 కోట్ల ఈ కుంభకోణంలో లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ లేదా అండర్‌స్టాండింగ్స్ (ఎల్‌వోయూ) ద్వారానే మోసం జరిగిన విషయం తెలిసిందే. ముంబైలోని బ్రాడీ హౌజ్ శాఖ ఈ ఎల్‌వోయూలను జారీ చేసినట్లు పీఎన్‌బీ చెబుతుండగా, వీటి ద్వారానే దేశీయ బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల నుంచి నీరవ్ మోదీ రుణాలను పొందాడంటున్నది. ఈ వ్యవహారంలో నష్టపోయామని ఇప్పటికే ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐసహా యూకో, యూనియన్, అలహాబాద్, యాక్సిస్ బ్యాంక్‌లు ప్రకటించిన సంగతీ విదితమే. దీంతో ఇతర బ్యాంకుల అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా? అన్న కోణంలో సీబీఐసహా వివిధ దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్నాయి. విదేశీ శాఖల ద్వారానే రుణాలు మంజూరు కావడంతో అక్కడి ఉద్యోగులపై ఆరా తీస్తున్నాయి. ఈ క్రమంలోనే హాంకాంగ్‌లో ఈ బ్యాంకులకున్న శాఖల్లో పనిచేస్తున్న వారిపై నిఘా పెట్టాయి. ఏడేండ్లుగా ఈ కుంభకోణం జరుగుతున్నదని సీబీఐకిచ్చిన ఫిర్యాదులో పీఎన్‌బీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే మార్గదర్శకాల ప్రకారం రత్నాలు, ఆభరణాల రంగంలో ఎల్‌వోయూలను నగదుగా మార్చుకోవడానికి ఉన్న సమయం సాధారణంగా 90 రోజులే. కానీ గడువు దాటినప్పటికీ ఎల్‌వోయూలు చెల్లుబాటు అయినట్లు తెలుస్తుండటంతో ఇతర బ్యాంకుల విదేశీ శాఖల అధికారులపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. గత నెల వరకు ఈ వ్యవహారం ఇలాగే సాగడంతో ఉన్నతోద్యోగుల నుంచి కిందిస్థాయి అధికారుల వరకు చాలామందికే ఈ కుంభకోణంతో సంబంధాలున్నట్లు రుజువవుతున్నది. ముఖ్యంగా హాంకాంగ్‌లోని శాఖల సిబ్బంది అవినీతికి పాల్పడ్డ సంకేతాలు స్పష్టమవుతున్నాయి. దీంతో ఈ దిశగా దర్యాప్తును విచారణ అధికారులు వేగవంతం చేస్తున్నారు.

హాంకాంగ్‌లో ఏయే బ్యాంకుల శాఖలు

హాంకాంగ్‌లో ప్రస్తుతం 11 భారతీయ బ్యాంకుల శాఖలు పనిచేస్తున్నాయి. అందులో అలహాబాద్, యూకో, యూనియన్, యాక్సిస్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ శాఖలున్నాయి. ఇందులో పీఎన్‌బీ కుంభకోణంతో ఇప్పటికే ఎస్‌బీఐ రూ.1,378 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.1,950 కోట్లు, యూకో బ్యాంక్ రూ.2636 కోట్ల చొప్పున నష్టాలు వచ్చాయని ప్రకటించాయి. అలహాబాద్ బ్యాంక్ సైతం దాదాపు రూ.2,000 కోట్ల నష్టం రావచ్చని అనుమానిస్తున్నది. మిగతా బ్యాంకులకూ ఏమైనా నష్టం వాటిల్లిందా? అన్నది తేలాల్సి ఉన్నది.

గీతాంజలి బ్యాలెన్స్ షీట్ల పరిశీలన

మెహుల్ చోక్సీ ప్రమోటర్‌గా ఉన్న గీతాంజలి గ్రూప్ సంస్థల్లో 18 అనుబంధ సంస్థల బ్యాలెన్స్ షీట్లను సీబీఐ పరిశీలిస్తున్నది. పీఎన్‌బీ ఎల్‌వోయూలపై వివిధ బ్యాంకుల నుంచి ఈ సంస్థల్లోకి ఏమైనా నిధులు వచ్చాయా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నది. ఈ భారీ కుంభకోణంలో శనివారం తొలిసారిగా సీబీఐ ముగ్గురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో పీఎన్‌బీ మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, అప్పటి సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ కారత్‌లను ఆదివారం కూడా సీబీఐ ప్రశ్నించింది.

స్కాంలో శెట్టి, కారత్‌లే కీలకం



ఈ కుంభకోణంలో పీఎన్‌బీ మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, అప్పటి సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ కారత్‌లే కీలకంగా కనిపిస్తున్నారు. మొత్తం 293 లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ లేదా అండర్‌స్టాండింగ్స్ (ఎల్‌వోయూ) జారీ అయినట్లు పీఎన్‌బీ చెబుతుండగా, ఈ ఎల్‌వోయూల వివరాలను బ్యాంకింగ్ వ్యవస్థల కోసం ఉన్న అంతర్జాతీయ మేసేజింగ్ వ్యవస్థ (స్విఫ్ట్ లేదా సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీకమ్యూనికేషన్) ద్వారా శెట్టి, కారత్‌లు నీరవ్ మోదీ సంస్థలకు పంపించినట్లు తెలుస్తున్నది. అంతర్జాతీయంగా నిధుల బదిలీకి బ్యాంకులు ఇచ్చిపుచ్చుకునే మార్గదర్శకాల సమాచారం మొత్తం స్విఫ్ట్‌పైనే ఆధారపడి ఉంటుంది. 2011లో ఈ కుంభకోణానికి బీజం పడినట్లు తెలుస్తుండగా, ఏడేండ్లపాటు ఇది సజావుగానే సాగింది. అయితే శెట్టి పదవీ విరమణతో ఈ జనవరిలో అసలు విషయం బట్టబయలైంది. 224 లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లు జారీ అయినట్లు తెలుస్తుండగా, కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (సీబీఎస్) వ్యవస్థలోని ట్రేడ్ ఫైనాన్స్ మాడ్యూల్‌లో చిన్నచిన్న మొత్తాలను వేసి ఈ ఎల్‌వోసీలనూ పెద్ద ఎత్తునే శెట్టి నీరవ్ మోదీకి జారీ చేశారని బ్యాంక్ చెబుతున్నది. సీబీఎస్ మాడ్యూల్‌లో ఎలాంటి మార్పులు చేయకుండానే ఆ తర్వాత స్విఫ్ట్ సందేశం ద్వారా పెద్ద మొత్తాలను ఇవ్వాల్సిందిగా ఆయా బ్యాంక్ శాఖలకు శెట్టి సూచించినట్లు తెలుస్తున్నది. స్విఫ్ట్ కింద పీఎన్‌బీ నుంచి సందేశాలను అందుకున్న వివిధ బ్యాంక్‌ల విదేశీ శాఖలు నీరవ్ మోదీ సంస్థలకు నిర్దేశిత రుణాలు మంజూరు చేశాయి. పీఎన్‌బీ నోస్ట్రో ఖాతాలోకి ఈ మొత్తాలను జమ చేశాయి. తమ ఖాతాదారుల విదేశీ వాణిజ్యావసరాల కోసం మరో బ్యాంక్‌లో విదేశీ కరెన్సీ రూపంలో బ్యాంక్ నిర్వహించే ఖాతానే నోస్ట్రో అకౌంట్. పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణంలో గోకుల్‌నాథ్ శెట్టి చక్రం తిప్పినట్లు తెలుస్తున్నది. బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన ఆయన..నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు పూర్తిస్థాయిలో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారు. పదవీ విరమణకు ముందు రెండు నెలల్లోనే (63 రోజుల్లోనే) 143 ఎల్‌వోయూలు జారీ చేయడం పలు అనుమానాలకు దారితీస్తున్నది. ఆయన గతేడాది మే 31న రిటైర్డ్ అయ్యారు. అంటే మార్చి 1, 2017 నుంచి రోజుకు రెండు చొప్పున ఎల్‌వోయూలు జారీ చేసినట్లు సీబీఐ గుర్తించింది. వీటి ఆధారంగానే ఇంత పెద్ద అక్రమ లావాదేవీలు జరిగాయి.

ఏం చేస్తారో చేసుకోండి!

డబ్బులను తిరిగి చెల్లించాలన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అధికారులతో నీరవ్ మోదీ సోదరుడు నిషాల్ మోదీ తలతిక్క మాటలివి. రూ.11,400 కోట్ల ఈ కుంభకోణాన్ని సీబీఐ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసుపై సీబీఐకి ఫిర్యాదు చేయడానికి ముందు నీరవ్ సోదరుడితో తాము మాట్లాడినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఆదివారం పీఎన్‌బీ అధికారులు తెలిపారు. తమ శాఖ వద్దకు పిలిపించిన నీరవ్ సోదరుడిని తీసుకున్న సొమ్ము మొత్తం తిరిగిచ్చేయాలని బ్యాంక్ అధికారులు కోరారు. అందుకు అతను నిరాకరించాడని, తమ వద్ద ఇప్పుడు డబ్బులు లేవంటూ మీరేం చేయాలనుకుంటున్నారో.. చేసుకోండి అని అక్కడ్నుంచి జారుకున్నట్లు బ్యాంక్ అధికారు లు ఈడీకి వివరించారు. దాంతోనే తాము సీబీఐని ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. కాగా, జనవరి ఆఖర్లో సీబీఐ కేసు నమో దు చేయగా, మొదటి వారంలోనే నీరవ్ మోదీ, ఆయన భార్య, సోదరుడు, మేనమామ మెహుల్ చోక్సీలు విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే.



భార్య ఇషీతాతో నిషాల్ మోదీ

అంబానీల బంధువే నిషాల్ మోదీ!

దేశీయ ఆర్థిక వ్యవస్థను, అంతకుమించి భారతీయ బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తున్న పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ సోదరుడైన నిషాల్ మోదీ.. ఎవరో కాదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ, అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (అడాగ్) సారథి అనిల్ అంబానీల ముద్దుల మేనకోడలు ఇషీతా సల్గావ్‌కర్ భర్తే. గోవాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దత్తరాజ్ సల్గావ్‌కర్ కూతురే ఇషీతా. దత్తరాజ్‌నే ముకేశ్ అంబానీ సోదరి దీప్తి వివాహం చేసుకుంది. వీరిరువురి గారాలపట్టే ఇషీతా అవగా, నిషాల్ మోదీ-ఇషీతాల ఎంగేజ్‌మెంట్ ముంబైలోని ట్రిడెంట్‌లో ఘనంగా జరిగింది. వీరి పెండ్లికి ముందు జరిగిన వేడుక ముఖేశ్ ఆంటిలియా హౌజ్‌లో జరుగడం విశేషం.

ఊగిసలాటలో సూచీలు

ఈ వారంలో ప్రభావం చూపనున్న అంతర్జాతీయ పరిణామాలు, పీఎన్‌బీ కుంభకోణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అంతర్జాతీయంగా నెలకొన్న పరిణామాలు ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా క్రూడాయిల్ ధరలతోపాటు దేశీయంగా నెలకొన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంతో మార్కెట్లు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉన్నదని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు ముగింపునకు రావడం, ద్రవ్యలోటు మూడేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకోవడం వీటిపై పెట్టుబడిదారులు దృష్టి సారించే అవకాశం ఉన్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న దేశీయ మార్కెట్లు ఇటీవల కాలంలో ఐదు శాతం మేర పడిపోయాయని, ఇదే క్రమంలో వాణిజ్యలోటు పెరుగడం మదుపరులలో ఆందోళనను మరింత తీవ్రతరం చేయనున్నదని ఆయన పేర్కొన్నారు. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ సూచీలు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉన్నదన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకైన పీఎన్‌బీలో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణంతో గతవారంలో బ్యాంకింగ్ రంగ షేర్లు భారీ పతనాన్ని మూటగట్టుకున్నాయి. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో పీఎన్‌బీ మార్కెట్ విలువ రూ.8,731 కోట్ల మేర నష్టపోయింది. గడిచిన వారంలో సెన్సెక్స్ 286.71 పాయింట్లు, నిఫ్టీ 93.20 పాయింట్లు పతనం చెందాయి.



38 వేల కోట్లు నష్టపోయిన టాప్-10 కంపెనీలు

పీఎన్‌బీ కుంభకోణం స్టాక్ మార్కెట్లోనూ పెను కంపనాలు సృష్టిస్తున్నది. గడిచిన వారంలో స్టాక్ మార్కెట్లో లిస్టైన టాప్-10 సంస్థలు రూ.38,724.25 కోట్ల మేర సంపదను కోల్పోయాయి. వీటిలో ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ అధికంగా నష్టపోయింది. టీసీఎస్, ఐటీసీ, మారుతి సుజుకీ, ఓఎన్‌జీసీలు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. కానీ ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్‌లు లాభాల్లో ముగిశాయి. ఎస్‌బీఐ మార్కెట్ విలువ రూ.21,278.01 కోట్లు కోల్పోయి రూ.2,34,576.06 కోట్లకు పరిమితమవగా, టీసీఎస్ రూ.6,719.15 కోట్లు తగ్గి రూ.5,62,264.55 కోట్లకు పరిమితమైంది. రూ.6,035.62 కోట్లు తగ్గిన ఐటీసీ విలువ రూ.3,24,765.15 కోట్లకు చేరుకోగా, మారుతి సుజుకీ రూ.3,215.65 కోట్లు కోల్పోయి రూ.2,67.038.77 కోట్లుగా నమోదైంది. కానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.15,043 కోట్లు పెరిగి రూ.5,83,816.76 కోట్లకు చేరుకోవడం విశేషం.

రూ.6,850 కోట్లు తరలించుకుపోయిన ఎఫ్‌పీఐలు

దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు భారీ స్థాయిలో తమ ఇన్వెస్ట్‌మెంట్లను తరలించుకుపోయారు. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు(ఎఫ్‌పీఐ) 100 కోట్ల డాలర్లు లేదా రూ.6,850 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారని స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వెల్లడించింది. జనవరిలో మాత్రం రూ.13,780 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు ఆ తర్వాత నెలలో ఉపసంహరించుకోవడానికి మొగ్గుచూపారు. అమెరికాలో నిరుద్యోగం 17 ఏండ్ల కనిష్ఠ స్థాయికి జారుకోవడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అడ్డుకట్ట వేయడానికి యూఎస్ ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచే అవకాశాలు మెండుగా ఉండటంతో ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను తరలించుకుపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు వివరించారు. కానీ ఇదే సమయంలో డెబిట్ మార్కెట్లలోకి రూ.3,215 కోట్ల నిధులు పెట్టుబడుల పెట్టడం విశేషం.

మోడల్ రైతు బజార్ ఎట్లున్నది..?

రైతులతో ఆరా తీసిన మంత్రి హరీశ్‌రావు

మస్తుగున్నదంటూ సమాధానమిచ్చిన రైతులు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: 'అమ్మా.. కూరగాయలు మంచిగ అమ్ముడుపోతున్నాయా?.. మార్కెట్‌లో సౌలత్‌లు బాగున్నాయా?.. ఇంకేమైన ఇబ్బందులున్నాయా?'.. అని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రైతులను ఆప్యాయంగా పలుకరించారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని మోడల్ రైతు బజార్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్రంలోనే అత్యాధునిక సౌకర్యాలతో సిద్దిపేటలో నిర్మించిన మోడల్ రైతుబజారులో రైతులు కూరగాయలు అమ్ముతున్న విధానాన్ని స్వయంగా తెలుసుకున్నారు. అన్ని స్టాళ్లను కలియతిరిగారు. 'సౌలత్‌లు బాగున్నాయి.. మా కోసం మంచి మార్కెట్ కట్టించిన్రు.. కూరగాయలు మంచిగ అమ్ముతున్నాం'.. అంటూ మహిళా రైతులు చెప్పడంతో మంత్రి హరీశ్‌రావు ఆనందం వ్యక్తం చేశారు.

షాపింగ్‌మాల్ ప్రారంభం..

సిద్దిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మాంగళ్యా షాపింగ్‌మాల్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం సిద్దిపేట మండలం ఇర్కోడు మోడల్



సిద్దిపేట రైతుబజారులో కూరగాయల అమ్మకాలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణం వ్యాపారపరంగా బాగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. ప్రతి విద్యార్థి పుట్టిన రోజున మొక్క నాటి సంరక్షించాలన్నారు. రక్షాబంధన్ మాదిరిగా వృక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

బయటపడిన బ్రిటిష్‌కాలం నాటి గని

■ ఇల్లెందులో భగీరథ పనులు చేస్తుండగా వెలుగులోకి

ఇల్లెందు, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రాంతం అపార ఖనిజ సంపదకు ఆలవాలమని.. ఇక్కడ భూగర్భ గనులు ఎప్పటి నుంచో ఉన్నాయని మరోసారి నిర్ధారణ అయింది. బ్రిటీష్‌వారి కాలం నుంచే ఇక్కడ గనుల తవ్వకం అభివృద్ధి చెందిందని రుజువైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో బుగ్గవాగు వంతెన పక్కన ఆదివారం మిషన్ భగీరథ కోసం తవ్వకాలు చేపడుతుండగా చారిత్రాత్మక 1 ఇన్‌క్లైన్ గని సొరంగం బయటపడింది. భూగర్భ గని మెట్ల మార్గం వెలుగుచూడటంతో ఆందోళనకు గురైన స్థానిక ప్రజలు, పనులు చేసే సిబ్బంది సింగరేణి అధికారులకు సమాచారమిచ్చారు. తొలుత సింగరేణి సర్వే బృందం అక్కడకు చేరుకొని తవ్వకాల తీరు, సొరంగం బయటపడిన ఆనవాళ్లను గుర్తించారు. సింగరేణి జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. సుమారు వందేండ్ల కిందట బ్రిటిష్‌వారు తవ్విన భూగర్భ గనులు 28 ఉన్నాయని, అందులో 1 ఇన్‌క్లైన్ మైన్ ఒకటని లక్ష్మీనారాయణ తెలిపారు. ఉపరితలం నుంచి భూగర్భగనిలోకి కార్మికులు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన రహదారి మాత్రమే తవ్వకాల్లో బయటపడిందని వివరించారు. బొగ్గును వెలికి తీసిన గని కావడంతో దీనివల్ల ఉపయోగం ఉండదని, దానిని వెంటనే మూసేస్తామన్నారు. భగీరథ పనులకు ఆటంకం లేకుండా పనులు కొనసాగించుకోవచ్చని చెప్పారు. పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి అపోహలను నమ్మవద్దని కోరారు.



కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో బయటపడ్డ భూగర్భ గని ప్రదేశం



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టంపల్లిలో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

ఆదర్శవంతంగా కేసీఆర్ పాలన

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ పాలన దేశంలోనే ఆదర్శమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టంపల్లిలో డబుల్ బెడ్‌రూం, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మిడ్జిల్‌లో జరిగిన ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. అనంతరం జడ్చర్ల మండలం నాగసాల శివారులోని మల్లెలమ్మ దేవత బోనాల ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.



కొల్లాపూర్ కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సమస్యలపై కవులు స్పందించాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: సమాజంలోని సమస్యలు, రుగ్మతలపై కవులు, రచయితలు స్పందించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృ భాషాదినోత్సవం సందర్భంగా తెలుగు భారతి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో జరిగిన శతాధిక కవుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సమాజంలోని అన్ని అంశాలను తమ కవిత్వంలో ఇతివృత్తంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. కొల్లాపూర్ సాహితీ, సౌరభవాన్ని దిశ దిశలా కవులు, రచయితలు చాటాలని కోరారు.



తాండూరు-బెంగళూర్ ఏసీ బస్సు ప్రారంభిస్తున్న రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి

రూ.66 కోట్లతో బస్ స్టేషన్ల అభివృద్ధి

రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు టౌన్: రాష్ట్రంలో రూ.66 కోట్లతో బస్‌స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్టు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు బస్‌స్టేషన్‌లో తాండూరు నుంచి బెంగళూర్ ఏసీ బస్సుతో పాటు తాండూరు-అడల్‌పూర్ పల్లె వెలుగు బస్సును మంత్రి ప్రారంభించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలకోసం 1400 కొత్త బస్సులు కొనుగోలు చేశామన్నారు. బస్‌స్టేషన్లలో ప్రత్యేక షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెట్రోల్ బంక్‌లు, థియేటర్లతో పాటు పలు వ్యాపార సముదాయాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. అందుకు సంబంధించిన టెండర్లు కూడా ప్రకటించినట్లు వెల్లడించారు.

పథకాల అమలులో దేశానికే దిక్సూచి

ఎంపీ వినోద్‌కుమార్



మానకొండూర్: సంక్షేమ పథకాల అమలులో దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం మారిందని కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నదని తెలిపారు. రైతే తెలంగాణ రాష్ట్రానికి వెన్నెముక అని ప్రభుత్వం భావించి రైతాంగ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలమవుతుందన్నారు. కరీంనగర్ నుంచి కాజీపేట్ వరకు రైల్వేలైన్ సర్వే కోసం రూ.10 కోట్లు మంజూరయ్యాయనీ, ఇది పూర్తయితే దక్షిణ భారత దేశంలోనే ఈ రైలు మార్గం కీలకంగా మారుతుందన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ద్రోణి ప్రభావం వల్ల మొన్నటివరకు చల్లగా ఉన్న వాతావరణం క్రమంగా వేడెక్కుతున్నది. ఫలితంగా రాష్ట్రంలో మధ్యాహ్నం సమయంలో ఉక్కపోత మొదలైంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఒకేసారి 2 నుంచి 3డిగ్రీలు పెరిగాయి. మరో వారం రోజుల వరకు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉంటాయని, ఫలితంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.



కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో మంత్రి పోచారం సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీపీ విజయ్ ప్రకాశ్



ఆదిలాబాద్ జిల్లా పూసాయిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పతున్న మంత్రి జోగు రామన్న



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గండుగులపల్లిలో కండువా కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సూర్యాపేటలో పార్టీలో చేరుతున్న వారికి గులాబీ కండువాలు వేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఉప్పెనలా ఉద్యమ పార్టీలోకి..

టీఆర్‌ఎస్‌లోకి పెరుగుతున్న వలసలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి టీడీపీ, కాంగ్రెస్, బీజేపీతోపాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో వర్ని మండలం ఘన్‌పూర్‌కు చెందిన 200మంది, బీర్కూర్‌కు చెందిన సుమారు వెయ్యిమంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా కావేరమ్మపేటకు చెందిన 20 మంది వాలీబాల్ క్రీడాకారులు జడ్చర్లలో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ ఎస్‌లో చేరారు. సూర్యాపేటలో ఎంపీటీసీతోపాటు సీనియర్ కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు వెయ్యిమంది మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఖమ్మం జిల్లా వేంసూరు మండలానికి చెందిన టీడీపీ, కాంగ్రెస్ నాయ



ఖమ్మం జిల్లా చింతకానిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పతున్న ఎంపీ పొంగులేటి

కులు, కార్యకర్తలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పూసాయి వాసులతోపాటు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున మంత్రి జోగు రామన్న సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లిలో 100 మంది నేతకాని సంఘం సభ్యులు టీఆర్‌ఎస్‌లో చేరగా, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం జిల్లా చింతకానిలో 50 కుటుంబాల వారు ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మరికల్ గ్రామం సూర్యానాయక్ తండాకు చెందిన బీజేపీ నాయకులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో శాంతినగర్‌కు చెందిన 20 కుటుంబాల వారు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్‌ఎస్ కండువాలు కప్పుకున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తిలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సమక్షంలో సుమారు వందమంది టీఆర్‌ఎస్‌లో చేరారు. మేడ్చల్ జిల్లా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతంనగర్, కార్మికనగర్‌లో సుమారు 500మంది కార్యకర్తలు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి మండలం అడ్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 50మంది ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో 50 మంది ఏబీవీపీ నాయకులు గులాబీ కండువా కప్పుకు



మేడ్చల్ జిల్లాలో ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరిన కార్మికులు



నాగర్‌కర్నూల్ జిల్లా మరికల్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

న్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో గూడూరు మండలం బ్రాహ్మణ కొత్తపల్లికి చెందిన 100 మంది ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు.



వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలం కోగిల్వాయి-సింగరాజుపల్లి గ్రామాల మధ్యలో నిర్మించిన మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్, సంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను పరిశీలించి పూజలు చేస్తున్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి.
- దామెర(వరంగల్ రూరల్)



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని నగర పంచాయతీల చైర్మన్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఆదివారం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లా సుందిళ్ల పంప్‌హౌస్ పనులను పరిశీలించారు.
- హుజూరాబాద్, నమస్తే తెలంగాణ



గోదావరికి హారతి ఇస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు

గోదావరికి మహా హారతి

బాసర: నిర్మల్ జిల్లా బాసరలో ఆదివారం గోదావరి ఒడ్డున మహాహారతి వైభవంగా నిర్వహించారు. వేద పాఠశాల స్వామిజీ ఆధ్వర్యంలో వైదిక సమ్మేళనంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించగా, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాసర ఆలయానికి త్వరలోనే సీఎం కేసీఆర్ వస్తారని చెప్పారు. అతి త్వరలోనే రూ. 50 కోట్లతో బాసర ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కాగా, నిర్మల్ నియోజక వర్గంలోని దిలావార్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో వారం రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను అధికారులతో కలిసి మంత్రి ఐకే రెడ్డి పరిశీలించారు.

జగిత్యాల రైస్‌మిల్లర్‌పై పీడీయాక్ట్

జగిత్యాల, నమస్తే తెలంగాణ: జగిత్యాలకు చెందిన రైస్‌మిల్లర్ కొండ లక్ష్మణ్‌పై పీడీయాక్ట్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ శరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు కేటాయించిన బియ్యాన్ని అక్రమ కొనుగోలు, అమ్మకం, నిల్వ, రవాణా చేస్తున్నందున 'నిత్యావసర వస్తువుల సరఫరా నిర్వహణ చట్టం కింద కేసు నమోదు చేసి, నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.



నల్లగొండలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి శ్రీనివాస్

హక్కుల కోసం పాటుపడేవారికే మద్దతు

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి

నల్లగొండ, నమస్తే తెలంగాణ: మాదిగ హక్కుల కోసం పాటుపడే వారికే వచ్చే ఎన్నికల్లో మద్దతివ్వనున్నట్లు టీఎమ్మార్పీఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నల్లగొండలోని ఓ హోటల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఓటే ప్రధాన ఆయుధంగా ఉపయోగించాలనే అంబేద్కర్ సూచనలకనుగుణంగా సంఘం ముందుకెళ్తుందన్నారు. ఈ నెల 6,7 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో రూపొందించిన సంఘం ప్రణాళికనే 26న నిర్వహించబోయే రాజకీయ శిక్షణ తరగతుల్లో కూడా మరోసారి ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ కళలకు పూర్వవైభవం

విద్యానగర్: గ్రామీణ కళలకు పూర్వవైభవం తేవడానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. కామారెడ్డిలోని శ్రీ రేణుక మాతా కల్యాణ మండపంలో రెండు రోజులు నిర్వహించిన జిల్లా స్థాయి భజన పోటీలు ఆదివారం ముగిశాయి. దీనికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పాశ్చాత్య సంప్రదాయాలతో జానపద కళలు కనుమరుగు అవుతున్నాయని, ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతి

ఆందోళనకు దిగిన గ్రామస్థులు
32 లారీల అద్దాలు ధ్వంసం

గణపురం: ఇసుక లారీ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కుందూరుపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు ఆందోళనకు దిగి లారీల అద్దాలను ధ్వంసం చేశారు. వివరాలు ఇలా.. కుందూరుపల్లికి చెందిన బిల్ల మల్లారెడ్డి(45) స్నేహితుడు సదయ్య ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. పరకాల నుంచి వస్తున్న ఇసుక లారీ వెనుక నుంచి వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో మల్లారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా సదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వెంటనే స్థానికులు, బంధువులు మల్లారెడ్డి మృతదేహంతో ప్రధాన రహదారిపై బైఠాయించారు. అటుగా వచ్చిన 32 ఇసుక, బొగ్గు లారీల అద్దాలను ధ్వంసం చేశారు. ఇసుక లారీలను నియంత్రించాలని, మల్లారెడ్డి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ములుగు డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పరకాల నుంచి వచ్చే వాహనాలను గణపురం వైపు మళ్లించారు.

వడివడిగా డిస్ట్రిబ్యూటరీ-82 పనులు

10 కిలోమీటర్లకుపైగా పూర్తయిన కాల్వ

ఆగస్టు నాటికి రంగారెడ్డి జిల్లా నాగిళ్ల వరకు కృష్ణా జలాలు
కల్వకుర్తికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దిన సీఎం కేసీఆర్

కల్వకుర్తి, నమస్తే తెలంగాణ: ఎంజీకేఎల్ఐ అదనపు ఆయకట్టుకు సాగునీరందించే డిస్ట్రిబ్యూటరీ-82 పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఊహించని విధంగా వేగంగా దాదాపు 10 కిలోమీటర్ల మేర కాల్వ పనులు పూర్తయ్యాయి. మరో ఆసక్తికర విషయమేమిటంటే.. ఎంజీకేఎల్ఐ 29వ ప్యాకేజీ ప్రధాన కాల్వ టెయిల్‌ఎండ్ 160 కిలోమీటర్ జంగారెడ్డిపల్లి నుంచి డీ-82 కాల్వలోకి కృష్ణా సాగు జలాలు వదిలారు. డీ-82 పరిధిలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు కృష్ణాజలాలతో నిండుతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. కాల్వ పనులు ఓ వైపు పూర్తి చేస్తూనే.. మరో వైపు పూర్తయిన కాల్వలలోకి సాగు నీరు వదలడం నిజంగా రికార్డేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడు మండలాలకు ప్రయోజనం..

59.5కి.మీ. వరకు కాల్వ పనుల తవ్వకానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇందుకోసం గతేడాది రూ. 178.09 కోట్లు మంజూరు చేసి, పనులను ఏజెన్సీకి అప్పగించింది. గుత్తేదారు రెండు నెలల్లోనే దాదాపు 10 కిలోమీటర్ల మేర కాల్వను తవ్వారు. 29వ ప్యాకేజీ ద్వారా కల్వకుర్తి మండలానికి 32,777 ఎకరాలకు మాత్ర మే సాగునీరందుతుంది. డీ-82 ద్వారా 37,742 ఎకరాల ఆయకట్టును పెంచుతూ ప్ర భుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వంగూరు మండలం 6 వేల ఎకరాలతో కలిపి మొత్తం కల్వకుర్తి(అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూర్) లో 75, 519 ఎకరాలకు సాగునీరందనున్నది. గ్రావిటీ ద్వారా సాగునీరు వ స్తుండటంతో అదనంగా మరో 10 వేల ఎకరాలకు సాగునీరు అం దే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. డీ-82 ద్వారా వెల్దండలో 16,320, ఆమనగల్‌లో 2,616, మాడ్గులలో 18,756 ఎకరాలకు అదనంగా సాగునీరు అందుతుంది.

శరవేగంగా డీ-82 పనులు..

డీ-82 కాల్వ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆగస్టు నాటికి మాడ్గుల మండలం నాగిళ్లకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో పనులు చేపడుతున్నారు. కేఎల్ఐ 29వ ప్యాకేజీ 160 కి.మీ. టెయిల్ ఎండ్ నుంచి డీ-82 పనులు ప్రారంభించి ఇప్పటికీ దాదాపు 10 కిలోమీటర్ల కాల్వ పనులు పూర్తి చేశారు. పనులు చేస్తున్న డీ-82 కాల్వలోకి, పనులు పూర్తయిన కాడికి 160 టెయిల్ ఎండ్ నుంచి సాగునీళ్లు వదిలారు. దాదాపు 4 కిలోమీటర్లు డీ-82లో నీళ్లు ముందుకు పారాయి. డీ-82 కాల్వలో కృష్ణా జలాలు పారుతుండటంతో జంగారెడ్డిపల్లిలోని దిగువ ప్రాంతం, ఎల్లికల్, వంగూర్ మండలం పోల్కంపల్లి, కొండారెడ్డిపల్లి తదితర గ్రామ చెరువులకు సాగునీరు చేరుతుంది. దాదాపు 2 నుంచి 3 వేల ఎకరాలకు ప్రత్యక్షంగా.. పరోక్షంగా సాగునీరు అందుతుండటంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు.



డీ-82 కాల్వలోకి నీళ్లు వదులుతూ పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కశిరెడ్డి (ఫైల్). (ఇన్‌సెట్‌లో) 29వ ప్యాకేజీ టెయిల్ ఎండ్ నుంచి డీ-82 కాల్వలోకి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ



మెదక్, మహబూబ్‌నగర్ గెలుపు జోరు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ20 లీగ్(టీటీఎల్)లో మెదక్ మావెరిక్స్, ఎమ్ఎల్ఆర్ రాయల్స్ మహబూబ్‌నగర్ అదిరిపోయే విజయాలతో ఆకట్టుకున్నాయి. స్థానిక ఉప్పల్ మైదానంలో కరీంనగర్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మెదక్ మావెరిక్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కరీంనగర్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యఛేదనలో జైస్వాల్(44), మల్లికార్జున్(34), అభిరత్‌రెడ్డి(30) రాణింపుతో 19.4 ఓవర్లలో గెలిచింది. అమోల్ షిండే(2/14) రెండు వికెట్లు తీశాడు. తొలుత రాహుల్(71), వంశీ వర్ధన్‌రెడ్డి(54) అర్ధసెంచరీలతో కరీంనగర్ 20 ఓవర్లలో 167/7 స్కోరు సాధించింది. ప్రణీత్‌రాజ్(3/9) రాణించాడు. మరో మ్యాచ్‌లో ఎమ్ఎల్ఆర్ రాయల్స్ మహబూబ్‌నగర్..19 పరుగుల తేడాతో నల్లగొండ లయన్స్‌పై గెలిచింది. తిలక్‌వర్మ(65), నీల్‌కమల్(33)రాణింపుతో ఎమ్ఎల్ఆర్ జట్టు 20 ఓవర్లలో 153/6 స్కోరు చేసింది. తర్వాత లక్ష్యఛేదనలో నల్లగొండ 134/7 స్కోరుకు పరిమితమైంది.

భువీ శిఖరం

ఫార్మాట్ మారినా..భారత్ ప్రదర్శనలో జోరుతగ్గలేదు. ప్రత్యర్థి దక్షిణాఫ్రికాపై తమదైన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ కోహ్లీసేన వరుస విజయాలతో అదరగొడుతున్నది. వన్డే సిరీస్ విజయమిచ్చిన ఊపులో టీ20లోనూ సఫారీలను చిత్తుచేస్తూ అదిరిపోయే బోణీ కొట్టింది. ధవన్ దంచుడుతో దక్షిణాఫ్రికాపై భారత్ భారీ స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో భువనేశ్వర్ తనదైన స్వింగ్ మాయాజాలంతో సఫారీల పతనాన్ని శాసించాడు. ఐదు వికెట్ల విజృంభణతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.



భువనేశ్వర్ (5/24)

ధవన్ (72)

అర్ధసెంచరీతో ఆకట్టుకున్న ధవన్

ఐదు వికెట్లతో భువీ విజృంభణ

తొలి టీ20లో భారత్ విజయం

జొహన్నెస్‌బర్గ్: భారత్‌కు ఎదురన్నది లేకుండా పోయింది. దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపైనే ఓడిస్తూ కొత్త చరిత్రకు నాందిపలికిన కోహ్లీ సేన..పొట్టి ఫార్మాట్‌లోనూ పైచేయి తమదేనని నిరూపించుకున్నది. ఆదివారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. టీమ్ఇండియా నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 175/9 స్కోరు చేసింది. భువీ(5/24) కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలతో ఆకట్టుకున్నాడు. హెండ్రిక్స్(50 బంతుల్లో 70, 8ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో రాణించాడు. తొలుత శిఖర్ ధవన్(39 బంతుల్లో 72, 10ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో203/5 స్కోరు అందుకుంది. మనీశ్‌పాండే(29 నాటౌట్), కోహ్లీ(26) ఫర్వాలేదనిపించారు. జూనియర్ దాల(2/47) రెండు వికెట్లు తీశాడు. ఐదు వికెట్లతో భారత్ గెలుపులో కీలకమైన భువీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఈనెల 21న జరుగుతుంది.

భువీ భళా: భారత్ నిర్దేశించిన 204 పరుగుల కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు స్మట్స్(14), హెండ్రిక్స్(70) శుభారంభాన్నిచ్చారు. ఉనద్కట్ బౌలింగ్‌లో వరుస బౌండరీలతో స్మట్స్ ఆకట్టుకున్నాడు. మరోవైపు తానేం తక్కువ కాదన్నట్లు హెండ్రిక్స్ చెలరేగాడు. అయితే భువీ బౌలింగ్‌లో ధవన్ క్యాచ్‌తో స్మట్స్ తొలి వికెట్‌గా ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ డుమిని(3) కూడా భువీకే చిక్కాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే రికి దక్షిణాఫ్రికా 2 వికెట్లకు 41 పరుగులు చేసింది. వచ్చి రావడంతోనే ఓ సిక్స్‌తో ఊపుమీద కనిపించిన మిల్లర్(9)..హార్దిక్ పాండ్యా(1/45)స్లో బంతికి బలయ్యాడు. ఓవైపు సహచరులు వెంటవెంటనే ఔట్ అవుతున్నా...ఆత్మవిశ్వాసం కోల్పోని హెండ్రిక్స్‌కు బెహర్డీన్(39) జతకలిశాడు. వీరిద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు విలువైన పరుగులు జతచేశారు. ఈ క్రమంలో బౌండరీలతో చెలరేగిన హెండ్రిక్స్ తన కెరీర్‌లో తొలి అర్ధసెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. లక్ష్యఛేదన దిశగా సాగుతున్న క్రమంలో బెహర్డీన్‌ను చాహల్(1/39) ఊరించే బంతితో ఔట్ చేశాడు. క్లాసెన్(16) ఆకట్టుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. భువీ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్ మ్యాచ్‌ను కీలక మలుపు తిప్పింది. హెండ్రిక్స్, క్లాసెన్, మోరిస్(0), ప్యాటర్‌సన్(1) ఒకే ఓవర్లో ఔటయ్యారు. తన కెరీర్‌లో భువీ అత్యుత్తమ గణాంకాలను నమోదు చేశాడు. ఆఖర్లో ఫెల్కువాయో(13)ను ఔట్ చేసి ఉనద్కట్..దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు.

ధవన్ దంచాడు: తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డుమిని..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ(21) తొలి ఓవర్లోనే రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 18 పరుగులు కొల్లగొట్టాడు. అయితే దాల వేసిన మరుసటి ఓవర్లోనే కీపర్ క్లాసెన్ క్యాచ్ ద్వారా రోహిత్ వెనుదిరిగాడు. కెప్టెన్ కోహ్లీకి బదులు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రైనా ఓ సిక్స్, ఫోర్‌తో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో ఓసారి ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న రైనా..దాల చేతికి చిక్కాడు. ధవన్(72)కు కోహ్లీ(26) జత కలిశాడు. వీరిద్దరు తమదైన ఫామ్‌ను కొనసాగిస్తూ బౌండరీలతో కదంతొక్కారు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 78/2 స్కోరుతో నిలిచింది. 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌ను బెహర్డీన్ జారవిడువడంతో దక్కిన అవకాశాన్ని ఫోర్, సిక్స్‌గా మలిచి స్కోరుబోర్డును పరిగెత్తించాడు. జోరు అందుకున్న తరుణంలో షమ్సి బౌలింగ్‌లో విరాట్ వికెట్ల ముందు దొరికిపోయాడు. మూడో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా..దూకుడు తగ్గించని ధవన్..మనీశ్ పాండే (29 నాటౌట్)ను అండగా చేసుకుని చెలరేగాడు. ఈ క్రమంలో 27 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారీ స్కోరు దిశగా టీమ్ఇండియా సాగుతున్న తరుణంలో ధవన్..స్కూప్‌షాట్ కోసం ప్రయత్నించి నాలుగో వికెట్‌గా నిష్క్రమించాడు. దీని తర్వాత భారత ఇన్నింగ్స్ మందగించింది. ధోనీ(16), మనీశ్ ఇద్దరు కలిసి 21 బంతుల్లో కేవలం 28 పరుగులకే పరిమితమయ్యారు. భారీ షాట్ ఆడే క్రమంలో మోరిస్ బౌలింగ్‌లో ధోనీ క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. ఆఖర్లో హార్దిక్‌పాండ్యా(13 నాటౌట్) వరుసగా బౌండరీలతో భారత్ 203/5 స్కోరు అందుకుంది. దాల(2/47)కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్‌శర్మ (సి)క్లాసెన్(బి)దాల 21, ధవన్(సి)క్లాసెన్(బి)ఫెలుక్వాయో 72, రైనా(సి&బి) 15, కోహ్లీ(ఎల్బీ) 26, పాండే 29 నాటౌట్, ధోనీ(బి)మోరిస్ 16, హార్దిక్ 13 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 11; మొత్తం: 20 ఓవర్లలో 203/5; **వికెట్ల పతనం:** 1-23, 2-49, 3-108, 4-155, 5-183; **బౌలింగ్:** ప్యాటర్సన్ 4-0-48-0, దాల 4-0-47-2, మోరిస్ 4-0-39-1, షమ్సి 4-0-37-1, స్మట్స్ 2-0-14-0, ఫెలుక్వాయో 2-0-16-1.

దక్షిణాఫ్రికా: స్మట్స్(సి)ధవన్(బి)భువనేశ్వర్ 14, హెండ్రిక్స్ (సి)ధోనీ(బి)భువనేశ్వర్ 70, డుమిని(సి)రైనా(బి)భువనేశ్వర్ 3, మిల్లర్(సి)ధవన్(బి)హార్దిక్ 9, బెహార్డీన్(సి)పాండే(బి)చాహల్ 39, క్లాసెన్(సి)రైనా(బి)భువనేశ్వర్ 16, ఫెలుక్వాయో(సి)చాహల్(బి)ఉనద్కట్ 13, మోరిస్(సి)రైనా(బి)భువనేశ్వర్ 0, ప్యాటర్సన్(రనౌట్)1, దాల 2 నాటౌట్, శంసీ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 8; **మొత్తం:** 20 ఓవర్లలో 175/9; **వికెట్ల పతనం:** 1-29, 2-38, 3-48, 4-129, 5-154, 6-158, 7-158, 8-159, 9-175; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-24-5, ఉనద్కట్ 4-0-33-1, బుమ్రా 4-0-32-0, హార్దిక్ 4-0-45-1, చాహల్ 4-0-39-1.

1 మూడు ఫార్మాట్లలోనూ ఐదు వికెట్ల ఫీట్ సాధించిన తొలి భారత బౌలర్ భువీ

2 టీ20ల్లో ఐదు వికెట్లు సాధించిన రెండో భారత బౌలర్ భువనేశ్వర్. ఇతని కంటే ముందు చహల్ ఉన్నాడు.

78 పవర్ ప్లేలో భారత్ సాధించిన పరుగులు. టీ20ల్లో మనకు ఇదే అత్యధికం

203 టీ20ల్లో దక్షిణాఫ్రికాపై భారత్ అత్యధిక స్కోరు. అంతకుముందు 199/5 అత్యుత్తమం

అమ్మాయిల జోరుకు బ్రేక్

■ మూడో టీ20లో దక్షిణాఫ్రికా మహిళల గెలుపు



హర్మన్‌ప్రీత్ (48)

జొహన్నెస్‌బర్గ్: భారత మహిళల జట్టు వరుస విజయాలకు బ్రేక్ పడింది. వరుసగా మూడో టీ20లోనూ గెలిచి దక్షిణాఫ్రికా గడ్డపై చరిత్ర సృష్టిద్దామనుకున్న భారత మహిళలకు దక్షిణాఫ్రికా మహిళా జట్టు నుంచి ప్రతిఘటన ఎదురైంది.మిడిలార్డర్ వైఫల్యం కారణంగా దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన మూడో టీ20లో హర్మన్‌ప్రీత్ సేన 5 వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-2తో రేసులోకొచ్చింది. భారత జట్టు విధించిన 134 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 5 వికెట్లు నష్టపోయి 19 ఓవర్లలో ఛేదించింది. సునే లుస్ (41), ట్రయాన్ (34) రాణించగా..కెప్టెన్ నీకెర్క్ (26), డుప్రీజ్ (20) ఫరవాలేదనిపించారు. భారత బౌలర్లలో వస్త్రాకర్‌కు 2, గైక్వాడ్, పాటిల్, పూనమ్‌కు తలో వికెట్ దక్కింది.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు ..సఫారీ బౌలర్ షబ్నిమ్ (5/30) ధాటికి 17.5 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌట్ అయింది. ఫాంలో ఉన్న ఓపెనర్ మిథాలీరాజ్ తాను ఎదుర్కొన్న రెండో బంతికే డకౌట్ అయింది. ఆ తర్వాత స్మృతి మంధన, కెప్టెన్ హర్మన్ ప్రీత్ భారత్‌ను ఆదుకున్నారు. ఈ జోడి రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఈ దశలో మంధన (37) పెవిలియన్ చేరడంతో జెమీమాతో కలిసి హర్మన్ స్కోరు బోర్డును కదిలించింది. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 38 పరుగులు జోడించారు.ఈ దశలో సఫారీ బౌలర్ షబ్నిమ్ విజృంభించడంతో భారత్ వెంటవెంటనే వికెట్లు కోల్పోయింది. వేద కృష్ణమూర్తి (23) మినహా మిగతా వారంతా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో భారత్ స్వల్ప స్కోరుకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో క్లాస్‌కు 2, నీకెర్క్, కాప్, డేనియల్స్‌కు తలో వికెట్ దక్కింది. ఐదు వికెట్లు పడగొట్టిన షబ్నిమ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 ఈనెల 21న సెంచూరియన్‌లో జరుగుతుంది.

స్కోర్ బోర్డు: భారత మహిళలు: 133 ఆలౌట్ (హర్మన్ 48, మంధన 37, షబ్నిమ్ 5/30) **దక్షిణాఫ్రికా మహిళలు:** 134/5 (సునె లుస్ 41, ట్రయాన్ 34, పూజ 2/21)

ధోనీని 'నాలుగు'లో ఆడించండి!

■ కోహ్లీకి సెహ్వాగ్ సూచన



న్యూఢిల్లీ: భారత్ మరింత నిలకడగా విజయాలు సాధించాలంటే.. మాజీ సారథి ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాలని మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్.. కెప్టెన్ విరాట్ కోహ్లీకి సలహా ఇచ్చాడు. మహీని ప్రమోట్ చేస్తూ నాలుగోస్థానంలో ఆడించాలన్నాడు. ఈ మార్పు వల్ల జట్టుకు పరిపూర్ణమైన ఫినిషర్ లేకుండా పోతాడని విరాట్ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నాడు. 'దక్షిణాఫ్రికాపై 5-1తో సిరీస్ గెలిచినా బ్యాటింగ్ ఆర్డర్‌లో సమస్యలు కొన్ని అలాగే ఉన్నాయి. జట్టులో మరింత స్థిరత్వం రావాలంటే ధోనీని ముందుకు తీసుకురావాలి. ఫినిషింగ్ బాధ్యతను కేదార్ జాదవ్, మనీష్ పాండే, హార్దిక్ పాండ్యాలలో ఒకరికి అప్పగించాలి. దీనివల్ల మిడిలార్డర్ బలం మరింత పెరుగుతుందని నా నమ్మకం. విదేశీ వికెట్లపై కూడా ఈ వ్యూహం బాగా పని చేస్తుంది. ఒకవేళ ధోనీ ముందుకొచ్చి తొందరగా వికెట్లు పడితే ఎలా అనే ఆందోళన కోహ్లీకి అవసరమే లేదు. ఎందుకంటే లోయర్ ఆర్డర్‌లో కనీసం ఇద్దరు బ్యాట్స్‌మన్ అందుబాటులో ఉంటారు' అని వీరూ పేర్కొన్నాడు.

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత దైక్సెట్టిపేట



గార్ల, ఫిబ్రవరి 18: మండలకేంద్రంలోని శ్రీగంజి సీతమ్మ క్రీడా మైదానంలో సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్ నేతృత్వంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ స్థానంలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట(రూ. 25,116), ద్వితీయ స్థానం సూర్యాపేట జిల్లా యర్రంపాడు(రూ. 20,116) తృతీయ స్థానం మహబూబాబాద్(రూ. 15116), నాలుగో స్థానం వరంగల్(రూ. 10,116), ఐదో స్థానం ఖమ్మం జిల్లా మేడపల్లి(రూ. 5,116), మహబూబాబాద్ జిల్లా మాదాపురం(రూ. 3,116) ఆరో స్థానంలో నిలిచాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

మున్రో మెరుపుల్..

- 18 బంతుల్లో అర్ధ సెంచరీ
- ఇంగ్లండ్ గెలిచినా..ఫైనల్‌కు న్యూజిలాండ్
- కివీస్‌కు కలిసొచ్చిన నెట్ రన్‌రేట్
- ఈనెల 21న ఆస్ట్రేలియాతో తుదిపోరు




మున్రో (57)

హామిల్టన్: న్యూజిలాండ్ ఓపెనర్ కొలిన్ మున్రో ఇంగ్లండ్ బౌలర్లపై మెరుపు దాడితో18 బంతుల్లోనే అర్ధశతకం సాధించి సంచలనం సృష్టించాడు. క్రికెట్‌లో ఆరో వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఆదివారం ఇక్కడ ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ విజయానికి ఆరు బంతుల్లో 12 పరుగులు అవసరమవగా, ఇంగ్లండ్ బౌలర్ కుర్రన్ పొదుపుగా బౌలింగ్ వేసి 9 పరుగులే ఇవ్వడంతో కివీస్ ఓడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఇయాన్ మోర్గాన్ (80 నాటౌట్) దుమ్మురేపగా, డేవిడ్ మలాన్ (36 బంతుల్లో 53; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. న్యూజిలాండ్ బౌలర్లలో బౌల్ట్‌కు 3, సోధీకి 2 వికెట్లు దక్కాయి. 195 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 192 పరుగులు చేసింది. ఓపెనర్ గుప్టిల్ (62) మున్రో (21 బంతుల్లో 57; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) భీకర ఇన్నింగ్స్‌తో చెలరేగినా, చాప్‌మన్ (37 నాటౌట్) పోరాడినా కివీస్‌కు ఓటమి తప్పలేదు.


న్యూజిలాండ్ ఓటమిపాలైనప్పటికీ..మెరుగైన నెట్‌రన్ రేట్‌తో ముక్కోణపు టీ20 సిరీస్ ఫైనల్లో ప్రవేశించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ న్యూజిలాండ్‌పై 20 పరుగుల తేడాతో గెలిస్తే ఫైనల్ చేరేదే. కానీ న్యూజిలాండ్ కేవలం రెండు పరుగుల వ్యత్యాసంతో ఓడటంతో ఇంగ్లండ్ అవకాశాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఈనెల 21న ఆస్ట్రేలియాతో ఫైనల్లో తలపడుతుంది.

లంకదే టీ20 సిరీస్



సిల్‌హెట్: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టీ20లో శ్రీలంక 75 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్నది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తొలుత శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 70) విజృంభించగా..గుణతిలక (42), పెరేర (31) షనక (30) ఆకట్టుకున్నారు. 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైన బంగ్లాదేశ్ 18.4 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌట్ అయింది.

డివిలీయర్స్ ఔట్



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా జట్టును గాయా లు వేధిస్తూనే ఉన్నాయి. ఇప్పటికే డుప్లెసిస్, డీకాక్ గాయాలతో జట్టుకు దూరం కాగా, తాజాగా డివిలీయర్స్ టీ20 సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భారత్‌తో వన్డే సిరీస్ సందర్భంగా డివీలియర్స్ మోకాలికి గాయమైంది. పూర్తిగా కోలుకోవడానికి సమయం పట్టే అవకాశముందని దక్షిణాఫ్రికా టీమ్ మేనేజర్ మహ్మద్ మూసాజీ మీడియాతో తెలిపారు. దీనికి తోడు మార్చి 1నుంచి ఆస్ట్రేలియాతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని డివిలీయర్స్‌కు విశ్రాంతినివ్వాలన్న తలంపుతో క్రికెట్ దక్షిణాఫ్రికా(సీఎస్ఏ) ఉన్నది.

అచ్చం జొకోవిచ్ లాగే..



వాల్టీయర్ జొకోవిచ్

ప్యుయాంగ్‌చాంగ్: మనిషిని పోలిన మనుషులు ఉండటం సహజం. ఈ ప్రపంచంలో ఏదో ఒక మూలన ఒకే పోలికలతో ఉండే వాళ్లు..ఎప్పుడో ఒక సందర్భంలో బయటపడుతారు. దక్షిణకొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో మెరిసిన ఫ్రాన్స్ స్కేటర్ పియరీ వాల్టీయర్..అచ్చం సెర్బియా టెన్నిస్ కింగ్ నోవాక్ జొకోవిచ్ లాగే ఉండటం విశేషం. ఇద్దరిని దగ్గరి నుంచి చూస్తే కవల సోదరుల్లాగా కనిపించడం ఖాయం. తాను ఎంతగానో అభిమానించే జొకోవిచ్‌ను ఒకసారి కలుసుకోవాలని వాల్టీయర్ తన మనస్సులో మాటను ఫ్రెంచ్ మీడియాతో పంచుకున్నాడు. దీనికి జొకో ట్విట్టర్‌లో స్పందించాడు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐటీబీపీలో 134 కానిస్టేబుల్ డ్రైవర్లు

- పదోతరగతి, మోటార్ డ్రైవింగ్ వచ్చిన వారికి అవకాశం
- రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్‌లతో ఎంపిక
- కేంద్ర బలగాల్లో కొలువులు
- చివరితేదీ: మార్చి 15

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) నాన్ గెజిటెడ్ విభాగంలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఐటీబీపీని 1962, అక్టోబర్ 24న ఏర్పాటు చేశారు. మొదట్లో ఇది సీఆర్‌పీఎఫ్ యాక్టు కింద పనిచేసేది. తర్వాత 1992లో ఐటీబీపీని ప్రత్యేక దళంగా గుర్తించారు.

- **పోస్టు పేరు:** కానిస్టేబుల్ (డ్రైవర్)
- మొత్తం ఖాళీల సంఖ్య - 134 (జనరల్-47, ఎస్సీ -68, ఎస్టీ - 5, ఓబీసీ (ఎన్‌సీఎల్) - 14)
- ఈ పోస్టులు గ్రూప్ సీ (నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్) పోస్టులు.
- మొదట తాత్కాలిక ప్రాతిపదికన భర్తీచేసి తర్వాత పర్మినెంట్ చేస్తారు.
- **విద్యార్హతలు:** పదోతరగతి/ మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత. లైట్/మీడియం లేదా హెవీ మోటార్ (ట్రాన్స్‌పోర్టు) వెహికిల్ లైసెన్స్ కలిగి ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** మార్చి 15 నాటికి 21 - 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్లకు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పేస్కేల్:** రూ. 21,700 - 69,100 (లెవల్ 3 పే మ్యాట్రిక్స్). వీటికి అదనంగా డీఏ, రేషన్, వాషింగ్ అలవెన్స్, టీఏ, ఉచిత వసతి/ హెచ్‌ఆర్‌ఏ తదితర అలవెన్సులు ఇస్తారు.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు - 170 సెం.మీ., ఛాతీ- 80 సెం.మీ., గాలిపీల్చినప్పుడు 5 సెం.మీ. వరకు వ్యాకోచించాలి.
- **బరువు:** ఎత్తుకుతగ్గ బరువు ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **నోట్:** ఈశాన్య రాష్ట్రాలు, ఎస్టీ అభ్యర్థులకు శారీరక ప్రమాణాల్లో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఎత్తు పరీక్ష, పీఈటీ, పీఎస్‌టీ, రాతపరీక్ష ద్వారా.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.recruitment.itbpolice.nic.in.

- **ఎత్తు పరీక్ష:** రిక్రూట్‌మెంట్‌లో మొదట అభ్యర్థుల ఎత్తు కొలుస్తారు. దీనిలో అర్హత సాధించినవారిని తర్వాతి దశల్లోకి ఎంపికచేస్తారు.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ):
- 1.6 కి.మీ. దూరాన్ని 7.30 నిమిషాల్లో పరుగెత్తాలి.
- 11 అడుగుల లాంగ్‌జంప్‌ను మూడు అవకాశాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది.
- హైజంప్‌లో మూడున్నర అడుగుల ఎత్తును మూడు అవకాశాల్లో దూకాలి.
- పై పరీక్షలన్నీ అర్హత పరీక్షలు మాత్రమే.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ):
- పీఈటీలో అర్హత సాధించినవారికి ఎత్తు, ఛాతీ, బరువు తదితర శారీరక పరీక్షలను నిర్వహిస్తారు. దీనిలో అర్హత సాధించినవారిని రాతపరీక్షకు ఎంపికచేస్తారు.
- **రాతపరీక్ష:** పై పరీక్షలన్నింటిలో అర్హత సాధించినవారిని రాతపరీక్షకు అనుమతిస్తారు.
- రాతపరీక్ష 100 మార్కులకు నిర్వహిస్తారు.
- ఆబ్జెక్టివ్ పద్ధతిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఇస్తారు.
- జవాబులను ఓఎంఆర్ పత్రంలో బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్నుతో గుర్తించాలి.
- జనరల్ నాలెడ్జ్- 10, మ్యాథ్స్- 10, హిందీ- 10, ఇంగ్లిష్- 10, ట్రేడ్ సంబంధిత ప్రశ్నలు- 60 ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు. 100 మార్కులు.
- పరీక్ష కాలవ్యవధి 2 గంటలు.
- జనరల్, ఎక్స్‌సర్వీస్‌మెన్లకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 33 శాతం మార్కులు క్వాలిఫయింగ్‌గా నిర్ణయించారు.
- రాతపరీక్షలో అర్హత సాధించినవారికి ప్రాక్టికల్ టెస్ట్ నిర్వహిస్తారు.
- ప్రాక్టికల్ టెస్ట్ 50 మార్కులకు ఉంటుంది. దీనిలో అర్హత సాధించినవారి నుంచి తుది జాబితాను తయారుచేస్తారు.

డీఆర్‌డీవోలో జేఆర్‌ఎఫ్

న్యూఢిల్లీలోని డిఫెన్స్ సైంటిఫిక్ ఇన్ఫర్మేషన్ అండ్ డాక్యుమెంటేషన్ సెంటర్ (డీఈఎస్‌ఐడీవోసీ) ఖాళీగా ఉన్న జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

డీఈఎస్‌ఐడీవోసీ అనేది డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పరిధిలో పనిచేస్తుంది.

- **పోస్టు:** జేఆర్‌ఎఫ్- 3 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ (బేసిక్ సైన్స్) + నెట్ లేదా బీఈ/బీటెక్‌తోపాటు నెట్/గేట్ లేదా ఎంఈ/ఎంటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. డాటా అనాలసిస్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, మేథమెటికల్ మోడలింగ్, విజువలైజేషన్ రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 25,000+ హెచ్‌ఆర్‌ఏ అలవెన్సులు ఉంటాయి.



- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ లేదా ఈ -మెయిల్ (director@desidoc.drdo.in) ద్వారా. సంబంధిత అర్హత, ఎక్స్‌పీరియన్స్ తదితర సర్టిఫికెట్లను జతపరిచి పర్సనల్ అధికారికి పంపాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 27
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

ఫీల్డ్ అమ్యునిషన్ డిపోలో 125 ఖాళీలు

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ పరిధిలో పనిచేస్తున్న 24 ఫీల్డ్ అమ్యునిషన్ డిపో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఫైర్‌మెన్, ఎల్‌డీసీ, ట్రేడ్స్ మెన్ మేట్, తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది .

వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 125
- **విభాగాలవారీగా ఖాళీలు:**
- మెటీరియల్ అసిస్టెంట్-8, లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)-11, ఫైర్ మెన్-4, ట్రేడ్స్‌మెన్ మేట్-102
- **అర్హత:** ట్రేడ్స్‌మెన్ మేట్ పోస్టులకు పదోతరగతి/మెట్రిక్యులేషన్, ఎల్‌డీసీ పోస్టులకు ఇంటర్‌తోపాటు టైపింగ్ స్కిల్స్ ఉండాలి, మెటీరియల్ అసిస్టెంట్‌కు డిప్లొమాలో ఉత్తీర్ణత. ఫైర్‌మెన్‌కు మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతో పాటు కనీసం 165 సెం.మీ. ఎత్తు, ఛాతీ - 81.5 సెం.మీ. నుంచి 85 సెం.మీ., బరువు కనీసం 50 కేజీలు ఉండాలి.
- **వయస్సు:** 18-27 ఏండ్ల మధ్య ఉండాలి (మెటీరియల్ అసిస్టెంట్‌కు 18 నుంచి 25 ఏండ్లు).



- **పే స్కేల్:** రూ. 18,000(ఎల్‌డీసీ/ఫైర్ మెన్‌కు పే రూ.19,900), మెటీరియల్ అసిస్టెంట్‌కు రూ. 29,200/-
- **ఎంపిక:** ఆబ్జెక్టివ్ రాతపరీక్ష (ట్రేడ్స్‌మెన్/ఫైర్‌మెన్ అభ్యర్థులకు రాతపరీక్షతో పాటు ఫిజికల్ టెస్ట్ ఉంటుంది)
- రాత పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. దీనికి కేటాయించిన సమయం రెండు గంటలు
- ఆబ్జెక్టివ్ రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్-25 మార్కులు, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ -25 మార్కులు, జనరల్ ఇంగ్లిష్- 50 మార్కులు, జనరల్ అవేర్‌నేస్-50 మార్కులు వస్తాయి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన తేదీ నుంచి 21 రోజుల్లోగా పంపాలి. పూర్తి వివరాల కోసం ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి10-16) లేదా www.ncs.gov.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.indianarmy.nic.in

ఏటీఐఈపీఐలో కన్సల్టెంట్లు

హైదరాబాద్ రామంతపూర్‌లోని అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఏటీఐఈపీఐ) ఖాళీగా ఉన్న కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి (కాంట్రాక్టు ప్రాతిపదికన) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

నైపుణ్య అభివృద్ధి, పారిశ్రామికీకరణ మంత్రిత్వ శాఖ పరిధిలో ఏటీఐఈపీఐ పనిచేస్తుంది.

- **పోస్టు పేరు:** కన్సల్టెంట్ -7 ఖాళీలు (ఈసీఈ-4, సీఎస్‌ఈ/ఐటీ-2, ఈఈఈ-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత రంగంలో రెండేండ్ల అనుభవం లేదా డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2018 ఫిబ్రవరి 26 నాటికి 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 30,000 (కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** రాతపరీక్ష/వైవా వాయిస్ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో.



చిరునామా: Director, ATI – EPI, D.G.T.,M.S.D.E.,Ramanthapur, Uppal Road,Hyderabad, – 500 013

- **చివరితేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** www.atepihyderabad.gov.in

రాయ్‌పూర్ ఎయిమ్స్‌లో ప్రొఫెసర్లు

రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసోసియేట్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

రాయ్‌పూర్ ఎయిమ్స్ అనేది మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇండియా పరిధిలో పనిచేస్తుంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 75 పోస్టులు (అసోసియేట్ ప్రొఫెసర్-45, అసిస్టెంట్ ప్రొఫెసర్-27)
- **విభాగాలు:** అనస్థీషియాలజీ, బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియోథోరాసిక్ సర్జరీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రిమినాలజీ & మెటబాలిజమ్, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ/హెమటాలజీ, నియోనాటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, రేడియో డయాగ్నసిస్, రేడియోథెరపీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో పీజీ లేదా ఎండీ/ఎంఎస్ లేదా స్పెషలైజేషన్ విభాగంలో పీజీతోపాటు పీహెచ్‌డీ. నాన్ మెడికల్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీ/పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలో ఉత్తీర్ణత. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వం, సంబంధిత టీచింగ్/రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.



- **పే అండ్ అలవెన్సులు:**
- **అసోసియేట్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4):** రూ.37,400-67,000+అకడమిక్ గ్రేడ్ పే రూ. 9,000/-
- **అసిస్టెంట్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 3):** రూ.15,600-39,100+అకడమిక్ గ్రేడ్ పే రూ. 8,000/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **ప్రొబేషనరీ పీరియడ్:** రెండేండ్లు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** www.aiimsraipur.edu.in